www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 28-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 42 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: విదియ రా.1:55 తదుపరి తదియ, నక్షత్రం: మృగశిర రా.12:29 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: ఉ.7:53 నుంచి 9:19 వరకు, దుర్ముహూర్తం: ఉ.11:46-12:38, అమృతఘడియలు: సా.4:32-5:59, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:44,సూర్యాస్తమయం: 6:41 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మందకృష్ణకు పద్మశ్రీ

కేఎల్ కృష్ణ, వదిరాజ్ రాఘవేంద్రాచార్యకు కూడా

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రదానం

పద్మభూషణ్ స్వీకరించిన సినీ నటి శోభన 12

మొత్తం 68 మందికి పద్మ పురస్కారాల అందజేత



రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మందకృష్ణ

కాంగ్రెస్‌తో రాయబారం!

హస్తం గూటికి చేరేందుకు కవిత యత్నాలు

మధ్యవర్తి ద్వారా అధిష్ఠానంతో సంప్రదింపులు



సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ దృష్టికి తెచ్చిన అధిష్ఠానం

ప్రస్తుత పరిస్థితుల్లో వద్దని కాంగ్రెస్ నేతల నిర్ణయం

కేసీఆర్ కుటుంబ కలహాలకు కాంగ్రెస్ కారణమన్న

తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళతాయని అభిప్రాయం

కారు దిగి చేయి అందుకునేందుకు ఎమ్మెల్యేల పావులు

కవిత బాటలో ఆ పార్టీని ఇప్పుడే వీడాలని యోచన

వారిలో అత్యధికులు గ్రేటర్‌లోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే!

లేఖలు, లీకుల కలకలంతోపాటు భవిష్యత్తూ కారణమే

అదే సమయంలో, సొంత అడుగుల దిశగా కవిత

క్షేత్రస్థాయిలో బలం పెంచుకునేందుకు పావులు

గతంలో తనకు మంచి పట్టున్న సింగరేణిపై దృష్టి

సింగరేణి జాగృతి పేరిట కొత్త సంఘం ఏర్పాటు

కార్మికులతో భేటీ.. కో ఆర్డినేటర్ల నియామకం

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌కు లేఖాస్త్రం సంధించి ధిక్కార స్వరం వినిపించిన ఆయన తనయ కవిత కాంగ్రెస్ అధిష్ఠానంతో రాయబారం నడిపారా!? ఆ పార్టీలో చేరేందుకు ప్రయత్నం చేశారా!? ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ అధిష్ఠానం అందుకు 'నో' చెప్పిందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు! లేఖలు, లీకుల ద్వారా బీఆర్ఎస్‌లో కలకలం నెలకొన్న సమయంలోనే.. ఓ మధ్యవర్తి ద్వారా ఆమె కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సంప్రదించారని ఆ వర్గాలు వివరించాయి. ఇటీవల రెండు మూడు రోజులపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీలోనే మకాం వేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే, కవిత ప్రతిపాదనను కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలు వారిద్దరి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపాయి. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఆమెను చేర్చుకోవడం మంచిది కాదని వారిద్దరూ అభిప్రాయపడినట్లు వివరించాయి. పార్టీలో కవితను చేర్చుకుంటే కేసీఆర్ కుటుంబ కలహాలకు కాంగ్రెస్ కారణమన్న తప్పుడు సంకేతాలు వెళతాయని చెప్పినట్లు ఆ వర్గాలు వివరించాయి.



ఇదే అదనుగా..!

బీఆర్ఎస్‌లో తాజా పరిణామాలను గమనిస్తున్న ఆ పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలు 'చేయి' అందుకునేందుకు ముందుకు వస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే కవిత లేఖ.. ఆ తర్వాత లీకులు బీఆర్ఎస్‌లో కలకలం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. కవితతో ఆ పార్టీ పెద్దలు జరిపిన రాయబారమూ విఫలమైంది. సొంతంగా అడుగులు వేసే దిశగా ఆమె ముందుకు సాగుతున్నారు. అదే సమయంలో, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు సంబంధించి కాళేశ్వరం కమిషన్ కేసీఆర్, హరీశ్ రావులకు నోటీసులు జారీ చేసింది. విచారణకు ఇద్దరూ హాజరు కానున్నారు కూడా. ఇక, ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు

మిగతా 13వ పేజీలో...



అమెరికా విద్యార్థి వీసా ఇంటర్వ్యూలు బంద్!

ప్రపంచ వ్యాప్తంగా తక్షణమే అమలులోకి

విదేశీ విద్యార్థుల 'సోషల్' ఖాతాల

తనిఖీకి త్వరలో కఠిన నిబంధనలు

అప్పటిదాకా ఇంటర్వ్యూల నిలుపుదల

ఇప్పటికే షెడ్యూల్ అయిన వారికి ఓకే

క్లాసులు ఎగ్గొడితే.. వీసా రద్దు!

విదేశీ విద్యార్థులకు అమెరికా హెచ్చరిక

హార్వర్డ్‌పై యుద్ధంలో గెలుస్తా

నిధుల్లో కోత విధిస్తా: ట్రంప్

న్యూఢిల్లీ, మే 27: అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలని వీసా కోసం దరఖాస్తు చేసుకున్న విదేశీ విద్యార్థులకు ట్రంప్ ప్రభుత్వం పెద్ద షాకిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థి(స్టూడెంట్) వీసా జారీ కోసం నిర్వహించే ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపి వేసింది. దీంతో భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని అమెరికా ఎంబసీలల్లోనూ విద్యార్థి వీసా ఇంటర్వ్యూలు జరగవు. విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాల తనిఖీలకు సంబంధించి కఠిన నిబంధనలను తీసుకొస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం

మిగతా 2వ పేజీలో...

ఐటీ రిటర్న్‌ల 11

గడువు పెంపు

సెప్టెంబరు 15 వరకు పొడిగింపు

ఐటీఆర్ ఫారాల్లో మార్పుల నేపథ్యంలోనే

బెదిరింపులు నిజమే

సన్‌రైజర్స్‌ను అదనపు టికెట్లు అడిగారు

నిర్ధారించిన విజిలెన్స్ అధికారులు

హెచ్‌సీఏ పై చర్యలకు సిఫారసు

జగన్మోహన్ బెదిరింపులకు

ఆధారాలు ఉన్నాయని వెల్లడి 11



మరో 20 గురుకులాలు

నిర్మాణానికి 4 వేల కోట్లు

పరిపాలనాపరమైన అనుమతులు

జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం 13

ఐదోతరం యుద్ధ విమానాలు..

అమ్కా తయారీలో 2

కీలక ముందడుగు

ఎగ్జిక్యూషన్ మోడల్‌కు రాజ్‌నాథ్ ఆమోదం

'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా తయారీ

దేశీయ ప్రైవేటు సంస్థలకు అవకాశం

2029కల్లా తొలి ప్రొటోటైప్ నమూనా

2032-33కల్లా పూర్తిస్థాయి ఉత్పత్తి

2034లో వాయుసేనకు అందే చాన్స్



జస్టిస్ యశ్వంత్ వర్మపై

అభిశంసన?

భారీగా నోట్ల కట్టలు దొరికిన 2

నేపథ్యంలో చర్యలకు రంగం సిద్ధం!

ఆయనపై ఆరోపణలను ఇప్పటికే

నిర్ధారించిన ముగ్గురు జడ్జిల కమిటీ

అభిశంసనకు సిఫారసు

చేసిన మాజీ చీఫ్ జస్టిస్ ఖన్నా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్, పొంగులేటి

ధాన్యం మొత్తం కొంటాం

రైతులెవరూ ఆందోళన చెందవద్దు

కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లాలి

కల్తీలు, బ్లాక్‌మార్కెటింగ్‌పై ఉక్కుపాదం

జూన్ 3-20 వరకు 3వ దశ రెవెన్యూ సదస్సులు

ఇందిరమ్మ ఇళ్లకు సకాలంలో ఉచిత ఇసుక

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

మంత్రులు రేపు, ఎల్లుండి జిల్లాల్లో పర్యటించాలి

ఈ అంశాలపై 1 నాటికి సమగ్ర నివేదికలివ్వాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో రైతులు పండించిన ధాన్యం మొత్తాన్నీ కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ విషయంలో అన్నదాతలు ఆందోళనపడొద్దని సూచించారు. ఈ ఏడాది రుతుపవనాలు 15 రోజులు ముందుగానే రాష్ట్రంలోకి వచ్చాయని, దీనికి అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు

మిగతా 13వ పేజీలో...

విచారణకు ఓకే

కాళేశ్వరం కమిషన్ ఎదుటకు కేసీఆర్

5న హాజరు కావాలని నిర్ణయం

ఇప్పటికే దీనిపై హరీశ్, కేటీఆర్‌లతో భేటీలు

విచారణకు వెళ్లిన ఇంజనీర్లతోనూ..

ప్రశ్నలు ఎదుర్కొనేందుకు సమాచార సేకరణ

9న హాజరవనున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠకు తెరపడింది. కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరు కావాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. రిటైర్డ్ ఇంజనీర్లు, న్యాయ నిపుణుల సూచనలు, సలహాల అనంతరం జూన్ ఐదో తేదీన విచారణకు హాజరు కావాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. జూన్ 9న విచారణకు హాజరవుతానని ఇప్పటికే మాజీ మంత్రి హరీశ్ రావు

మిగతా 13వ పేజీలో...

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు 12

విదేశీ పర్యటనకు వెళ్లిన మాజీ మంత్రి



10

టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు

నేరుగా రావద్దు

చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే కోరాలి

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచన

తన 'హరిహర వీరమల్లు'కూ ఇదే నిబంధన

సినిమా హాళ్లలో తినుబండారాలు, కూల్‌డ్రింక్స్

ధరలు ప్రేక్షకులకు అందుబాటులో ఉండాలి

సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేశ్‌కు దిశానిర్దేశం

పవన్ కల్యాణ్‌తో ఏకీభవిస్తున్నా: దిల్ రాజు

థియేటర్ల బంద్ నిర్ణయంలో జనసేన నేత

అత్తి సత్యనారాయణ.. పార్టీ నుంచి సస్పెన్షన్

మీ త్యాగాలతోనే

అధికారం!

కార్యకర్తల పోరాటాలతోనే ఈ స్థానం 12

కడప మహానాడు వేదికగా శిరస్సు వంచి వందనం

సంక్షేమం అమలు చేసి చూపిస్తాం

తెలుగు రాష్ట్రాల నేతలంతా టీడీపీ వర్సిటీ విద్యార్థులే

దేశంలో అవినీతి అంతానికి మోదీకి నివేదిక ఇచ్చా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

తెలుగు ప్రజల భవిష్యత్తు కోసం

ఆరు శాసనాలను ప్రతిపాదించిన నారా లోకేశ్



మహానాడు వేదికపై చంద్రబాబును సత్కరిస్తున్న కార్యకర్తలు



పటేల్ మాట వినుంటే

ఉగ్రదాడులు 2

జరిగేవే కాదు!

పీవోకేను స్వాధీనం చేసుకోవాలని

చెప్పినా నాటి పాలకులు పట్టించుకోలేదే

1947లో దేశ విభజన నిర్ణయంతోనే

పాక్ ఉగ్రవాద పరంపర మొదలైంది

అది 75 ఏళ్లుగా కొనసాగుతూనే ఉంది

పాక్ తీరు మారకపోతే తగిన బదులిస్తాం

గుజరాత్‌లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

2.2 కి.మీ.లోపలికెళ్లి విధ్వంసం

పాక్ ఆర్మీ పోస్టులు, ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం

ఆపరేషన్ సిందూర్‌లో సరిహద్దు దాటి దాడులు

పారిపోయిన పాక్ రేంజర్లు: బీఎస్ఎఫ్ వెల్లడి

హైకోర్టుకు ముగ్గురు జడ్జిలు

గతంలో పనిచేసిన న్యాయమూర్తులు సుమలత,

లలిత, అభిషేక్‌రెడ్డి మళ్లీ తెలంగాణకు బదిలీ

యాక్టింగ్ సీజే సుజోయ్‌పాల్ కలకత్తా హైకోర్టుకు

కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కొలీజియం సిఫారసు

దేశవ్యాప్తంగా 21 మంది జడ్జిల బదిలీకి ప్రతిపాదన

తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఏకే సింగ్! 3



జస్టిస్ సుమలత

జస్టిస్ లలిత

జస్టిస్ అభిషేక్‌రెడ్డి

నేడు, రేపు అతి భారీ వర్షాలు

ఆరెంజ్ అలర్ట్.. బంగాళాఖాతంలో అల్పపీడనం

ఆ ప్రభావం రాష్ట్రంపై ఉండదు: వాతావరణ శాఖ

మహబూబ్‌నగర్‌కు విస్తరించిన నైరుతి

తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షం

హైదరాబాద్‌లో జోరువాన.. స్తంభించిన ట్రాఫిక్

లోతట్టు ప్రాంతాలు జలమయం

సిరిసిల్లలో పిడుగుపాటుతో ఒకరి మృతి

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ/ ఆదిలాబాద్/ కాటారం/ కరీంనగర్/ నల్లగొండ/ నారాయణపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బుధ, గురువారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం.. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. బుధవారం జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో అతి భారీ వర్షాలు.. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, యాదాద్రి-భువనగిరి,

మిగతా 12వ పేజీలో...

ఐదోతరం యుద్ధ విమానాలు..
అమ్కా తయారీలో కీలక ముందడుగు

ఎగ్జిక్యూషన్ మోడల్‌ను ఆమోదించిన రాజ్‌నాథ్



న్యూఢిల్లీ, మే 27: 'ఆపరేషన్ సిందూర్' తర్వాత.. శత్రుదేశం పాకిస్థాన్‌కు జే-35ఏస్ ఐదో తరం యుద్ధ విమానాలను అందించేందుకు చైనా సిద్ధమైన నేపథ్యంలో.. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఏఎంసీఏ-అమ్కా) తయారీ దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. ఐదో తరం యుద్ధ విమానాలైన అమ్కా ఎగ్జిక్యూషన్ మోడల్‌ను ఆమోదిస్తూ.. వాటి తయారీకి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అనుమతులిచ్చారు. డీఆర్‌డీవో, ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఏడీఏ)కు ఏఎంసీఏల తయారీ బాధ్యతలను అప్పగించారు. గత ఏడాది మార్చిలో జరిగిన భద్రతపై క్యాబినెట్ కమిటీ(సీసీఎస్) సమావేశంలో 'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా ఐదో తరం యుద్ధ విమానాల తయారీకి రూ.15 వేల కోట్లను కేటాయించిన విషయం తెలిసిందే..! తాజాగా ఈ ప్రాజెక్టును ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో చేపట్టనున్నట్లు రక్షణ శాఖ ప్రకటించింది. ఏడీఏ నేతృత్వంలో.. భారత్‌కు చెందిన ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ యుద్ధ విమానాలు తయారవుతాయి. 'ఏరో ఇండియా-2025' సందర్భంగా దేశీయ పరిజ్ఞానంతో తయారు చేయనున్న అమ్కా నమూనాను తొలిసారి ప్రదర్శించారు. అయితే.. ఏడీఏ ఆధ్వర్యంలో.. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) ద్వారా ఈ ప్రాజెక్టు ప్రారంభమైతే.. 2028-29కల్లా తొలి ప్రొటోటైప్ నమూనా సిద్ధమవుతుందని.. 2032-33కల్లా ఉత్పత్తి పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. 2034కల్లా ఐదోతరం యుద్ధ విమానాలు భారత వాయుసేనకు అందుతాయి.

ప్రత్యేకతలివే..

అమ్కా సూపర్‌సోనిక్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంటుంది. ఈ విమానాలు 15 వందల కిలోల ఇంటర్నల్, 5,500 కిలోల ఎక్స్‌టర్నల్ పేలోడ్‌ను మోసుకెళ్లగలవు. ఇంటర్నల్ ఇంధన సామర్థ్యం 6,500 కిలోలుగా ఉంటుంది. అధునాతన స్టెల్త్ టెక్నాలజీ కారణంగా శత్రు రాడార్లకు చిక్కకుండా ఉంటుంది. ప్రతికూల పరిస్థితుల్లోనూ సమర్థంగా తన సత్తాను చాటేలా అమ్కాను రూపొందిస్తున్నారు. భవిష్యత్‌లో మానవరహిత అమ్కాలను కూడా రూపొందించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. అమ్కాను రెండు దశల్లో తయారు చేయనున్నారు. మొదటి దశలో జనరల్ ఎలక్ట్రిక్ ఎఫ్-414 ఇంజన్‌తో ఎంకే1 మోడల్‌ను తయారు చేస్తారు. రెండో దశలో ఎంకే2ను అలాంటి ఇంజన్‌తోనే రూపొందిస్తారు. ఇప్పటికే భారత్ వాడుతున్న లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఎల్‌సీఏ)లో కూడా ఎఫ్-414 ఇంజన్లను వినియోగిస్తున్నారు. ఈ ఇంజన్లను దేశీయంగా తయారు చేసేందుకు జనరల్ ఎలక్ట్రిక్‌తో హెచ్ఏఎల్ ఒప్పందం కుదుర్చుకోనుంది.

లోకం తీరు



పాక్ గడ్డపైకి వెళ్లి.. తూటాల రుచి చూపించి..

» ఆపరేషన్ సిందూర్ వేళ సరిహద్దు దాటి బీఎస్ఎఫ్ దాడి

న్యూఢిల్లీ, మే 27: పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ కింద భారత్ తొలి దాడి చేసిన రోజు అది. సరిహద్దుల వద్ద బీఎస్ఎఫ్ పకడ్బందీగా కాపలా కాస్తోంది. కాస్త చీకటిపడగానే పాకిస్థాన్ వైపు కదలికలు మొదలయ్యాయి. సియాల్‌కోట్ ప్రాంతంలో సుమారు 40-50 మంది ఉగ్రవాదుల గుంపు భారత్‌లోకి చొరబడేందుకు సరిహద్దుల వైపు వస్తున్నట్టు బీఎస్ఎఫ్ గుర్తించింది. ఆ ఉగ్రవాదులు చొరబడేందుకు వీలుగా.. పాక్ దళాలు ఉన్నట్టుండి భారత సైనిక పోస్టులపై కాల్పులు జరపడం మొదలుపెట్టాయి. అప్పటికే అప్రమత్తంగా ఉన్న బీఎస్ఎఫ్ దళాలు.. దీటుగా స్పందించాయి. పాక్ ఆర్మీ సాధారణ పోస్టులు, వ్యూహాత్మక(ఫార్వర్డ్) పోస్టులతోపాటు ఉగ్రవాదుల లాంచ్‌ప్యాడ్‌లపై గుళ్ల వర్షం కురిపించాయి. పాకిస్థాన్ భూభాగంలో సుమారు 2.2 కిలోమీటర్ల లోపల ఉన్న అడ్డాలను ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో సరిహద్దులు దాటి వెళ్లి, పాక్ భూభాగం మీద నుంచీ దాడి చేశాయి. ఈ ధాటికి తట్టుకోలేక పాక్ సైనికులు పారిపోయారు. బీఎస్ఎఫ్ జమ్మూ ఫ్రాంటియర్ ఐజీ శశాంక్ ఆనంద్ మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. మన దళాల దాడి, పాక్ రేంజర్లు పారిపోతున్న దృశ్యాల వీడియోను కూడా విడుదల చేశారు. పాక్‌లోని లూని, మస్త్‌పూర్, ఛబ్రా ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేశామని తెలిపారు. మొత్తంగా పాక్‌కు చెందిన 76 పోస్టులు, 42 ఫార్వర్డ్ డిఫెన్స్ లోకేషన్లపై దాడి చేశామని వెల్లడించారు. ఈ దాడుల్లో బీఎస్ఎస్ మహిళా దళాలు ధైర్యంగా పాల్గొన్నాయని ఐజీ ఆనంద్ ప్రశంసించారు.

తొలగించిన పీఎస్‌యూ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్లు వర్తించవన్న కేంద్రం

న్యూఢిల్లీ, మే 27: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)ల్లో బర్తరఫ్/ తొలగింపునకు గురైన ఉద్యోగులు రిటైర్‌మెంట్ బెనిఫిట్లు కోల్పోనున్నారని కేంద్రం మంగళవారం తెలిపింది. విధి నిర్వహణలో దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు రుజువైన పీఎస్‌యూ ఉద్యోగులను సర్వీసుల నుంచి తొలగిస్తే, వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్లు లభించవు. ఈ మేరకు 2021 నాటి సర్వీసు నిబంధనల్లో కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ కీలక మార్పులు చేస్తూ 'కేంద్ర సివిల్ సర్వీసుల్లో (పెన్షన్) సవరించిన నిబంధనలు - 2025' ఈ నెల 22న నోటిఫై చేసింది.

మరణ శిక్ష నుంచి జమాత్ నాయకుడికి విముక్తి

» బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు తీర్పు

ఢాకా, మే 27: యుద్ధ నేరాల్లో మరణశిక్ష పడ్డ జమాత్ ఎ ఇస్లామీ నాయకుడు ఎ.టి.ఎం. అజహరల్ ఇస్లాం (73)కు విముక్తి కలిగిస్తూ మంగళవారం బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించిన ఆయన 1971 యుద్ధం సందర్భంగా పలు నేరాలకు పాల్పడినట్టు కేసులు నమోదయ్యాయి. యుద్ధ నేరాల కింద విచారణ జరిపిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఆయనకు మరణశిక్ష విధించింది. దానిపై సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా శిక్షను రద్దు చేసింది.

ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి ఆయుధాలు వాడటానికి ఓకే

» ఆ దేశానికి అనుమతి ఇచ్చామన్న జర్మనీ చాన్సలర్ మెర్జ్

న్యూఢిల్లీ, మే 27 : రష్యాపై దీర్ఘశ్రేణి ఆయుధాల వినియోగానికి ఉక్రెయిన్‌ను అనుమతించినట్లు జర్మనీ చాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ తెలిపారు. బెర్లిన్‌లో సోమవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఉక్రెయిన్‌కు తాము సరఫరా చేసిన ఆయుధాలపై అమెరికా, జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ నియంత్రణ ఎత్తివేసినట్లు చెప్పారు. దీంతో ఆ దేశం తనను తాను సమర్థంగా రక్షించుకోగలదని, రష్యా సైనిక వసతులపైనా దాడులు చేయగలదని ఆయన చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా ఇటీవల క్షిపణులు, డ్రోన్లతో భీకర దాడి చేసిన తర్వాత ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం.

జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన?



న్యూఢిల్లీ, మే 27: ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను పదవి నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్టు సమాచారం. ఈ మేరకు పార్లమెంట్ వానాకాల సమావేశాల్లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. జస్టిస్ యశ్వంత్‌వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో.. ఆయన నివాసంలో అగ్నిప్రమాదం జరిగి, భారీగా నోట్ల కట్టలు బయటపడి కలకలం రేగిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ముగ్గురు జడ్జీలతో ఏర్పాటు చేసిన కమిటీ విచారణ జరిపి... జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు నిజమేనంటూ నివేదిక ఇచ్చింది. మే 9న అప్పటి సుప్రీం చీఫ్ జస్టిస్ సంజీవ్‌ఖన్నా.. ఈ నివేదికను, జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించి, పదవి నుంచి తొలగించాలన్న సిఫార్సును రాష్ట్రపతికి, ప్రధానికి పంపారు. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఇటీవలే సుప్రీం సీజే ప్రతిపాదనను రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్‌లకు పంపినట్టు సమాచారం. అభిశంసన మార్గదర్శకాల ప్రకారం.. లోక్‌సభ, రాజ్యసభల్లో ఈ ప్రతిపాదనను ప్రవేశపెడతారు. ఒక కమిటీ వేసి ఆరోపణలపై విచారణ చేయిస్తారు. ఆ కమిటీ ఇచ్చే నివేదికను ఇరు సభల్లో ప్రవేశపెట్టి చర్చిస్తారు. అనంతరం ఓటింగ్ నిర్వహిస్తారు. అభిశంసనకు అనుకూలంగా ఓటింగ్ జరిగితే... న్యాయమూర్తి తొలగిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేస్తారు. నిజానికి రాజీనామా చేయాల్సిందిగా జస్టిస్ యశ్వంత్‌వర్మను సుప్రీంకోర్టు కోరినా ఆయన నిరాకరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే అభిశంసనకు సిఫార్సు చేసినట్టు తెలిసింది.

APPOINTMENTS

RECRUITMENT NOTIFICATION

Post: Assistant Officer, **Age Limits:** Minimum age: 18 years and Maximum age: 40 years: **Qualification:** 12th / Intermediate Pass, **Salary:** Rs 25000/- in the First Year, Rs 27,500/- in Second Year & Rs. 30,000/- in Third Year. **Work Location:** Candidates will work in their allotted Local Native Mandal. **Online Application:** Visit **www.seeindia.org** for the online application and go to the "Become a Volunteer" page. After submitting the registration form Click start exam and write the online exam using Phone, Laptop or Computer. **Offline Application:** A candidate can call the numbers below to schedule a walk-in registration and examination at the Hyderabad Centre. **Online Examination:** Examination consists of 50 multiple-choice questions, lasting 30 minutes, with a total of 100 marks. The paper is in English. Results are shown immediately after the exam, and candidates can download them. **For Details visit Websites www.seeindia.org. (or) Call 9121504131-9154712091-7799535235-8886746580**

నాడు పటేల్ మాట వినుంటే..
ఉగ్రదాడులు జరిగేవే కాదు!

పీవోకేను స్వాధీనం చేసుకోవాలని చెప్పినా అప్పటి పాలకులు పట్టించుకోలే

» 1947లో దేశ విభజన నిర్ణయంతోనే పాక్ ఉగ్రవాదం పరంపర మొదలైంది

» గుజరాత్‌లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

గాంధీనగర్, మే 27: దేశ తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ మాట విని ఉంటే భారత్‌లో ఉగ్రదాడుల పరంపర కొనసాగేది కాదని ప్రధాని మోదీ అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి 1947లో తీసుకున్న దేశ విభజన నిర్ణయమే కారణమని చెప్పారు. భారత మాతను 1947లో రెండు భాగాలుగా విభజించారని, అదే రోజు రాత్రి కశ్మీరులో ముజాహిదీన్‌లు తొలి ఉగ్రదాడికి పాల్పడ్డారని తెలిపారు.

ఆ ఉగ్రవాదుల సాయంతో పాకిస్థాన్ భారత భూభాగాన్ని కొంత మేర ఆక్రమించుకుందని గుర్తుచేశారు. పాకిస్థాన్ ఆక్రమించుకున్న కశ్మీరు (పీవోకే)ను తిరిగి తీసుకునే వరకూ భారత సైన్యాన్ని ఆపొద్దని సర్దార్ పటేల్ చెప్పారని.. అయినా అప్పటి పాలకులు ఆయన మాట వినలేదని మోదీ ఆరోపించారు. నాటి నుంచి వారు (పాకిస్థాన్, దానికి అండగా నిలుస్తున్న ఉగ్రవాదులు) రక్తం రుచి మరిగారని చెప్పారు. 75 ఏళ్లుగా ఆ ఉగ్రవాదం కొనసాగుతూనే ఉందన్నారు. తాజాగా పహల్గాంలో జరిగిన భయంకరమైన ఉగ్రదాడి కూడా ఆ పరంపరలో భాగమేనని తెలిపారు. మూడుసార్లు జరిగిన యుద్ధాల్లో భారత బలగాలు పాక్‌ను చిత్తుగా ఓడించాయన్నారు. ఈ నేపథ్యంలోనే పాకిస్థాన్ ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి, భారత్‌పై దాడులకు ఉసిగొల్పడం ద్వారా పరోక్ష యుద్ధానికి తెరతీసిందని ఆరోపించారు. ఉగ్రదాడులతో దేశంలో అమాయక పౌరులు, పర్యాటకులు, యాత్రికుల ప్రాణాలు తీస్తోందని ధ్వజమెత్తారు. ఉగ్రవాదం కేవలం పరోక్ష యుద్ధమే కాదని, పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగానే ఎంచుకున్న యుద్ధ వ్యూహమని చెప్పారు. దానికి సరైన రీతిలో భారత్ బదులిస్తుందన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గుజరాత్ వెళ్లిన ప్రధాని మోదీ.. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వసుధైక కుటుంబం అన్నది మన సంస్కారమని, పొరుగువారు కూడా సంతోషంగా ఉండాలనే కోరుకుంటామని చెప్పారు. మన సత్తాకు సవాలు విసిరితే ఊరుకునే ప్రసక్తే లేదని, భారత్ వీరుల గడ్డ అని తెలిపారు. కేవలం 22 నిమిషాల్లోనే 9 ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని, అది కూడా కెమెరా సాక్షిగా చేశామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా హతమైన ఉగ్రవాదులకు పాకిస్థాన్ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు చేసిందని, వారి శవపేటికలపై పాక్ జెండాను కప్పారని, పాక్ సైన్యం వారికి సెల్యూట్ చేసిందని మోదీ గుర్తుచేశారు. వారి తీరు ఇలాగే కొనసాగితే.. అదే రీతిలో తగిన బదులిస్తామని స్పష్టం చేశారు. కాగా, మంగళవారం మాజీ ప్రధాని నెహ్రూ వర్ధంతి సందర్భంగా మోదీ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మరోవైపు ప్రధాని మోదీపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. దేశ తొలి ప్రధాని నెహ్రూ వర్ధంతి రోజు కూడా ప్రధాని మోదీ ఆయనపై విమర్శలు మానుకోలేదని, సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే దేశ విభజన అంశాన్ని తెరపైకి తెచ్చిందని మండిపడింది.



పహల్గాంలో సైకిల్‌పైన పర్యటిస్తున్న కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

పహల్గాంలో జమ్మూ-కశ్మీర్ మంత్రివర్గ సమావేశం

జమ్మూ-కశ్మీర్ ప్రభుత్వం మంగళవారం పహల్గాంలో ప్రత్యేకంగా మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించింది. ఉగ్రవాదుల పిరికిపంద చర్యలకు ప్రభుత్వం భయపడబోదంటూ స్పష్టమైన సందేశం పంపడమే ఈ సమావేశం ఉద్దేశమని తెలిపింది. పహల్గాంలో పర్యాటక రంగం మునుపటిలాగానే కొనసాగుతోందన్న సందేశం పంపించడం కూడా ఈ సమావేశం నిర్వహణకు మరో కారణమని పేర్కొంది. ఇటీవల తాను ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసినప్పుడు జమ్మూ-కశ్మీర్‌లో పర్యాటక పరిశ్రమ పరిస్థితిని వివరించానని, ఆయన అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారని కశ్మీర్ సీఎం ఒమర్ ఈ సందర్భంగా తెలిపారు. పహల్గాంలో ఆయన మంగళవారం సైకిల్‌పై పర్యటించారు.

పోస్టు పెట్టినంత మాత్రాన విద్యార్థినిని అరెస్టు చేస్తారా?

» ఆమె జీవితాన్ని నాశనం చేస్తారా?

» మహారాష్ట్రపై బాంబే హైకోర్టు ఆగ్రహం

ముంబయి, మే 27: ఆపరేషన్ సిందూర్‌పై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన పోస్టును ఫార్వర్డ్ చేసిన ఓ విద్యార్థినిని అరెస్టు చేసినందుకు మహారాష్ట్ర ప్రభుత్వంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పోస్టు పెట్టినంత మాత్రాన అరెస్టు చేస్తారా అని ప్రశ్నించింది. ఆమె జీవితాన్ని నాశనం చేస్తున్నారని ఆక్షేపించింది. పుణెలోని సిన్హగడ్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో రెండో సంవత్సరం చదువుతున్న 19 ఏళ్ల విద్యార్థిని ఈ నెల ఏడో తేదీన ఆపరేషన్ సిందూర్‌పై ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన ఓ పోస్టును ఫార్వర్డ్ చేసింది. విమర్శలు రావడంతో రెండు గంటల వ్యవధిలోనే దాన్ని తొలగించింది. పోస్టు పెట్టినందుకు కళాశాలకు రావద్దంటూ యాజమాన్యం ఆమెను ఆదేశించింది. పోలీసు కేసు కూడా నమోదు కావడంతో అరెస్టు చేసి ఎరవాడ సెంట్రల్ జైలుకు పంపించారు. కాలేజీ నుంచి తనను పంపించివేయడంపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు.

బోర్డర్‌లో పోస్టుకు 'సిందూర్' పేరు

» కేంద్ర ప్రభుత్వానికి బీఎస్ఎఫ్ ప్రతిపాదన

న్యూఢిల్లీ, మే 27: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో.. భారత సైన్యం చూపిన తెగువకు గుర్తుగా సాంబా సెక్టార్‌లోని ఓ పోస్టుకు 'సిందూర్' అని పేరు పెట్టాలని బీఎస్ఎఫ్ ప్రతిపాదించింది. అలాగే మే 10న సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్‌తో జరిగిన పోరులో అమరులైన ఇద్దరు బీఎస్ఎఫ్ సిబ్బంది పేర్లను మరో రెండు పోస్టులకు పెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మే 10న పాకిస్థాన్ బీఎస్ఎఫ్ పోస్టులను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు చేయగా, బీఎస్ఎఫ్ ఎస్ఐ ఇంతియాజ్, కానిస్టేబుల్ దీపక్ అమరులయ్యారు.

హార్వర్డ్‌లో కీలక పదవుల్లో భారతీయులు

» వారిలో తెలుగు మూలాలున్న హిమబిందు



వాషింగ్టన్, మే 26: హార్వర్డ్‌పై ట్రంప్ నిర్ణయం మాట ఎలా ఉన్నప్పటికీ విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలకు భారతీయులు ఆధిపత్యం వహిస్తుండడం విశేషం. ముఖ్యంగా హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో ఇండియన్-అమెరికన్‌ల పాత్ర గణనీయంగా ఉంది. శ్రీకాంత్ ఎం దాతర్, నితిన్ నోహ్రియా, తరుణ్ ఖన్నా, భరత్ ఎస్ ఆనంద్, అమితాబ్ చంద్ర, పృథ్వీరాజ్ చౌదరి తదితర 20 మంది పేర్లు ప్రముఖంగా వినిపిస్తుంటాయి. ఈ జాబితాలో తెలుగు మహిళ హిమబిందు లక్కరాజు కూడా ఉన్నారు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నప్పటికీ ఇతర విభాగాలతోనూ ఆమెకు సంబంధం ఉంది. కంప్యూటర్ సైన్స్, డాటా సైన్స్ ఇనిషియేటివ్, సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ కంప్యుటేషన్ అండ్ సొసైటీ, లేబరేటరీ ఆఫ్ ఇన్నోవేషన్ సైన్స్ వంటి విభాగాల్లో సేవలు అందిస్తున్నారు. ఏఐ4లైఫ్ అనే పరిశోధన విభాగానికి నాయకత్వం వహిస్తున్నారు. పోస్ట్ డాక్టరల్, గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మార్గదర్శనం చేస్తున్నారు. కృత్రిమ మేథ, మిషన్ లెర్నింగ్ రంగాల్లో స్టార్టప్‌లు పెట్టాలనుకునే వారికి సలహాలు ఇస్తుంటారు. కృత్రిమ మేధను సామాన్యులను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఆమె స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఎం.ఎస్, పీహెచ్‌డీ పట్టాలను అందుకున్నారు.

అమెరికా విద్యార్థి వీసా ఇంటర్వ్యూలు బంద్!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంది. స్టూడెంట్ వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేయాలని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని అమెరికా ఎంబసీలకు ఆదేశాలు పంపారు. ఇప్పటికే షెడ్యూల్ అయిన ఇంటర్వ్యూలకు ఈ ఆదేశాలు వర్తించవు. కానీ, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కొత్తగా విద్యార్థి లేదా ఎక్స్‌చేంజ్ విజిటర్(ఎఫ్, ఎం, జే) వీసా ఇంటర్వ్యూలకు అపాయింట్‌మెంట్ ఇవ్వకూడదని స్పష్టం చేశారు. దీనిపై మరింత స్పష్టమైన ఆదేశాలు త్వరలో ఇస్తామని పేర్కొన్నారు. సోషల్ మీడియా ఖాతాల తనిఖీలకు సంబంధించి కఠిన నిబంధనలు అమలులోకి వస్తే అమెరికా విశ్వవిద్యాలయాల్లో విదేశీ విద్యార్థుల ప్రవేశం మరింత కష్టం కానుంది.

క్లాసులు ఎగ్గొడితే అంతే..!

అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు ట్రంప్ ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. తరగతులకు గైర్హాజరయ్యే వారి వీసా రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ఇలాంటి వారంతా భవిష్యత్తులో ఎలాంటి అమెరికా వీసా కోసమైనా దరఖాస్తు చేసుకోవడానికి అర్హతను కోల్పోతారని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం మంగళవారం ప్రకటించింది. 'డ్రాపౌట్ అయినా, తరగతులు ఎగ్గొట్టినా, విద్యాసంస్థకు సమాచారం ఇవ్వకుండా స్టడీ ప్రోగ్రామ్ నుంచి వెళ్లిపోయినా మీ విద్యార్థి వీసా రద్దు కావచ్చు. భవిష్యత్తులో అమెరికా వీసాలకు మీరు అర్హత కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సమస్యలను నివారించడానికి వీసా నిబంధనలకు అనుగుణంగా నడుచుకోండి. మీ విద్యార్థి వీసాను కొనసాగించుకోండి' అని ఆ ప్రకటనలో సూచించింది. మరోవైపు అమెరికాలో పని అనుభవాన్ని పొందడానికి విదేశీ విద్యార్థులను అనుమతించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రాంను రద్దుచేసే దిశగా ట్రంప్ ప్రభుత్వం అడుగులు వేస్తుండటం కూడా భారత్‌తో పాటు ఇతర దేశాల విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది.

విదేశాల్లో 10.8 లక్షల మంది విద్యార్థులు

ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. 2025లో 10.8లక్షల మంది విదేశీ విద్యా సంస్థల్లో చదువుతున్నారని విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఈ వివరాలను ఇతర విద్యా సంస్థలు కూడా ధ్రువీకరించాయి. 2023లో 10.3 లక్షల మంది చదువుతున్నట్టు గుర్తించగా ప్రస్తుత సంవత్సరంలో ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. కెనడా విద్యాసంస్థల్లో చేరిన వారి సంఖ్య ఈ ఏడాది కాస్త తగ్గినప్పటికీ మొత్తం మీద చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఆ దేశానికి వెళ్లారు. 2024లో కెనడాలో 1,37,608 మంది, యూకేలో 98,890 మంది ఉన్నట్టు వెల్లడయింది. గత ఏడాది అమెరికాలో చదువుతున్న వారి సంఖ్య 3,31,602గా నమోదయింది.



హార్వర్డ్‌పై విజయం సాధిస్తా

వాషింగ్టన్, మే 26: హార్వర్డ్ వర్సిటీపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధం ప్రకటించారు. ఈ యుద్ధంలో విజయం సాధిస్తామని కూడా ఆయన తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో సోమవారం ఆయన పోస్టు పెడుతూ "యూదు వ్యతిరేక హార్వర్డ్‌కు ఇచ్చే గ్రాంట్లలో మూడు బిలియన్ డాలర్ల మేర కోత విధించాలని అనుకుంటున్నాం. వాటిని దేశంలోని ఇతర ట్రేడ్ స్కూళ్లకు మళ్లిస్తాం" అని పేర్కొన్నారు. విదేశీ విద్యార్థులు చెల్లించే ట్యూషన్ ఫీజులే హార్వర్డ్‌కు పెద్ద ఆదాయ వనరు కావడంతో వాటిపైనా దృష్టి పెట్టారు. విదేశీ విద్యార్థుల జాబితా ఇవ్వాలని అడిగినట్టు తెలిపారు. "ఆ జాబితా వస్తే దేశంలోకి ఎంతమంది రాడికల్ పిచ్చోళ్లు, సమస్యలను సృష్టించే వారు వస్తున్నారో తెలుసుకోవచ్చు. బిలియన్ల కొద్దీ డాలర్లను ఇలాంటి పనికి మాలిన వారి కోసం ఖర్చు పెడుతున్నాం. అయినా భయం లేదు. ప్రభుత్వం విజయం సాధిస్తుంది" అని పేర్కొన్నారు. హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థులు చేరకుండా ఆదేశాలు ఇచ్చినప్పటికీ న్యాయస్థానం దాన్ని సస్పెండ్ చేయడం గమనార్హం. ట్రంప్ నిర్ణయంతో భారతీయ విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

మిస్ వరల్డ్ ఫైనల్స్... 3 గంటలు..
3500 మంది ప్రేక్షకులు

ప్రత్యేక ఆహ్వానితులుగా పారిశ్రామికవేత్తలు, బాలీవుడ్, టాలీవుడ్ ప్రముఖులు

» వేయి మంది సామాన్యులు కూడా..

» 120 దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం

» పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వెల్లడి

హైదరాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఆతిథ్యమిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీలు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే నాలుగు ఖండాల నుంచి 40 దేశాల ప్రతినిధులను ఎంపిక చేసిన నిర్వాహకులు.. వచ్చే ఆదివారం సాయంత్రం జరగనున్న ఫైనల్ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైటెక్స్‌లోని హాల్ నెంబర్-4లో ఈ కార్యక్రమం జరగనుందని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. తుది పోటీలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన మంగళవారం సైబరాబాద్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్, పర్యాటక శాఖ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అన్ని శాఖల మధ్య సమన్వయం కోసం హైటెక్స్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సాయంత్రం 6-30గంటలకు కార్యక్రమం ప్రారంభమై 9-20గంటలకు ముగుస్తుందని చెప్పారు. దాదాపు 3500 మంది కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో కేవలం ప్రముఖులే కాకుండా సామాన్యులకు కూడా పాల్గొనే అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఇప్పటికే సూచించారు. దీనికోసం ఆన్‌లైన్లో అవకాశం ఇవ్వగా.. దాదాపు 7500 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో దాదాపు వెయ్యిమందికి అవకాశం ఇవ్వనున్నామని జయేష్ రంజన్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలతోపాటు బాలీవుడ్, టాలీవుడ్ సినీ ప్రముఖులను ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా హాజరు కానున్నారు. ఫైనల్స్ కార్యక్రమానికి సంబంధించిన ప్రాక్టీస్ సెషన్ మంగళవారం ప్రారంభమైందని, ఇది బుధ, గురువారాల్లో కూడా కొనసాగుతుందన్నారు. పూర్తిస్థాయి రిహార్సల్స్ ఈనెల 30, 31వ తేదీ ఉదయం జరుగుతాయని చెప్పారు. తుది పోటీల ప్రత్యక్ష ప్రసారాలు సోనీ టీవీ 120 దేశాల్లో అందించనుందని తెలిపారు. అందులో తెలంగాణ సంస్కృతి, పర్యాటక ప్రాంతాల గురించి 50-60 నిమిషాల పాటు ప్రసారం చేయనున్నారని జయేష్ రంజన్ తెలిపారు. తుది పోటీల్లో వ్యవహరించనున్న న్యాయ నిర్ణేతల వివరాలను మిస్ వరల్డ్ సంస్థ త్వరలో ప్రకటిస్తుందని వెల్లడించారు.



ట్రైడెంట్ హోటల్లో మిస్ వరల్డ్ పోటీదారుల సందడి

మావోయిస్టుల మృతదేహాలంటే మోదీ, అమిత్ షాలకు అంత భయమా?

- కుటుంబ సభ్యులకు అప్పగించకుండా పోలీసులే దహనం చేయడం అమానుషం
- మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించాం
- సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్

హైదరాబాద్ హైదరాబాద్ సిటీ, ఖమ్మం సంక్షేమ విభాగం, మే27 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్ పేరుతో చంపడమేకాకుండా, మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించకుండా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వమే దహనం చేయడం అత్యంత అమానుషమైన చర్య అని ప్రజాసంఘాల ప్రతినిధులు, వామపక్ష వాదులు, సామాజిక కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శక్తివంతమైన ప్రధాని, హోంమంత్రి అంటూ ప్రచారం చేసుకొంటున్న మోదీ, అమిత్‌షాలు మావోయిస్టుల భౌతికకాయాలకు కూడా భయపడుతున్నారా.?అని నిలదీశారు. మంగళవారం హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, మృతదేహాలను దహనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 'ఏపీ ప్రభుత్వమైతే కేశవరావు, నవీన్, సంగీతల మృతదేహాలను స్వరాష్ట్రానికి తీసుకురావొద్దని బాధిత కుటుంబాలను బాహాటంగానే హెచ్చరించింది. ఆ విషయంలో సఫలీకృతమైంది' అని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సైతం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ప్రముఖ సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ ఇదే విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ తాము జాతీయ మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ ప్రొ. అన్వర్ ఖాన్, కో-ఆర్డినేటర్ ప్రొ.గడ్డం లక్ష్మణ్, ఎన్ నారాయణరావు, సీపీఐ నాయకురాలు పశ్యపద్మ, సీపీఐ(ఎంఎల్)నేతలు గోవర్ధన్, రమేశ్, షేక్షావలి, పీవోడబ్ల్యూ, చైతన్యమహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

మావోయిస్టుల మృతదేహాలను అప్పగించకుండా, కుటుంబసభ్యులను బెదిరించి పోలీసులే అంత్యక్రియలు నిర్వహించడం సరైన చర్య కాదని వామపక్ష పార్టీల నేతలు అన్నారు. శాంతి చర్చల సంఘం నేతలతో కలిసి సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మావోయిస్టులతో చర్చలకు ముందుకు రావాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపినందుకే మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించేందుకు మోదీప్రభుత్వం భయపడిందన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. శవాలను అడ్డు పెట్టుకుని రాజకీయాలకు పాల్పడడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి మనుషులను చంపేహక్కు ఎవరిచ్చారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్నించారు.

హోం మంత్రులపై కేసులు పెట్టాలి

నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని, ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతలు కోరారు. ఖమ్మంలో వారు మీడియాతో మాట్లాడారు. మావోయిస్టుల మృతదేహాలను అమానవీయంగా కాల్చి వేశారని, ఇందుకు బాధ్యులైన కేంద్ర హోంమంత్రి, ఛత్తీస్‌గఢ్ హోంమంత్రిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎల్‌బీసీలో టీబీఎంతో తవ్వకాలు అసాధ్యం

- డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో టన్నెలింగ్
- ప్రభుత్వానికి సాంకేతిక కమిటీ సిఫారసు

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) ఇన్‌లెట్(శ్రీశైలం) వైపు సొరంగం తవ్వకానికి సంబంధించి ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ ప్రభుత్వానికి కీలక సిఫారసులు చేసింది. ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ వైపు ఇకపై టీబీఎం(టన్నెల్ బోరింగ్ మెషీన్)తో తవ్వకాలు అసాధ్యమని, డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం(డీబీఎం)లో టన్నెల్ తవ్వకం చేపట్టాలని సూచించింది. కేంద్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టుకు జారీ చేసిన పర్యావరణ అనుమతికి లోబడి పనులు చేపట్టాలని పేర్కొంది. అలాగే, ప్రమాదం కారణంగా సొరంగంలో చిక్కుకుపోయిన వారి ఆచూకీ కోసం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ రాక్ మెకానిక్స్(ఎన్ఐఆర్ఎం) ప్రతినిధి డాక్టర్ అజయ్‌కుమార్ నైథాని సహకారం తీసుకోవాలని చెప్పింది. ప్రమాదకర జోన్‌లో ఉన్న 50 మీటర్లపై జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ), జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ) ద్వారా సమగ్ర సర్వేకు సాంకేతిక కమిటీ సిఫారసు చేసింది. అయితే, ఈ నెల 30వ తేదీ లోగా టన్నెల్‌లో భూసాంకేతిక(జియో టెక్నికల్) పరీక్షలు, జూన్ 30 నాటికి సమగ్ర సర్వే, ఇతర ప్రక్రియలను, ఆగస్టుకల్లా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని కమిటీ సూచించింది. ఇక టన్నెల్ అండ్ బ్లాస్టింగ్ విధానానికి అయ్యే ఖర్చును అంచనా వేసి, దానికి అనుగుణంగా ఒప్పందాన్ని సవరించాలని సిఫారసు చేసింది. మిగిలిన టన్నెల్ తవ్వకం పనులను ఎప్పట్లోగా పూర్తి చేస్తారో నిర్మాణ సంస్థ(జయప్రకాష్ అసోసియేట్స్) నుంచి ప్రణాళికను తీసుకోవాలని కమిటీ సిఫారసు చేసింది.

స్మార్ట్ స్టిక్స్.. నైట్ గన్స్.. పెప్పర్ స్ప్రేలు

- చిరుత భయరహితంగా అలిపిరి నడకదారి
- అటవీశాఖతో కార్యాచరణకు టీటీడీ శ్రీకారం

తిరుమల, మే 27 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ స్టిక్స్, నైట్ గన్స్, పెప్పర్ స్ప్రేలు వంటి రక్షణ పరికరాల వినియోగంతో అలిపిరి నడక దారిని చిరుత భయరహిత ప్రాంతంగా మార్చాలని టీటీడీ నిర్ణయించింది. తిరుపతి-తిరుమల మధ్య ఘాట్ రోడ్లలోనూ, నడక దారిలోనూ ఇటీవల చిరుతల సంచారం పెరగడంతో భక్తుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి మంగళవారం తిరుమలలోని గోకులం మందిరంలో టీటీడీ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. టీటీడీ ఈవో శ్యామలరావు వర్చువల్‌గా హాజరవగా.. అదనపు ఈవో వెంకయ్య చౌదరి వివిధ విభాగాల అధికారులతో చర్చించారు. ఇకపై టీటీడీ అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, విజిలెన్స్ శాఖలతో అటవీశాఖ సమన్వయం చేసుకుంటూ నిరంతరం జాయింట్ డ్రైవ్ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. తక్షణం అలిపిరి కాలినడక మార్గంలో భద్రతా సిబ్బంది సంఖ్యను పెంచనున్నారు. కెమెరా ట్రాప్స్, స్మార్ట్ స్టిక్స్ నైట్ గన్స్‌ను వినియోగించాలని నిర్ణయించారు. బయోఫెన్సింగ్ ఏర్పాటు చేయాలనే సూచనను ఆమోదించారు. నడకదారిలో హైఫ్లాష్ టార్చ్‌లతో పాటు పెప్పర్ స్ప్రేలను కూడా రక్షణ పరికరాలుగా వినియోగించాలని నిర్ణయించారు.

ఘాట్‌లో బైక్‌లపై ఆంక్షలు

ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలను ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతించాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే నడకదారిలో 12 ఏళ్లలోపు వయస్సు కలిగిన పిల్లలను ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే అనుమతించాలని భావిస్తున్నట్టు సమాచారం. త్వరలో వీటిపై కూడా నిర్ణయం తీసుకోనున్నారు. అలిపిరి కాలినడక మార్గంలో ఏడో మైలు నుంచి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వరకు 2.5 కి.మీ. మేర పటిష్ఠ భద్రతతోపాటు, నిరంతర నిఘా ఉంచాలని నిర్ణయించారు. ప్రతి నెలా మానవ-వన్యప్రాణి ఘర్షణలపై సమీక్ష నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.

తెలంగాణ హైకోర్టుకు ముగ్గురు జడ్జీలు

గతంలో ఇక్కడ పనిచేసిన జస్టిస్ సుమలత, జస్టిస్ లలిత, జస్టిస్ అభిషేక్‌రెడ్డి మళ్లీ ఇక్కడికి బదిలీ

- యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్ కలకత్తా హైకోర్టుకు
- ఏపీ హైకోర్టుకు మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ దేవానంద్
- కేంద్ర ప్రభుత్వానికి కొలీజియం సిఫారసు
- 21 మంది జడ్జిల బదిలీకి ప్రతిపాదన
- తెలంగాణ హైకోర్టు సీజేగా ఏకే సింగ్

హైదరాబాద్/న్యూఢిల్లీ, మే 27 (ఆంధ్రజ్యోతి): గతంలో తెలంగాణ హైకోర్టు జడ్జిలుగా పనిచేసి వివిధ రాష్ట్రాలకు బదిలీ అయిన ముగ్గురు జడ్జిలు మళ్లీ ఇక్కడికి రానున్నారు. జస్టిస్ సి.సుమలత, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డిలను ఆయా రాష్ట్రాల హైకోర్టుల నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. వీరితోపాటు దేశవ్యాప్తంగా మొత్తం 11 హైకోర్టులకు చెందిన 21 మంది జడ్జిల బదిలీకి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం ప్రతిపాదించింది. జస్టిస్ సుమలత, జస్టిస్ లలిత ప్రస్తుతం కర్ణాటక హైకోర్టులో జడ్జిలుగా వ్యవహరిస్తుండగా.. జస్టిస్ అభిషేక్‌రెడ్డి పట్నా హైకోర్టులో సేవలందిస్తున్నారు. కొలీజియం సిఫారసులను కేంద్రం ఆమోదించిన వెంటనే వారు మళ్లీ తెలంగాణ హైకోర్టులో జడ్జిలుగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజోయ్‌పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం సిఫారసు చేసింది. కాగా, మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్‌ను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రతిపాదించింది. ఇక త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేస్తున్న అపరేశ్ కుమార్‌సింగ్ (ఏకే సింగ్)ను తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ చేయాలని కొలీజియం సిఫారసు చేసినట్లు తెలిసింది. అయితే ఇందుకు సంబంధించి కొలీజియం నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. 1965 జూలై 7న జన్మించిన జస్టిస్ ఏకే సింగ్.. 1990 నుంచి పట్నా హైకోర్టులో న్యాయవాదిగా, జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక 2001 నుంచి 2012 వరకు జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012లో జార్ఖండ్ హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 2022లో జార్ఖండ్ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వహించి.. 2023లో త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఆయనను తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా కొలీజియం సిఫారసు చేసినట్లు తెలిసింది.



జస్టిస్ ఏకే సింగ్

గోల్డ్‌మెడలిస్ట్ జస్టిస్ సుమలత..

కాన్‌స్టిట్యూషన్ లాలో గోల్డ్‌మెడలిస్ట్ అయిన జస్టిస్ చిల్లకూరు సుమలత.. వెంకటసుబ్బయ్య, లక్ష్మీప్రసన్న దంపతులకు జన్మించారు. న్యాయశాస్త్రంలో పట్టా అందుకున్న అనంతరం న్యాయవాదిగా పదేళ్లపాటు పనిచేసి 2007లో నేరుగా జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. కర్నూలు, గుంటూరు, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా సేవలందించారు. 2021 అక్టోబరు 15న తెలంగాణ హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 2023 నవంబరు 23న కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. కాగా, గుంటూరు జిల్లా బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం గ్రామానికి చెందిన జస్టిస్ కన్నెగంటి లలిత.. హైదరాబాద్ ఎర్రగడ్డలోని సెయింట్ థెరిసా స్కూల్‌లో పాఠశాల విద్య, ఎస్సార్ నగర్‌లోని నాగార్జున జూనియర్ కాలేజీలో ఇంటర్, నాంపల్లి సరోజినీ నాయుడు మహా విద్యాలయలో డిగ్రీ, పడాల రామిరెడ్డి లా కాలేజ్‌లో న్యాయశాస్త్రం చదివారు. 1994లో ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. 2020 మే 2న ఏపీ హైకోర్టులో న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. 2021లో తెలంగాణ హైకోర్టుకు, 2023లో కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు.

రంగారెడ్డి జిల్లా వాసి జస్టిస్ అభిషేక్‌రెడ్డి

జస్టిస్ జస్టిస్ అభిషేక్‌రెడ్డి.. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లింగంపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది ఎ. పుల్లారెడ్డి, డాక్టర్ శశిరేఖారెడ్డి దంపతులకు 1967లో జన్మించారు. హైదర్‌గూడ సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్య, ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్, నిజాం కాలేజీలో డిగ్రీ, ఓయూ లా కాలేజ్‌లో న్యాయశాస్త్రం పూర్తిచేసి 1990లో అప్పటి ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదయ్యారు. 1952 నుంచి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ అత్యంత సీనియర్ సభ్యుల్లో ఒకరైన ఆయన తండ్రి పుల్లా రెడ్డి చాంబర్స్‌లోనే వృత్తిని ప్రారంభించారు. ఆ తర్వాత 1993లో వాషింగ్టన్ కాలేజ్ ఆఫ్ లా నుంచి ఎల్ఎల్ఎం పూర్తిచేశారు. 2019 ఆగస్టు 26న తెలంగాణ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులై 2023లో పట్నా హైకోర్టుకు బదిలీ అయ్యారు.

GHMC హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
సంక్షిప్త NIT నం.13/SE(M)/Sec-bad Zone/GHMC/2025-26 తేది: 27.05.2025
పనుల సంఖ్య: మొత్తం 02 పనులు. అంచనా మొత్తం: రూ.389.72 లక్షలు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ/ చివరి తేది మరియు సమయం: బిడ్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం: 28.05.2025 మ.1.00 గం. బిడ్ దాఖలుకు ముగింపు తేది & సమయం: 02.06.2025 మ.1.00 గం. అధికారి పేరు, చిరునామా & సెల్ నం: SE, సికింద్రాబాద్ జోన్, GHMC, 9963550657. తదుపరి వివరాలను https://www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, GHMC
DIPR RO No.2584-PP/CL/ADVT/1/2025-26, తేది: 27.05.2025

hmda హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500082
బహిరంగ ప్రకటన
శిస్తు వస్తు విధించడం కోసం స్థలాన్ని పరిమితిలో మార్పుల్లో భాగంగా, G.O.Ms.No.33 తేది 24/1/2013 ప్రకారం ప్రభుత్వం ద్వారా ఆమోదించబడిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్(HMR) కొరకు మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్ (MDP) 2031 లో చేర్చబడిన రంగారెడ్డి జిల్లా, మంచాల (మం), నోముల (గ్రా)లో సర్వే నంబర్లు 363 & 364 రెవెన్యూ గ్రామ మ్యాప్ ప్రకారం సవరించబడినవి/కలుపబడినవి.
ప్రభుత్వ లెటర్ నం.11473/Plg.I (1)/2020, తేది. 20.02.2021 ప్రకారం పైన తెలిపిన శిస్తు వస్తు విధించడం కోసం స్థలాన్ని పరిమితిలో మార్పుల గురించి ప్రజలకు సమాచార నిమిత్తం తెలియజేయడమైనది.
సం/- మెట్రోపాలిటన్ కమిషనర్, HMDA
DIPR RO.No: 2609-PP/CL/ADVT/1/2025-26, తేది: 27.05.2025

GHMC హైదరాబాద్ మహానగర పాలక సంస్థ : ZCTO, చార్మినార్ జోన్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.04/ZCTO/CRZ/GHMC/2025-26 తేది: 27.05.2025
ఐటం నం.1:- పని స్వభావం: చార్మినార్ జోన్-1 (సర్కిల్ 6, 7 & 8)లో మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ (MET) మరియు ఇన్‌స్టంట్ రిపేర్ టీమ్స్ (IRT) కోసం వాహనాల నియోగం. అంచనా వ్యయం: రూ.150.00 లక్షలు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది/ చివరి తేది & సమయం:- డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 28.05.2025 ఉ.11.30గం. బిడ్ల స్వీకరణకు చివరి తేది & సమయం: 31.05.2025 ఉ.11.30గం. ఐటం నం.2:- పని స్వభావం: చార్మినార్ జోన్-2 (సర్కిల్ 9, 10 & 11)లో మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ (MET) మరియు ఇన్‌స్టంట్ రిపేర్ టీమ్స్ (IRT) కోసం వాహనాల నియోగం. అంచనా వ్యయం: రూ.120.00 లక్షలు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది/ చివరి తేది & సమయం:- డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 28.05.2025 ఉ.11.30గం. బిడ్ల స్వీకరణకు చివరి తేది & సమయం: 31.05.2025 ఉ.11.30గం. అధికారి పేరు & చిరునామా: ZCTO, CRZ, GHMC, హైదరాబాద్, ఫోన్ నం: 9963833866. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.eprocurement.gov.in లో చూడవచ్చును. గమనిక: టెండరు ప్రకటన తేదీ తరువాత తప్పనిసరిగా 1% బయానాను పొందవలెను.
సం/- ZCTO, CRZ, GHMC
DIPR RO No.2628-PP/CL/ADVT/1/2025-26 తేది: 27.05.2025

శంషాబాద్ పురపాలక సంఘ కార్యాలయం
రంగారెడ్డి జిల్లా
Lr.No.E1/SHBM/85/2025 తేది: 27.05.2025
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
శంషాబాద్ పురపాలక సంఘంలో 1. కంపోస్ట్ షెడ్ నిర్మాణం, 2. సిల్ట్‌గ్రాబర్ మెషీన్ కొనుగోలు, సరఫరా & బట్వాడా, 3. హిటాచి 200 సామర్థ్యం ఎంగేజింగ్ కొరకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. అవి కమిషనర్, శంషాబాద్ పురపాలక సంఘం వారి ద్వారా 03.06.2025న మ.3.00 గం.ల వరకు స్వీకరించబడతాయి. మరియు అవి అదే తేదీన 03.15 గం.లకు టెండరుదారులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలో కమిషనర్, శంషాబాద్ పురపాలక సంఘం వారి ద్వారా తెరువబడతాయి. కోరబడుతున్న టెండర్ల షెడ్యూలు దిగువ ఇవ్వబడినది: 1. టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేది: 27.05.2025న మ.3.00 గం.లకు. 2. ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్ల దాఖలు: 03.06.2025న మ.3.00 గం.లకు. 3. టెండర్లు తెరచుట: 03.06.2025న మ.3.15 గం.లకు. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in ను దర్శించగలరు లేదా శంషాబాద్ పురపాలక సంఘం కార్యాలయాన్ని సంప్రదించగలరు. సంప్రదించగలరు: 7337323577/7337336171.
సం/- కమిషనర్, శంషాబాద్ పురపాలక సంఘం.
DIPR RO.No: 2612-PP/CL/ADVT/1/2025-26, తేది: 27.05.2025

వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ హఠాన్మరణం

- గుండెపోటుతో కన్నుమూత



మదన్‌లాల్ (ఫైల్)

వైరా, మే 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ (62) మంగళవారం ఉదయం హఠాన్మరణం పాలయ్యారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న మదన్‌లాల్‌కు ఈ నెల 23న తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఏఐజీ ఆస్పత్రిలో చేర్చారు. సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. 2 రోజుల అబ్జర్వేషన్ తర్వాత డిశ్చార్జీ చేస్తామని చెప్పారు. మంగళవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన మదన్‌లాల్ గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని ఖమ్మం తరలించారు. 2014-18 మధ్య వైరా ఎమ్మెల్యేగా పనిచేసిన మదన్‌లాల్‌కు భార్య మంజుల, కుమారుడు మృగేందర్ లాల్, కూతురు మనీషా లక్ష్మి ఉన్నారు. కొడుకు మృగేందర్ లాల్, కోడలు శ్వేత ఐఏఎస్ అధికారులుగా తమిళనాడులోని కోయంబత్తూర్‌లో పని చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో 1963 మే మూడో తేదీన జన్మించిన మదన్‌లాల్.. 1983 నుంచి 85 వరకూ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి రాజీనామా చేశారు. 1995లో ఎంపీటీసీగా గెలుపొందినా. కొద్ది కాలానికే రాజీనామా చేసి ఈర్లపూడి సర్పంచ్‌గా 1996-2001, 2006- 2011 వరకూ కొనసాగారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో సీపీఎం మద్దతుతో వైసీపీ అభ్యర్థిగా విజయం సాధించి.. తదనంతర పరిణామాల్లో బీఆర్ఎస్‌లో చేరారు. 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

ముఖ్యమంత్రి సంతాపం

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): బానోత్ మదన్ లాల్ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర మాజీ మంత్రి- ఎంపీ రేణుకా చౌదరి, తదితరులు సంతాపం తెలిపారు.

nqa. ISO 9001 Registered

జాతీయ మానసిక దివ్యాంగుల (దివ్యాంగ్‌జన్) సాధికారత సంస్థ
NATIONAL INSTITUTE FOR THE EMPOWERMENT OF PERSONS WITH INTELLECTUAL DISABILITIES (DIVYANGJAN)
దివ్యాంగుల (దివ్యాంగ్‌జన్) సాధికారత శాఖ
(సామాజిక న్యాయం & సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
Department of Empowerment of Persons with Disabilities (Divyangjan)
Ministry of Social Justice & Empowerment, Govt. of India
మనోవికాస్ నగర్, సికింద్రాబాద్ / Manovikas Nagar, Secunderabad – 500 009
టెలిఫోన్ నం.: 040-27751741-745, ఫ్యాక్స్ నం.: 040-27750198
ఇ-మెయిల్ : Nimhacademics@gmail.com, వెబ్‌సైట్: niepid.nic.in,

ప్రవేశ ప్రకటన 2025-26

2025-26 విద్యా సంవత్సరానికి డిప్లొమా, UG మరియు PG కోర్సుల కోసం NIEPID మరియు తమ రీజినల్ సెంటర్లు / కాంపోజిట్ రీజినల్ సెంటర్లు దరఖాస్తులు కోరుతున్నాయి.
దిగువ తెలిపిన సెంటర్ల వద్ద దిగువ తెలిపిన కోర్సులు ఆఫర్ చేయబడుచున్నవి:

NIEPID, సికింద్రాబాద్	: D.Ed. SE (IDD), DECSE (ID), DVR (ID), B.Ed. SE (ID), DISLI, M.Ed. SE (ID), PGDEI, M.Phil. in Rehabilitation Psychology
RC నోయిడా	: D.Ed. SE (IDD)
RC కోల్‌కతా	: D.Ed. SE (IDD), DVR (ID), B.Ed. SE (ID), M.Ed. SE (ID)
RC నవీ ముంబై	: D.Ed. SE (IDD), DVR (ID), DECSE (ID), * B.Ed. SE (ID), *M.Ed. SE (ID)
CRC దేవనగెరె	: D.Ed. SE (IDD), D.Ed. SE (HI), DISLI
CRC రాజ్‌నంద్‌గావ్	: D.Ed. SE (IDD), DISLI
CRC నెల్లూరు	: D.Ed. SE (HI), DVR (ID), DISLI

* RC, నవీ ముంబై వద్ద B.Ed. SE (ID) మరియు M.Ed. SE (ID) కోర్సుల కొరకు అడ్మిషన్లు ముంబై విశ్వవిద్యాలయం ఆమోదానికి లోబడి ఉంటాయి.
* డిప్లొమా-స్థాయి కోర్సుల కొరకు అడ్మిషన్లు మే/ జూన్ నెలలో RCI ద్వారా విడుదల చేయబడతాయి. సదరు ప్రకటన ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌లో కూడా అప్‌లోడ్ చేయబడును. కాబట్టి డిప్లొమా అడ్మిషన్‌పై అప్‌డేట్స్ కోసం క్రమంగా మా వెబ్‌సైట్‌ను దర్శించవలెను.
సవివరమైన ప్రకటన, దరఖాస్తు, ప్రాస్పెక్టస్, అర్హతా ప్రమాణాలు, ఫీజు వివరాలు మొదలగువాటి కోసం దర్శించండి మా వెబ్‌సైట్: www.niepid.nic.in
డైరెక్టర్


18 మంది నక్సల్స్ లొంగుబాటు

చర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో 18 మంది మావోయిస్టులు మంగళవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో హిడ్మా నేతృత్వం వహించే పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్‌కు చెందిన నలుగురు నక్సల్స్ ఉన్నట్లు సుకుమా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. మిగతా వారిలో వివిధ దళాల సభ్యులు ఉన్నట్లు తెలిపారు. వీరందరిపై రూ.39 లక్షల రివార్డు ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు.. మావోయిస్టులు ఆయుధాలను వదిలి, పోలీసుల ఎదుట లొంగిపోవాలంటూ బస్తర్ రీజియన్ ఐజీ సుందర్‌రాజ్ ఓ ప్రకటనను విడుదల చేశారు.

క్షమించండి

కాంగ్రెస్ నాయకత్వానికి సునీతారావు విజ్ఞప్తి

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో జరిగిన సంఘటన బాధాకరమని, పెద్ద మనసుతో తమను క్షమించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌లకు, పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం సునీతారావు మీడియాతో మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నానంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తమమన్నారు. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పని చేస్తానని ఆమె తెలిపారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సాగర విపత్తు!

కేరళ సముద్రతీరానికి 38 నాటికల్ మైళ్ళదూరంలో, ఆరేబియా సముద్రంలో శనివారం ప్రమాదానికి గురైన లైబీరియా కార్గోనౌక క్రమంగా ఒరుగుతూ ఆదివారం పూర్తిగా మునిగిపోయింది. నౌకలోని వందలాది కంటైనర్లు సముద్రంలో పడిపోయి, చమురు, ప్రమాదకర రసాయనాలు భారీగా లీకవుతూండటమే కాక, పెద్దసంఖ్యలో కంటైనర్లు ఒడ్డుకు కొట్టుకువస్తున్నాయి. చేపలవేటను నిషేధించి, మత్స్యకారులను సముద్రంలోకి వెళ్ళకుండా ఆపగలిగినప్పటికీ, విస్తరిస్తోన్న చమురుతెట్టును కట్టడిచేయడం, విషపూరిత రసాయనాల ప్రభావాన్ని ఉపశమింపచేయడం పెద్ద సవాలుగా మారింది. కేరళ రాష్ట్రప్రభుత్వం దేశ, విదేశీ నిపుణుల సాయంతో దుష్ప్రభావాలను అరికట్టాలని నిర్ణయం తీసుకుంది.

నాలుగువందల యాభై మెట్రిక్ టన్నుల డీజిల్, ఫర్నెస్ ఆయిల్‌తో పాటు కాల్షియం కార్బైడ్ వంటి విషరసాయనాలను సైతం ఈ నౌక రవాణా చేస్తున్నందున పలురకాల ప్రమాదాలను, సమస్యలను కూడా నిపుణులు ఊహిస్తున్నారు. తీరప్రాంతవాసులకు ప్రమాద తీవ్రతను తెలియచేసి వివిధ తీరాలకు కొట్టుకువస్తున్న కంటైనర్లను తాకవద్దన్న హెచ్చరికలు కూడా అధికారులు చేశారు. తీరానికి వందలమీటర్ల దూరంలో ఉండాలన్న నిబంధనను సైతం విధించారు. తీరరక్షకదళం, నావికాదళం కలగలసి ఈ కార్గోనౌకలోని 24మంది సిబ్బందినీ రక్షించడంతో పాటు, చమురుతెట్టు వ్యాప్తివేగాన్ని నియంత్రించేందుకు డోర్నియర్ విమానం ద్వారా ఆయిల్ స్పిల్ డిస్పర్సెంట్స్ వినియోగం కూడా వెంటనే జరిగింది. రాపిడ్ రెస్పాన్స్ బృందాలు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి. చమురువ్యాప్తి, కంటైనర్లు కొట్టుకురావడం వంటి పరిణామాలపై రుతుపవనాల ప్రభావం అధికంగా ఉంటోంది. ఆశించినంత వేగంగా నియంత్రణ, నివారణ చర్యలు సాగకపోవడానికి కూడా రుతుపవనాలు కారణమవుతున్నాయి. టైర్–2 కేటగిరీ ప్రమాదం కాబట్టి, ఇటువంటి సందర్భాల్లో జాతీయస్థాయి సంస్థలు చేయాల్సినవన్నీ చేస్తున్నాయి.

నియంత్రణ, ఉపశమన చర్యలతో కాలుష్యాన్ని ఎంతగా కట్టడి చేయగలిగినప్పటికీ, సముద్ర జలాల్లో కలిసిపోతూ, లోతుల్లోకి జారిపోతున్న విషాన్ని వడగట్టడం అసాధ్యమైన విషయం. రాబోయేరోజుల్లో సముద్రజీవులమీదా, పర్యావరణంమీద ఈ ఉపద్రవం ప్రభావం హెచ్చుగా ఉండేమాట నిజం. మత్స్యకారుల జీవనోపాధికి కొంతకాలం ఆటంకం తప్పదు. ప్రమాదకర రసాయనాలు నీళ్ళలో కరిగి, చేపల్లోకి చేరతాయి కనుక, అనేక నెలలపాటు ప్రభావిత ప్రాంతాన్ని అధ్యయనం చేయవలసి ఉంటుంది. సముద్రజీవరాశికి ఈ కార్గోనౌక చేసిన అపారనష్టం అంచనాలకు అందనిది. అతి తక్కువ కాలుష్యంతో దేశంలో కేరళ బీచ్‌లకు మంచిపేరుంది, పర్యాటకానికి అవన్నీ పెట్టింది పేరు. ఆ జలాల్లో కాలుష్యం వ్యాప్తిని నివారించేందుకు, సాధ్యమైనంత అధికంగా శుద్ధి జరిపేందుకు మన నిపుణుల సలహాలూ సూచనలతో పాటు, అంతర్జాతీయ సంస్థల సాయం కూడా తీసుకోవాలి. ఇప్పుడున్న విధానాలన్నీ ఉపరితలంలోనే తప్ప, లోతైన శుద్ధి చేయలేవన్న వాదన ఉన్నప్పటికీ, ఖర్చుదారీపని అని వెనకాడకుండా పర్యావరణానికీ, జీవరాశికీ జరిగిన ఈ అన్యాయాన్ని చేతనైనంతమేరకు సరిదిద్దాల్సిందే. సముద్రజలాల్లో చమురు పారబోయడమే కాక, ప్రమాదకర రసాయనాలతో జలాలను విషపూరితం చేసి, సముద్ర, తీరప్రాంత జీవవైవిధ్యాన్ని ముప్పులో ముంచిన ఘటన ఇది. కొన్ని రకాల సముద్రజీవులకు సంతానోత్పత్తికి అనువైన కాలం కూడా ఇదే. అందువల్ల, అన్ని రకాల నష్టాన్ని నిర్దిష్టంగా గణించి, అంతర్జాతీయ చట్టాలకు లోబడి సదరు సంస్థనుంచి నష్టపరిహారాన్ని సాధించడం గురించి కూడా ఆలోచించాలి.

సముద్రంలో వాతావరణ పరిస్థితులు తలకిందులైనప్పుడు, పరస్పరం ఢీకొన్నప్పుడు ఓడలు తిరగబడటం సహజం. సముద్రపునీరు లోపలకు చొరబడి ఈ కార్గోనౌక ఒరిగిపోవడానికీ, అంతిమంగా మునిగిపోవడానికీ ఏయే కారణాలు దోహదం చేశాయో నిర్ధారణ జరగాలి. దాదాపు ముప్పై సంవత్సరాలుగా తిరుగుతున్న ఈ ఓడ నిర్వహణ సక్రమంగా ఉన్నదా, అత్యంత ప్రమాదకర రసాయనాలతో భారీ సరుకురవాణాకు ఇది తగినదేనా? అన్నవి తేలాలి. శక్తిసామర్థ్యాలకు మించిన అదనపు బరువుతో అది ప్రయాణం చేసిందా అన్నదీ ముఖ్యమే. ప్రమాదాలు అకారణంగా ఏమీ జరగవు. కార్యకారణసంబంధాలను నిగ్గుతేల్చగలిగినప్పుడు, ఇటువంటి ఘటనలను కొంతమేరకైనా నివారించవచ్చు.

కశ్మీర్ లోయలో పాకిస్థాన్ ప్రేరేపిత రక్తపాతాన్ని ముక్త కంఠంతో ఖండించే విషయంలో ఇప్పటికీ ప్రపంచ దేశాలు ఆశించిన విధంగా స్పందించడం లేదు. దౌత్య మర్యాదలను పక్కనపెట్టి 2019లో అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలలో ట్రంప్‌కు మద్దతుగా మోదీ ప్రచారం చేశారు. అయినా ట్రంప్ నోట సైతం పాకిస్థాన్ పట్ల ప్రశంసలు వినపడడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? భారతదేశం తన విదేశాంగ విధానాన్ని నిష్పాక్షికంగా సమీక్షించుకోవల్సిన సందర్భమిది.

ఉగ్రవాదంపై భారత్ ఒంటరిపోరు

ప్రపంచంలో ఉగ్రవాదం బారినపడిన ప్రప్రథమ దేశాలలో భారత్ ఒకటి. ఉగ్రవాదం అంటే ఏమిటో ప్రపంచ ప్రజలకు తెలియని కాలంలో భారతదేశం ఆ రక్కసి దాడులకు గురయింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా ఎత్తుడుబిడ్డగా ఉన్న పాకిస్థాన్ ప్రేరేపించిన ఉగ్ర హింసాకాండకు వ్యతిరేకంగా విశాల భారతావని ఏకత్రాటిపై నిలబడి సమర్థంగా పోరాడింది. గతంతో పోల్చితే ఇప్పుడు ఉగ్రవాద ఘాతుకాలు చాల వరకు తగ్గిపోయాయి. అయితే కశ్మీర్ లోయలో తరచు జరుగుతోన్న పాకిస్థాన్ ప్రేరేపిత రక్తపాతాన్ని ముక్త కంఠంతో ఖండించే విషయంలో ఇప్పటికీ ప్రపంచ దేశాలు ఆశించిన విధంగా స్పందించడం లేదు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత విదేశాంగ విధానంలో తనదైన ఒక విశిష్ట శైలిని నెలకొల్పారు. పహల్గాం అమానుష మారణకాండను ఖండిస్తూ దానికి బాధ్యులను హెచ్చరింపజేయడంలో ప్రపంచ దేశాల మద్దతును ప్రధాని మోదీ సమీకరించలేకపోయారు. ఇరుగు పొరుగు నేపాల్, భూటన్ మొదలు అమెరికా దాకా ఎన్నో దేశాలు పహల్గాం ఉగ్రదాడిని ఖండించాయి. అయితే పాకిస్థాన్‌ను ఒక్క పల్లెత్తు మాట అనలేదు! ఇది భారత ప్రభుత్వాన్ని, ప్రజలను విస్మయానికి గురి చేసింది. భారత సైనిక అవసరాలకు దన్నుగా ఉన్న రష్యా సైతం ఇరు దేశాలు సంయమనం పాటించాలని మాత్రమే విజ్ఞప్తి చేయడం గమనార్హం. 'తన స్నేహితుడు' అని ప్రధాని మోదీ సగర్వంగా చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా పాకిస్థాన్‌ను పల్లెత్తు మాట అనలేదు. అనకపోగా, ఉగ్రవాదాన్ని ఎగుమతి చేసే పాకిస్థాన్‌ను మహోన్నత భారత్‌తో పోల్చి భారతీయులను అవమానపరిచారు.

గల్ఫ్ లేఖ

అంతర్జాతీయంగా భారత ప్రతిష్ఠను ఇనుమడింపజేయడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత దశాబ్ద కాలంగా నిర్మాణాత్మక పాత్ర వహిస్తున్నారు, సందేహం లేదు. సంప్రదాయ దౌత్య నియమాలకు అదనంగా మోదీ తన వ్యక్తిగత శ్రద్ధాసక్తులతో విదేశాంగ విధాన దిశ, దశలను మార్చారు. తరుచు విదేశీ పర్యటనలు చేయడమే కాకుండా, ప్రపంచ శిఖరాగ్ర సదస్సుల సందర్భంగా చొరవ తీసుకుని ప్రభావశీలురు అయిన ప్రపంచ దేశాల అధినేతలతో చనువుగా మాట్లాడే తీరు,



వ్యంగ్యోక్తులు విసిరే వైనం అమిత ఆసక్తికరంగా ఉంటుంది. అటువంటి చనువు, చొరవ జవహర్‌లాల్ నెహ్రూ సైతం ఎప్పుడూ తీసుకోలేదు. వృత్తిరీత్యా దౌత్యవేత్త అయిన విదేశాంగ మంత్రి జైశంకర్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ అయిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అనుభవం మోదీకి అదనంగా కలిసి వస్తున్న విశేష సానుకూల అంశం.

మరి మోదీ విదేశీ పర్యటనలు, ప్రపంచ నేతలతో ఆయన వ్యక్తిగత మైత్రి పహల్గాం మారణకాండ అనంతరం ఎంత వరకు దేశానికి ఉపకరించాయి? ఇది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న. సమస్త దౌత్య మర్యాదలను పక్కనపెట్టి 2019లో అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలలో ట్రంప్‌కు మద్దతుగా మోదీ ప్రచారం చేశారు. అయినా ట్రంప్ నోట సైతం పాకిస్థాన్ పట్ల ప్రశంసలు వినపడడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

ప్రధాని మోదీ ప్రతిష్ఠ భారత విదేశాంగ విధానానికి ప్రామాణికమైతే, ప్రస్తుతం గల్ఫ్‌తో సహా వివిధ దేశాలకు అఖిలపక్ష ఎంపీ బృందాల పర్యటన అవశ్యకత ఎందుకు? ఇది సహజంగా స్ఫురించే ప్రశ్న. ప్రస్తుతం భారత పార్లమెంటేరియన్లు పర్యటిస్తున్న దేశాల రాయబార కార్యాలయాలన్నీ న్యూఢిల్లీలో ఉన్నాయి. అనుభవజ్ఞుడయిన విదేశాంగ మంత్రి రాయబారులకు ఇచ్చే విపుల వివరణల కంటే ఎక్కువగా, యువ పార్లమెంటు సభ్యులు శ్రీకృష్ణదేవరాయులు, హరీష్ బాలయోగిలతో కూడిన ఎంపీ బృందాలు విదేశీగడ్డపై విదేశీ నేతలకు వివరించగలుగుతాయా?

అందునా భద్రతా మండలి సభ్య దేశాలు, కీలక మిత్ర, ముస్లిం దేశాలకు భారతీయ పార్లమెంటేరియన్ల బృందాలను పంపించడం వల్ల భారత–పాకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలలోని కశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయం చేయడానికి పరోక్షంగా దోహదపడదూ? ఇది ఉపేక్షించదగని వాస్తవం. అందునా ఏరికోరి ముస్లిం రాజకీయ నాయకులను గల్ఫ్ దేశాలకు పంపించడం విడ్డూరంగా ఉంది. అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఉన్నా భారతీయ సమాజం దేశ సార్వభౌమత్వాన్ని సంరక్షించుకోవడంలో సమైక్యంగా ఉన్నది, ఎప్పటికీ సమైక్యంగా ఉంటుంది. ఈ తిరుగులేని వాస్తవాన్ని ప్రపంచం ముందు రుజువు చేసుకోవల్సిన అవసరం లేదు.

పాకిస్థాన్‌కు చైనా, టర్కీ, అజర్ బైజాన్ అండగా నిలిచాయి. మరి చైనాను మినహాయించి, మిగతా రెండు దేశాల ఉత్పత్తులు, సేవలను బహిష్కరించాలని కొందరు పిలుపునివ్వడాన్ని ఏ విధంగా అర్థంచేసుకోవాలి? అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ పాకిస్థాన్‌కు బిలియన్ డాలర్ల రుణాన్ని ఇవ్వడాన్ని దౌత్య పలుకుబడితో అడ్డుకోలేకపోయిన మనం ఒక మిఠాయి – మైసూర్ పాక్– పేరును మార్చుకుని మురిసిపోతున్నాం! మోదీ తన మిత్రుడని భావించే ట్రంప్, కశ్మీర్‌పై భారత్ సైనిక చర్య గురించి మాట్లాడిన తీరు భారతీయులకు అవమానకరం. ఒక్కసారి కాదు, వివిధ సందర్భాలలో ఆయన అదే బాణీని పునరుద్ఘాటించారు. ట్రంప్ ప్రకటనపై భారత ఖండనను అంతర్జాతీయ సమాజం పట్టించుకోనేలేదు. అంతర్జాతీయ మీడియాలో భారత్ వాదం వినిపించకపోవడమే అందుకు నిదర్శనం. భారతదేశం తన విదేశాంగ విధానాన్ని నిష్పాక్షికంగా సమీక్షించుకోవల్సిన సందర్భమిది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

'పహల్గామ్'తో మారుతున్న రాజకీయాలు



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

దేశ రాజధానిలో వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియదు. విపరీతంగా ఉక్కబోస్తున్న సమయంలో వర్షాలు ముంచెత్తుతున్న కాలమిది. ప్రస్తుతం రాజకీయ వాతావరణం కూడా ఇదే విధంగా ఒక సంధి దశలో ఉన్నట్లు కనపడుతోంది. భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీతో సహా దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు తమ దారిని వెతుక్కునే క్రమంలో ఉన్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా పరివర్తనం చెందకుండా, ప్రజల ఆలోచనలను పసిగట్టకుండా మార్పులను ప్రతిఘటించేవారు క్రమంగా పలుకుబడిని, ప్రభావాన్ని కోల్పోతారని చాణక్యుడుతో సహా పలువురు చరిత్రకారులు అనేక సందర్భాల్లో చెప్పారు. ఇప్పుడు రాజకీయ పార్టీలు, నేతలు తమను తాము మార్చుకునే క్రమంలోనో, మార్పుకు సిద్ధమవుతున్న క్రమంలోనే ఉన్నట్లనిపిస్తోంది.


ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉండగా భారతీయ జనతా పార్టీకి మరో బ్రాండ్ అంబాసిడర్ అవసరం లేదు. బీజేపీకి బలం, ఆత్మస్థైర్యం ఆయనే. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌పై యుద్ధం ప్రకటించిన నరేంద్రమోదీ, ఈ యుద్ధం నాలుగు రోజుల్లోనే ముగిసిన తర్వాత దాని గురించి ప్రచారం చేసే బాధ్యత పూర్తిగా తన భుజస్కంధాలపై వేసుకున్నారు. తిరంగా యాత్ర వంటి కార్యక్రమాలతో పార్టీని ప్రజల్లోకి వెళ్లమని ఆదేశించినా, నీతీ ఆయోగ్, ఎన్డీఏ వంటి సమావేశాల్లో కూడా ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసించేలా నరేంద్రమోదీ మాట్లాడినప్పుడే దానికి బహుళ ప్రచారం లభిస్తోంది. ఎందుకంటే పాక్‌పై యుద్ధం ప్రారంభించేందుకు, దాన్ని ముగించేందుకు కర్త, కర్మ, క్రియ నరేంద్రమోదీయే. యుద్ధం ముగిసిన తర్వాత ఆయన స్వంత రాష్ట్రమైన గుజరాత్‌లో రెండు రోజులు పర్యటించారు. ఈ నెలలో బిహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, సిక్కిం, మధ్యప్రదేశ్‌లో పర్యటించనున్నారు. యుద్ధం ప్రారంభించడంపై, ముగించిన తీరుపై ప్రశ్నల వర్షానికి ఆస్కారం లేకుండా ఆయన ప్రయత్నిస్తున్నారు.

అయినప్పటికీ కార్గిల్, పుల్వామా అనంతర పరిణామాలు దేశ రాజకీయాలను నిర్దేశించినట్లే పహల్గామ్ అనంతర పరిణామాలు దేశ రాజకీయాలను నిర్దేశిస్తాయా? అన్న చర్చ సాగుతోంది. 1999 ఏప్రిల్ 17న వాజపేయి ప్రభుత్వం కేవలం ఒకే ఒక్క ఓటుతో అధికారం కోల్పోయింది. కాని 1999 జూలైలో కార్గిల్‌లో చొరబాటు జరిగినప్పుడు భారతీయ సైన్యం పాకిస్థాన్‌కు బలంగా గుణపాఠం చెప్పిన తర్వాత సెప్టెంబర్ – అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల్లో 20 పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమి ప్రభంజనం వీచింది. 303 స్థానాలతో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏలో 29 సీట్లతో తెలుగుదేశం కీలక భాగస్వామ్యంగా నిలిచింది. కాని యుద్ధం వల్ల వచ్చిన ఊపు పెద్దగా నిలవలేదు. 1999లో బీజేపీకి లభించిన 182 సీట్లు 138కి పడిపోయాయి. మెజారిటీ కేంద్ర మంత్రులు ఓడిపోయారు. ఆ తర్వాత పదేళ్ల పాటు యూపీఏ ప్రభుత్వం అధికారంలో కొనసాగింది.

యూపీఏ ప్రభుత్వాన్ని గద్దె దించి పదేళ్ల పాటు అధికారంలో కొనసాగిన నరేంద్రమోదీ గత ఎన్నికల్లో 240 సీట్లు సాధించినప్పటికీ తన ప్రభావం కోల్పోలేదు. కాంగ్రెస్ 99 సీట్లకే పరిమితం కావడంతో ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు మోదీకి పూర్తి మద్దతు ప్రకటించాయి. తన సారథ్యంలో బీజేపీ తక్కువ సీట్లు లభించాయని తెలిసినప్పటికీ గడచిన ఏడాదిగా మోదీ తన ఆకర్షణ, ఆదరణ తగ్గకుండా చూసుకుంటున్నారు. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఆయన విలువను మరింత పెంచింది. తన స్వభావానికి భిన్నంగా మిత్రపక్షాలను సంతోషపెట్టే ప్రయత్నం చేయడంలోనూ, పార్టీలో అసంతృప్తి స్వరాలు తలెత్తకుండా చూడడంలోనూ ఆయన విజయం సాధించారు. అదే సమయంలో కులగణన వంటి అంశాలపై పట్టువిడుపులతో వ్యవహరించారు. తమిళనాడులో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడినే తొలగించి అన్నాడీఎంకేకు స్నేహహస్తం చాచారు.

నిజానికి వాజపేయి హయాంలో జరిగినట్లు పాకిస్థాన్‌తో యుద్ధం మరికొన్ని రోజులు జరిగి ఉంటే మోదీ ప్రభంజనానికి తిరుగు ఉండేది కాదు. కాని అణుయుద్ధానికి దారితీసే ప్రమాదం ఏర్పడడం, విదేశీ శక్తులు జోక్యం చేసుకోవడం ఈ యుద్ధ విరమణ జరగడం ప్రజల్లో తీవ్ర చర్చలకు దారి తీసింది. నరేంద్రమోదీ దాదాపు 90 విదేశీ పర్యటనలు చేసినా, పదిసార్లకు పైగా అమెరికా వెళ్లి వచ్చినా పాకిస్థాన్‌ను ఉగ్రవాదం విషయంలో ఏకాకి చేయలేకపోవడం, కొన్ని దేశాలు పాక్‌కు మద్దతునీయడం చాలా మందికి ఆశాభంగం కలిగించింది. పాకిస్థాన్ మరోసారి చిన్న ఉగ్రవాద చర్యకు పాల్పడినా తేరుకోలేనంత బుద్ధి చెబుతాం అని భారత నేతలు అంటున్నారు. కాని అంతర్జాతీయంగా భారత్‌కు మద్దతు రానంతవరకూ, పాకిస్థాన్‌ను ఏకాకి చేయనంతవరకూ భారతదేశం ఆ దేశానికి గట్టిగా బుద్ధి చెబుతుందా లేదా అన్న సందేహాలు కలుగుతూనే ఉంటాయి.

అయినప్పటికీ మోదీకి ఇప్పట్లో పార్టీలో, ఎన్డీఏ తిరుగుండదని మోదీ శకం ఇప్పట్లో ముగిసే అవకాశాలు లేవని ఆయన అభిమానులు భావిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం మోదీ స్థానంలో అంతటి బలమైన ప్రత్యామ్నాయ నాయకుడు లభించగలడా అన్న సందేహాలు వారిలో నెలకొనడమే. అయినా ప్రజల మనోభావాలను తమకు అనుకూలంగా తిప్పుకోవడం, ప్రతిపక్షాల దాడిని ఎదుర్కోవడం మాత్రమే కాక, బీజేపీ కొన్ని అంతర్గత సమస్యల్ని కూడా పరిష్కరించుకోవల్సిన పరిస్థితిలో ఉన్నది. గత ఆరునెలలుగా మోదీ, అమిత్ షాలు బీజేపీ జాతీయ అధ్యక్షుడి స్థానంలో తమకు అనుకూలమైన నేతను నియమించలేకపోతున్నారు. కొన్ని రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల నియామకం కూడా పెండింగ్‌లో పడిపోయింది. దేశంలో హిందూత్వ ప్రాబల్యం పూర్తిగా పెరిగింది కనుక ఒకే వ్యక్తి ఆధారిత నాయకత్వం కాకుండా సంస్థాగతంగా పార్టీ బలోపేతం కావడం అవసరమని ఆరఎసఎస్ భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. విజయదశమి నాటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రోజురోజుకూ విస్తరిస్తోంది. భారతదేశం ఇప్పటికే హిందూ రాష్ట్రమని ఇటీవల ఆరఎసఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ ఆర్గనైజర్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. వ్యక్తి ప్రాధాన్యత తగ్గి విలువల ప్రాధాన్యత పెరగాలని చెప్పిన భాగవత్ బీజేపీని మరింత బలమైన సైద్ధాంతిక పార్టీగా మార్చాలని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ప్రస్తుతం



పాకిస్థాన్‌పై యుద్ధం ప్రారంభించేందుకు, దాన్ని ముగించేందుకు కర్త, కర్మ క్రియ నరేంద్రమోదీయే. యుద్ధాన్ని ఆరంభించి, ముగించిన తీరుపై ప్రశ్నల వర్షానికి ఆస్కారం లేకుండా ఆయన ప్రయత్నిస్తున్నారు. కార్గిల్, పుల్వామా అనంతర పరిణామాలు దేశ రాజకీయ గతిని నిర్దేశించినట్లే పహల్గామ్ పర్యవసానాలు వర్తమాన రాజకీయాలను నిర్దేశిస్తాయా అన్న ప్రశ్నపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

ఆరఎసఎస్, బీజేపీల అంతర్గత సంబంధాల తీరుతెన్నులపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

ఈ విషయం అలా ఉంటే బిహార్, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో పార్టీకి విజయం సాధించిపెట్టడమే కాదు, దక్షిణాదిన విస్తరించడం, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓటు బ్యాంకును నిలబెట్టుకోవడం నరేంద్ర మోదీ ముందున్న కర్తవ్యం. మూడో టర్మ్‌లో తనకు తిరుగులేకుండా చేసేందుకు మోదీ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తూనే ఉన్నారు. రానున్న కొద్ది నెలల్లో మోదీ తన సమస్యలను ఎలా అధిగమించగలరన్నది తెలుతుంది.

మరోవైపు కాంగ్రెస్ కూడా పుంజుకుంటున్నదని చెప్పేందుకు ఎలాంటి రుజువులు కనిపించడం లేదు. తెలంగాణతో సహా పలు రాష్ట్రాల్లో పార్టీ అంతర్గత సమస్యలతో సతమతమవుతోంది. అనేక నిర్ణయాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. ఢిల్లీ వస్తున్న నేతలకు సరైన సమాధానం చెప్పగల నేతలు కనపడడం లేదు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ నాలుగోసారి పరాజయం చెందకుండా 2029 నాటికి బలమైన పార్టీగా మారుతుందా లేదా అన్న విషయంలో పార్టీ నేతల్లోనే చర్చ జరుగుతోంది. దేశ వ్యాప్తంగా 21.2 శాతం ఓటు ఉన్న కాంగ్రెస్‌ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. కాని మోదీని ఎదుర్కొనగల బలమైన నాయకత్వం, సాహసోపేతమైన సైద్ధాంతిక ఎజెండాతో పాటు విశ్వసనీయమైన జాతీయ సంకీర్ణాన్ని ఏర్పాటు చేయగల శక్తి కాంగ్రెస్ సమకూర్చుకోగలగాలి. అధికార వికేంద్రీకరణ, జిల్లా స్థాయినుంచి పార్టీని బలోపేతం చేయడం అవసరం. సామాజికన్యాయమే ఎజెండాగా ప్రకటిస్తూ కాంగ్రెస్‌ను బలహీన వర్గాల పార్టీగా ప్రజలు అక్కున చేర్చుకోవాలని రాహుల్ భావిస్తున్నారు. కాని బీజేపీ శక్తిమంతమైన జాతీయవాదానికి వ్యతిరేకంగా ప్రజలు స్వీకరించే ఒక సైద్ధాంతిక భావనను ఏర్పరచడంలో కాంగ్రెస్ ఇంకా విజయవంతం కాలేకపోతున్నది. రాహుల్ భారత్ జోడో యాత్ర, వివిధ రాష్ట్రాల్లో పర్యటనలు పార్టీని ఉనికిలో ఉండేలా చేస్తున్నాయి కాని ఒక సంస్థగా పార్టీ ప్రజల్లో పుంజుకోవాల్సిన మరింత క్రియాశీలక నాయకత్వం కాంగ్రెస్‌కు అవసరం.

ప్రాంతీయ పార్టీలు కూడా పరిణామ క్రమంలోనే ఉన్నాయని చెప్పక తప్పదు. సమాజ్‌వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, తృణమూల్ కాంగ్రెస్ మొదలైన కీలక పార్టీలు తమను తాము బీజేపీ నుంచి రక్షించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నాయి. తమిళనాడులో డీఎంకే తిరిగి అధికారంలోకి రావడానికి రకరకాల ఎత్తుగడలు వేస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ నిలదొక్కుకునేందుకు యత్నిస్తుండగా బీఆరఎస్ అంతర్గత కలహాల్లో కూరుకుపోయింది. కేసీఆర్ పార్టీపై పట్టు కోల్పోయినట్లు కనిపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తనకు లభించిన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేయడంలో విజయవంతం అయిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు తాను, తన పార్టీ మనుగడ కాపాడుకోలేని ప్రమాదంలో ఉన్నారు.


43 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీని గద్దెదించి దేశంలో ప్రత్యామ్నాయ పాలనకు శ్రీకారం చుట్టిన తెలుగుదేశం కూడా భావి మార్పులకు సిద్ధమవుతోందని మహానాడు జరుగుతున్న తీరుతో అర్థమవుతోంది. దేశంలో గత నాలుగు దశాబ్దాల్లో జరిగిన అనేక కీలక రాజకీయ పరిణామాల్లో భాగస్వామి అయిన చంద్రబాబునాయుడు నిర్దిష్టమైన, పరిమితమైన లక్ష్యాలను పెట్టుకుని చరిత్రలో నిలిచిపోవాలన్న ధ్యేయంతో అడుగులు వేస్తున్నారు. 1989లో ఎన్టీఆర్ హయాంలో నేషనల్ ఫ్రంట్‌లోనూ, 1998లో చంద్రబాబు హయాంలో వాజపేయి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం నేడు మోదీ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండడమే ఆ పార్టీ కీలక ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. తెలుగుదేశం చారిత్రక పయనం ప్రాంతీయ పార్టీలు అవలంబించాల్సిన తీరుకు గుణపాఠం అని వేరే చెప్పనక్కర్లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఖరీఫ్ సాగు సమస్యలు తీరేనా?

'వానాకాలం పంటల సాగుకు సన్నద్ధం కావాలని... అన్ని జిల్లాల్లో సాగు విస్తీర్ణానికి సరిపడ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని, నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేసే కంపెనీలు, నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని...' ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వ్యవసాయశాఖ అధికార్లతో ఇటీవలే సచివాలయంలో జరిపిన సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు.

...ఇప్పటికే అన్ని జిల్లాలకు సరిపడ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని... ఈ సీజన్‌లో వరి, పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని రైతుల నుంచి డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు మార్కెట్‌లో ఉన్నాయని, సీఎంకు అధికారులు వివరించారు. కానీ, ఆచరణలో ప్రతి సంవత్సరం జరుగుతున్నది మరో విధంగా ఉంటున్నది. ఈ సంవత్సరం కూడా దానికి భిన్నంగా ఉండబోదని భావించాల్సి వస్తున్నది. మొత్తం విత్తన అవసరాల్లో ప్రభుత్వ విత్తన సరఫరా 20శాతం మాత్రమే. అలాగే ఎరువుల కొరత కూడా ఉంది.



ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని సాధారణం కంటే ముందే తాకాయి. తెలంగాణలో కూడా రుతుపవనాలు వ్యాపించాయి. ఫలితంగా రాష్ట్రంలో తొలకరి జల్లులు పడుతున్నాయి. దీంతో రైతాంగానికి ఆశ కలుగుతోంది. గత ఏడాది అకాల వర్షాలు, నాసిరకం, కల్తీ విత్తనాలు, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవటం వంటి సమస్యలన్నీ రైతులను నష్టపరిచాయి. దీంతో రైతు ఆత్మహత్యలు కొనసాగాయి. ఇది బాధాకరమైన విషయం. అయినా సాగునే నమ్ముకొన్న రైతాంగం బాధల్ని దిగమింగుకొని మళ్ళీ ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సిద్ధపడ్డారు. 'తమది రైతు ప్రభుత్వమ'ని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు అన్ని విధాలా తోడ్పడాలి.

రాష్ట్రంలో ఈ సంవత్సరం కోటి 34 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు ఖరీఫ్‌లో సాగు కానున్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో వరి 66.80 లక్షల ఎకరాల్లో, పత్తి 50 లక్షల ఎకరాల్లో... అలాగే మిర్చి, వేరుశనగ, మొక్కజొన్న, సోయాబీన్, మినుములు, కంది, ఇతర ఉద్యానవన పంటలు వేయనున్నారు. ఇందుకు వరి విత్తనాలు 16.70 లక్షల క్వింటాళ్ళు, 90 లక్షల పత్తి ప్యాకెట్లు, క్వింటాళ్ల కొద్దీ సోయా-చిక్కుడు విత్తనాలు అవసరం అవుతాయి. అయితే విత్తనాలు అందుబాటులో ఉంచామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా, విత్తనాల లోటును ఆసరా చేసుకొన్న వ్యాపారులు నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. ప్రభుత్వం కఠిన చర్యల పేరుతో విత్తన కంపెనీలపై కాకుండా, అమ్మేవారిలో కొందరిపై చర్యలు చేపట్టి, చేతులు దులుపుకుంటున్నది. ఇది నకిలీ విత్తన సమస్యకు పరిష్కారం కాదు. ఈ సందర్భంగా జన్యు శాస్త్రవేత్త సుమన్ సహాయ్ చెప్పిన మాటలు గమనార్హం.

"విత్తనాలపై ప్రైవేట్, కార్పొరేట్ బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యం భారత్‌లో వ్యవసాయ రంగానికి పెనుముప్పుగా మారింది. అన్నదాతలకు నష్టాలను మిగల్చటంతో పాటు నేల సాంద్రత దెబ్బతినటంతో సహా అనేక దుష్పరిణామాలకు కారణమవుతోంది. హరిత విప్లవ సమయంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో విత్తనాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేశారు. మొదట్లో అవి విత్తనాలను ఉత్పత్తి చేయించి రైతులకు పంపిణీ చేయించేవి. క్రమేపీ వాటిని నిర్వీర్యం చేశారు. ఇప్పుడు కార్పొరేట్, బహుళజాతి సంస్థల రాజ్యం నడుస్తోంది."

"సాగు విస్తీర్ణం లక్ష్యాలను ప్రైవేట్ రంగం తమకు అనుకూలంగా మార్చుకొంటోంది. రైతులను మోసం చేస్తోంది. కొనుగోలు చేసే రైతులకు రశీదులు ఇవ్వడం లేదు. విత్తన నాణ్యతను ముందుగా గుర్తించే వ్యవస్థ లేదు. పంటలు వేసి నష్టపోయిన తరువాతే లోపాలు బయటపడుతున్నాయి. మోసపూరిత సంస్థలపై చర్యల్లేవు. రైతులకు నష్టపరిహారం కూడా ఇచ్చే పరిస్థితి లేదు." ఈ పరిస్థితులన్నీ మారాలి.


వాస్తవానికి ఖరీఫ్ సాగుకు విత్తనాలు, ఎరువులతో పాటు, రుణాలు, వ్యవసాయ పరికరాలు, పురుగు మందులూ అవసరమే. అవి కౌలు రైతులతో సహా పేద, మధ్యతరగతి రైతాంగానికి సగం సబ్సిడీతో సకాలంలో ప్రభుత్వమే అందించాలి. ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా సరఫరా చేయాలి. అన్ని పంటలకు స్వామినాథన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధర చట్టబద్ధంగా కల్పించి అమలు చేయాలి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర పాలకులు తగిన ప్రణాళికలు రూపొందించి కృషి చేయాలి. అప్పుడే ఖరీఫ్ సాగుతో సంతృప్తికరమైన ఫలితాలు వస్తాయి.

■ కెచ్చెల రంగారెడ్డి
రాష్ట్ర అధ్యక్షులు, అఖిల భారత ఐక్య రైతు సంఘం

ఉద్యమాల జంగ్ సైరన్

'పాలకులు వస్తుంటారు, పోతుంటారు. జర్నలిస్టుల బతుకులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే. దేశ రక్షణలో మేం జవాన్ల కంటే ఏం తక్కువ కాదు. మేం చరిత్ర రికార్డ్ చేస్తం, ఎవ్వరికీ భయపడేది లేదు' అంటూ కడదాక ప్రజల కోసమే బతికిన నల్లనేల మట్టి బిడ్డ ఎండీ మునీర్. సింగరేణి కార్మికుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా, సీనియర్ జర్నలిస్ట్‌గా ఆయన సేవలు విశిష్టమైనవి. బెల్లంపల్లిలో సాధారణ సింగరేణి కార్మికుని కడుపున పుట్టిన మునీర్‌ది చిన్ననాటి నుండి అభ్యుదయ భావజాలమే. సీపీఐ అనుబంధ యువజన సంఘం ఏఐవైఎఫ్‌లో నాయకుడిగా పని చేశాడు. అదే సమయంలో తనకు మందమర్రిలో సింగరేణి కార్మికుడిగా ఉద్యోగం వచ్చింది. అలా మందమర్రితో సుదీర్ఘకాలం అనుబంధం ఏర్పడింది. ఎక్కడ ఉన్నా పాలకులను ప్రశ్నించడమే బాధ్యతగా భావించాడు మునీర్. అట్లా సింగరేణి సమస్యలపై గొంతెత్తి నినదించాడు. సింగరేణిని పాలకులు నిర్వీర్యం చేయాలనుకున్న ప్రతీసారి 'సింగరేణి బచావ్' అంటూ మునీర్ ముందువరసలో నిలిచి లడాయి చేశాడు. లెక్కలతో సహా వివరించి పాలకులను నిలదీశాడు. దీంతో మునీర్‌పై కక్షగట్టిన యాజమాన్యం మునీర్‌ను పలుమార్లు బదిలీ చేసింది.

నివాళి



ఎండీ మునీర్

పోరాటమే శ్వాసగా బతికిన మునీర్ తెలంగాణ ఉద్యమంలో సైతం కీలక భూమికను పోషించారు. సకల జనుల సమ్మె జరిగినపుడు జేఏసీ చైర్మన్‌గా పనిచేశారు. 70వేల మంది కార్మికులను తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలిపిన ఘనత మునీర్‌దే. తెలంగాణ ఏర్పాటుతోనే సింగరేణి మనుగడ సాధ్యమని బలంగా నమ్మాడు మునీర్. అందుకే బొగ్గుగని ప్రాంతంలో తెలంగాణ ఉద్యమాన్ని భుజస్కంధాల మీద మోశాడు. మునీర్ పోరాటానికి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబునాయుడు, కేసీఆర్ వంటి ముఖ్యమంత్రులు సైతం ఆశ్చర్యపడ్డారు. పలుమార్లు ఆయనతో చర్చలు జరిపి సలహాలు, సూచనలు తీసుకున్నారు.

సింగరేణిలో పనిచేస్తున్న కాలంలోనే ప్రజల పక్షాన కలం పట్టి కథనాలు రాశాడు. పలు దినపత్రికల్లో విలువైన వ్యాసాలు రాయడం ప్రారంభించాడు. అదే సమయంలో విప్లవోద్యమానికి సైతం దగ్గరయ్యాడు. నమ్మిన విలువల కోసం నిర్బంధాలను ఎదుర్కొన్నాడు. నాలుగున్నర ఏళ్ళ జైలు జీవితాన్ని సైతం అనుభవించాడు. పెరోల్ మీద బయటికి వచ్చిన సమయంలో ఆయనను అంతం చేయాలని భావించారు. చావు నీడలా వెంటాడుతున్నా వెన్ను చూపలేదు. అనారోగ్యం బారినపడ్డాడు. గుండె జబ్బు కారణంగా మూడు స్టంట్లు పడ్డాయి. అయినా సరే ఆ కలం ఆగిందే లేదు. పోలీసులు ఆయనను నిర్బంధించి కాలి గోర్లను పీకి ప్రత్యక్ష నరకాన్ని చూపించారు. మరోవైపు సింగరేణి యాజమాన్యం "ఉద్యోగం కావాలో, ఉద్యమం కావాలో?" తేల్చుకొమ్మంది. 33 ఏళ్ళు సింగరేణిలో పని చేసిన మునీర్ ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఉద్యోగానికి రాజీనామా లేఖను రాసి, అధికారుల మొహాన కొట్టి పూర్తికాలం జర్నలిస్ట్‌గా మారాడు. సింగరేణి కార్మిక నాయకుడిగా ఎంతటి సాహసోపేతమైన పాత్ర పోషించాడో, జర్నలిస్ట్‌గా సైతం అంతే చారిత్రాత్మకమైన పోరాటం చేశాడు.

మాటలు చెప్పడం కాదు, ఆచరణలో చేసి చూపించేవాడు. పోరాటమే తన జీవన విధానంగా మార్చుకున్నాడు. "హమ్నే ఖాయి కసమ్/ ఉస్ జండే తలే/ మౌతు మంజూర్ జంగ్ ఏ మైదాన్‌మే/ హమ్ జుకునేవాలా నహీ" అంటూ తెలంగాణ ఉద్యమ జర్నలిస్ట్‌ల సంఘం ఆవిర్భావ సభలో రాష్ట్ర కార్యదర్శిగా మునీర్ చారిత్రాత్మక ప్రసంగం చేశాడు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఎన్నో హామీలను ఇచ్చిన నాయకులు, రాష్ట్రం సాధించుకున్న తరువాత మాత్రం వాటిని గాలికి వదలడం మీద మునీర్ మండిపడ్డాడు. జీవితాంతం ఉద్యమాలు, పోరాటాల్లోనే బతికిన మన కాలపు కలం యోధున్ని అరుపదుల వయసులోనే కేన్సర్ కబళించింది. ఉద్యమకారుడిగా తెలంగాణ నేల విముక్తి కోసమే జీవించిన బొగ్గుబావుల మట్టిబిడ్డ మునీర్ అకాల మరణం తెలంగాణ నేలకు తీరని లోటు.

● పసునూరి రవీందర్
రాష్ట్ర ఉపాధ్యక్షుడు,
తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం



పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్‌లు
తెలివి తక్కువ జోకర్లు
కువైట్‌లో మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలు
భారత్‌పై విజయం సాధించామని తప్పుడు ప్రచారాలు 6

స్టీల్ హింజ్స్ కంపెనీపై దాడులు
నకిలీ ఐఎస్ఐ మార్కులున్న ఉత్పత్తులు జప్తు 6

మావోయిస్టుల పేరుతో లేఖ
మాజీ ఎమ్మెల్యే సోదరుడి కుమారుడిని చంపేస్తామని బెదిరింపు
రూ.50లక్షలు డిమాండ్
జీడిమెట్ల పోలీసుల అదుపులో ఇద్దరు 6



కూన రాఘవేందర్ గౌడ్

జైళ్లశాఖ స్థలం | ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్రమ లీజుపై హోంశాఖ ఆరా

- 'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందించిన సీఎంఓ
- ఎస్‌బీ, ఇంటలిజెన్స్ వర్గాలతో వివరాల సేకరణ
- ప్రత్యేక దర్యాప్తునకు హోంశాఖను కోరిన డీజీ!



సైదాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): జైళ్ల శాఖ స్థలం అక్రమ లీజుపై హోం శాఖ ఆరా తీస్తోంది. 'సొమ్ము జైళ్ల శాఖది, సోకు అధికారిది' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన ప్రత్యేక కథనంపై సీఎంఓ, హోంశాఖ స్పందించింది. దీనిపై నివేదిక ఇవ్వాలని సూచించడంతో ఎస్‌బీ, ఇంటజిలెన్స్ వర్గాలు వివరాల సేకరణలో తలమునకలయ్యారు. పూర్తి విచారణ జరిపి నివేదిక సమర్పించేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. అయితే, ఈ ఘటనపై దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలని

మిగతా 6వ పేజీలో..



ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎండీ, తదితరులు

వచ్చే వేసవికి సుంకిశాల
సిద్ధమవ్వాలి
వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు కృష్ణాజలాల తరలింపు కోసం చేపట్టిన సుంకిశాల ఇంటెక్‌వెల్ పనులను వచ్చే వేసవి నాటికి పూర్తి చేయాలని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశించారు. వాటర్‌బోర్డు డైరెక్టర్ శ్రీధర్, మేఘా ఇంజనీరింగ్ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీజీఎం మహేష్ కుమార్, హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్లు శశిధర్, సురేంద్రనాథ్, టీసీఎస్ ప్రతినిధి నితీష్‌లతో కలిసి అశోక్‌రెడ్డి మంగళవారం సుంకిశాల ప్రాజెక్టు పనులను పరిశీలించారు. సుంకిశాల పునర్నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, రీడిజైనింగ్ సంబంధించిన వివరాలను నిపుణులతో చర్చించారు. అలాగే శిథిలాల తొలగింపు అనంతరం సివిల్‌వర్క్‌లు, కంట్రోల్ రూం పనులు వేగంగా పూర్తయితే సైడ్‌వాల్ పునర్నిర్మాణానికి మార్గం సులభం అవుతుందని అంచనా వేశారు. అనంతరం నాగార్జున సాగర్ జలాశయం వైపు ఉన్న టన్నెలింగ్ ప్లగ్గింగ్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిటైనింగ్ వాల్ శిథిలాల తొలగింపును పూర్తిచేసి డిజైన్‌లు, డ్రాయింగ్‌లను 15 రోజుల్లోగా ఫైనలైజ్ చేయాలని ఆదేశించారు.

ఆదిలోనే హంసపాదు

రిజిస్ట్రేషన్లలో జాప్యం

- స్లాట్ బుకింగ్‌లోనూ సమస్యలే..!
- తరుచూ సర్వర్ డౌన్‌తో ఎదురుచూపులు
- డాక్యుమెంట్ రైటర్లను కలవందే ఏ పనీకాదు
- పాత కంప్యూటర్లతో తప్పని ఇబ్బందులు
- 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో పలు అంశాలు వెల్లడి



సూరారం సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో పడిగాపులు పడుతున్న రిజిస్ట్రేషన్ దారులు

హైదరాబాద్ సిటీనెట్‌వర్క్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చిన రిజిస్ట్రేషన్ల కొత్త స్లాట్ విధానానికి ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. నగరంలో ఇప్పటికే ప్రారంభమైన రిజిస్ట్రేషన్ల స్లాట్ బుకింగ్ విధానంపై పూర్తిస్థాయిలో అధికారులు, ప్రజల్లో అవగాహన లేకపోవడంతో పలు కార్యాలయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొంటు న్నాయి. తరచూ సర్వర్‌డౌన్ సమస్యలు తలెత్తుతుండడంతో రిజిస్ట్రేషన్లకు ఆటంకమేర్పడి ఆలస్యమవుతున్నాయి. మధ్యవర్తుల ప్రమేయం లేనిదే ఫైళ్లు ముందుకు కదలడం లేదు. జూన్ 2నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త స్లాట్ విధానాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తున్న నేపథ్యంలో గ్రేటర్‌లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మంగళవారం 'ఆంధ్రజ్యోతి విజిట్' నిర్వహించి సమస్యలు తెలుసుకుంది.

ANDHRAJYOTHY VISIT ఆంధ్రజ్యోతి విజిట్

స్లాట్ బుకింగ్‌లో ఇబ్బందులు ఇవే..!

స్లాట్ బుకింగ్ చేసుకునే ప్రక్రియపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్లాట్ బుక్ చేసుకుని ఏదో కారణాలవల్ల ఆ రోజు రిజిస్ట్రేషన్‌కు రాకపోతే రెండోరోజు తిరిగి స్లాట్ బుక్ చేసుకోవాలంటే రీషెడ్యూల్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. 'అన్ని డాక్యుమెంట్లు తీసుకొచ్చినా కొన్ని సందర్భాల్లో అవి సరిగా లేవని కొర్రీలు పెడుతూ ఇబ్బందులు సృష్టిస్తున్నారు. జీపీఏ క్యాన్సిల్ చేసుకునే సేవలను స్లాట్‌లో చేర్చలేదు. రిజిస్ట్రేషన్, వీలునామా, మ్యారేజ్ సర్టిఫికెట్లకు స్లాట్‌లో ఒక ఫీజు, కార్యాలయంలో మరో ఫీజు చూపిస్తోంది. దీంతో స్లాట్ రద్దు అవుతోంది. కట్టిన డబ్బులు వస్తాయో, రావో అనే సందిగ్ధత నెలకొంటుంది' అని రిజిస్ట్రేషన్‌దారులు అంటున్నారు.

మొరాయిస్తున్న కంప్యూటర్లు

కొత్తస్లాట్ విధానం అమల్లోకి తీసుకొచ్చిన ప్రభుత్వం దానికి తగినట్లుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సౌకర్యాలు కల్పించలేదు. 90 శాతం కంప్యూటర్లు పాతవే కావడంతో అవి తరుచూ మొరాయిస్తున్నాయి. యూపీఎస్ బ్యాకప్, కీబోర్డులు, మౌస్‌లు పనిచేయకపోవడంతో అధికారులు, సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. వర్షాలు కురిసిన సమయాల్లో సర్వర్‌డౌన్ వంటి సమస్యలు ఏర్పడి సేవల్లో అంతరాయం నెలకొంటోంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులపై ఆధారపడాల్సి వస్తోంది. సూరారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్ఆర్‌ఓ)లో రోజూ వందకు పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అయితే, ఇక్కడ రిజిస్ట్రార్లను పెంచి సిబ్బందిని పెంచకపోవడంతో రిజిస్ట్రేషన్‌కు ఎక్కువ సమయం పడుతున్నదని వినియోగదారులు వాపోతున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినా కొత్త కంప్యూటర్లను కార్యాలయాల్లో పంపిణీ చేయలేదని పలువురు తెలిపారు.

నెలాఖరులోపు కొత్త కంప్యూటర్లు ఏర్పాటు

ఈనెలాఖరులోపు అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొత్త కంప్యూటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూన్ 2 నాటికి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ విధానం పక్కాగా అమలు చేసే యోచనలో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

\- రవీందర్, హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్

స్లాట్‌బుకింగ్ సేవల్లో ఇబ్బందులు



స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్‌లపై ప్రజలకు పూర్తిగా అవగాహన లేదు. స్లాట్ బుకింగ్ ఎలా చేయాలో తెలియకపోవడంతో డాక్యుమెంట్ రైటర్లు, దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. స్లాట్ బుకింగ్ చేసి రిజిస్ట్రేషన్ తమ ద్వారానే చేయించుకోవాలని రైటర్లు కండిషన్లు పెడుతున్నారు.

\- రమేష్, ప్రైవేటు ఉద్యోగి

రైటర్లను కలిస్తేనే ఫైళ్లు ముందుకు

కొత్త స్లాట్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చినా.. చాలా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మధ్యవర్తుల ప్రమేయం లేనిదే

మిగతా 6వ పేజీలో..



బిజినెస్ లోన్ పేరిట
శఠగోపం
- రూ. 14.50 లక్షలు కొల్లగొట్టిన సైబర్ క్రిమినల్స్

హైదరాబాద్ సిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): రూ. కోటి బిజినెస్ లోన్ ఇప్పిస్తామని ఓ వ్యాపారి నెత్తిన శఠగోపం పెట్టిన సైబర్ నేరగాళ్లు అతని నుంచి రూ. 14.50లక్షలు కొల్లగొట్టారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు మంగళవారం సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 36 ఏళ్ల వ్యక్తి ట్రావెల్ బిజినెస్ చేస్తుంటాడు. వ్యాపార రుణాలు ఇప్పిస్తామంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోన్‌నంబర్లు కనిపించడంతో బాధితుడు సంప్రదించాడు. వ్యాపారాభివృద్ధికి రూ. కోటి రుణం ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు. డాక్యుమెంట్స్ ఆన్‌లైన్‌లో తీసుకుని లోన్ ప్రాసెస్‌లో ఉందంటూ ప్రాసెసింగ్ ఫీజు కింద మొదట కొంత డబ్బు తీసుకున్నాడు. లోన్‌కు ఆమోదం లభించిందంటూ మరికొంత, వివిధ రకాల బ్యాంకు చార్జీలు, ఇతర ఖర్చులు అంటూ విడతల వారీగా రూ.14.50లక్షలు కొల్లగొట్టాడు. అయినప్పటికీ లోన్ రాకపోవడంతో అతన్ని నిలదీయగా స్పందించడం మానేశాడు. దాంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శిల్ప లే అవుట్
వంతెన రెడీ


- జూన్ మొదటి వారంలో ప్రారంభించనున్న సీఎం
- రూ.178 కోట్లతో నిర్మాణం
- గచ్చిబౌలి చౌరస్తాలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా కొండాపూర్ వైపు సిగ్నల్ చిక్కులు లేకుండా ప్రయాణించేందుకు నిర్మిస్తోన్న శిల్ప లే అవుట్ సెకండ్ లెవల్ వంతెన త్వరలో అందుబాటులోకి రానుంది. రూ.178 కోట్లతో నిర్మించిన వంతెనను జూన్ మొదటి వారంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని గ్రేటర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ)లో భాగంగా గచ్చిబౌలి చౌరస్తాలో రూ.446.13 కోట్లతో రెండు దశల్లో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఔటర్ నుంచి సైబర్ టవర్స్ మాదాపూర్, కూకట్‌పల్లి వైపు వెళ్లే మొదటి లెవల్ ఫ్లై ఓవర్ గతంలోనే అందుబాటులోకి వచ్చింది. ఆరు లేన్లుగా 1.2 కి.మీల మేర రెండో లెవల్ వంతెన నిర్మాణానికి రూ.178 కోట్లు వెచ్చించారు. ఔటర్ నుంచి మాదాపూర్ వైపునకు, కొండాపూర్ వైపునకు వెళ్లేలా రెండు లెవల్స్‌లో వంతెనలు నిర్మించారు. వంతెన అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి చౌరస్తాలో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. కొండాపూర్ వైపు నుంచి ఔటర్ మీదుగా ఎయిర్‌పోర్ట్, ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్, మియాపూర్ వైపు సిగ్నల్ చిక్కులు లేకుండా వెళ్లేందుకు అవకాశముంటుంది.

'బయోమెట్రిక్' ఫోర్జరీ!

- విధులకు దుమ్మా...
- అయినా పూర్తి జీతం
- తోటి ఉద్యోగులకూ అటెండెన్స్‌లో మార్పులు
- జేబులు నింపుకుంటున్న వైనం!
- ఉస్మానియా ఆస్పత్రిలో చక్రం తిప్పుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి

మంగళ్‌హాట్, మే 27(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో విధులకు వచ్చే వారి బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పర్యవేక్షించే ఓ ఔట్‌సోరింగ్ ఉద్యోగి.. తాను విధులకు రాకున్నా వచ్చినట్లుగా మార్పులు చేస్తూ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నాడు. తనే కాదు.. ఇతర ఉద్యోగులకు కూడా వారి హాజరుశాతాన్ని పెంచుతూ జేబులు నింపుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఉస్మానియా ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ విధానంలో నాలుగు ఏజెన్సీల ద్వారా మొత్తం 210మంది వరకు డీఓలు, ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సులు, డ్రైవర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరి అటెండెన్స్ మొత్తం సూపరింటెండెంట్ చాంబర్‌లో పనిచేసే ఓ ఉద్యోగి పర్యవేక్షిస్తుంటాడు. బయోమెట్రిక్ విధానంలో అటెండెన్స్ సేకరించి పంపించడం ఇతని బాధ్యత. బయోమెట్రిక్ విధానంలో మార్పులు, చేర్పులు చేసే అవకాశం సదరు ఉద్యోగికి ఉండడంతో తన అవసరాల మేరకు మార్పులు చేస్తూ జేబులు నింపుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.



బయోమెట్రిక్ అటెండెన్స్‌లో ఫోర్జరీ జరిగిందని రాసిన ఫిర్యాదు లేఖ

విధులకు రాకపోయినా..

సదరు ఉద్యోగి తాను విధులకు హాజరు కాకపోయినా బయోమెట్రిక్, హాజరు రిజిస్టర్‌లో హాజరైనట్లు మార్పులు చేసి జీతం పొందుతున్నాడు. ఈ ఏడాది జనవరి 14 నుంచి 22వరకు కుంభమేళాకు, ఫిబ్రవరి 15 నుంచి 22 వరకు మరో కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఆ సమయంలో ఆస్పత్రి విధులకు సదరు ఉద్యోగి దుమ్మా కొట్టాడు. ఆ తర్వాత రోజుల్లో ఆస్పత్రికి రాగానే అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయడంతో పాటు బయోమెట్రిక్‌లో హాజరు అయినట్లు మార్పులు చేసి చూపించాడు. ఇలా.. తనకే కాకుండా మరి కొంతమంది

మిగతా 6వ పేజీలో..

విచారణ జరుపుతున్నాం

బయోమెట్రిక్ అటెండెన్స్‌లో మార్పులు, చేర్పులు చేసినట్లు ఫిర్యాదుతో పాటు అటెండెన్స్ రిజిస్టర్ కాపీలు వచ్చిన విషయం వాస్తవమే. కానీ, సదరు పత్రాల్లో ఫిర్యాదుదారుల పేర్లు రాయలేదు. అయినప్పటికీ వాటిపై విచారణ జరిపిస్తున్నాం. బయోమెట్రిక్‌లో తప్పులు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

\- సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్

కుమ్మేసింది..

శివారు ప్రాంతాల్లో కుండపోత వర్షం

- రాంచంద్రాపురంలో 7.7 సెం.మీ
- ప్రధాన రహదారులను ముంచేసిన వరద
- నడుంలోతు నీటిలో లింగంపల్లి అండర్ బ్రిడ్జి
- గచ్చిబౌలి, మాదాపూర్‌లో భారీగా ట్రాఫిక్‌జాం
- గండిమైసమ్మ ప్రధాన రహదారిపై భారీగా వరద
- సగం వరకు నీటమునిగిన వాహనాలు



కృష్ణానగర్‌లో రోడ్డుపై పారుతున్న వరద

గ్రేటర్‌కు ఎల్లో హెచ్చరికలు: హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో బుధవారం ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణ శాఖ తెలిపింది. గ్రేటర్‌పరిధిలోని మూడు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ శివారు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులను వరదనీరు ముంచెత్తింది. పటాన్‌చెరు, రాంచంద్రాపురం, చందానగర్, గచ్చిబౌలి, లింగంపల్లి, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో కురిసిన భారీవర్షంతో ప్రధాన రహదారులపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచిపోయింది. రాంచంద్రాపురంలో అత్యధికంగా 7.7సెం.మీ, చందానగర్‌లో 5.0, గచ్చిబౌలిలో 4.8 సెం.మీ వర్షం కురిసింది. చందానగర్, గాజులరామారం, జీడిమెట్ల, కూకట్‌పల్లి, యూసుఫ్‌గూడ కృష్ణానగర్, వినయాపూర్, శ్రీనగర్‌కాలనీ, అల్లాపూర్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. లింగంపల్లి అండర్ బ్రిడ్జిని వరదనీరు ముంచేయడంతో గంటల కొద్దీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నడుము లోతు వరదనీరు నిలిచిపోవడంతో బ్రిడ్జి దాటేందుకు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరదలో ద్విచక్ర వాహనాలు సగానికి పైగా మునిగిపోవడంతో అతికష్టం మీద వాటిని బయటకు తీసుకువచ్చారు. గండిమైసమ్మ సిగ్నల్స్ ప్రధాన రహదారిని వరదనీరు ముంచెత్తడంతో కార్లు, బైకులు సగానికి పైగా నీటమునిగాయి. వరద ఉధృతికి వాహనాలు రోడ్లపై ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ద్విచక్రవాహనదారులు అవస్థలు పడ్డారు.

వర్షపాతం వివరాలు (సెం.మీ)

ప్రాంతం	వర్షపాతం
రాంచంద్రాపురం	7.7
పటాన్‌చెరు	5.3
చందానగర్	5.0
గచ్చిబౌలి	4.8
లింగంపల్లి	4.4
హాఫీజ్‌పేట	3.4
జూబ్లీహిల్స్	3.3
గాజులరామారం	3.2
జీడిమెట్ల	2.9
కుత్బుల్లాపూర్	2.9
కూకట్‌పల్లి	2.6

ఐటీ కారిడార్‌లో భారీగా ట్రాఫిక్ జాం

భారీ వర్షంతో ఐటీ కారిడార్‌తో పాటు జేఎన్‌టీయూ, బంజారాహిల్స్, అమీర్‌పేట, పంజాగుట్ట ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జాం సమస్యలు తలెత్తాయి. సమయం గడుస్తున్నా కొద్దీ వరద ఉధృతి పెరగడంతో గచ్చిబౌలి, చందానగర్, లింగంపల్లి ప్రాంతాల్లో వాహనాలు ముందుకు కదల్లేదు. భారీవర్షంతో ఆర్సీపురం, పటాన్‌చెరు, చందాగర్, లింగంపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తాయి.

వాటర్‌లాగింగ్ పాయింట్లపై ఉమ్మడి కార్యాచరణ 6

చెత్త తీసుకెళ్లడం లేదా..
ఫిర్యాదు చేయొచ్చు

- ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుకు జీహెచ్ఎంసీ కసరత్తు
- కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలా..? యాప్ రూపొందించాలా.. అన్నదానిపై చర్చ
- ఐటీ విభాగానికి బాధ్యతలు



హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): మీ ఇంటి నుంచి చెత్త తీసుకెళ్లడం లేదా.. స్వచ్ఛ ట్రాలీ కార్మికులు రోజూ రావడం లేదా.. ఇక మీరు నేరుగా జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేయొచ్చు. పౌరులను భాగస్వాములను చేయడం ద్వారా చెత్త సేకరణ మెరుగుపర్చాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో సక్రమంగా పనిచేయని కార్మికులపైనా చర్యలు తీసుకోనున్నారు. మంగళవారం సమావేశమైన ఉన్నతాధికారులు ఈ విషయంపై చర్చించారు. కేటాయించిన ప్రాంతాల్లో కార్మికులు చెత్త సేకరిస్తున్నారా, లేదా.. ఎన్ని రోజులకు ఒకసారి వెళ్తున్నారు.. నిత్యం ఎన్ని ఇళ్ల నుంచి చెత్త తీసుకెళ్తున్నారు..? అన్నది తెల్సుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి

మిగతా 6వ పేజీలో..

బడికి బాట చూపిన
హైడ్రా



రోడ్డుపై ప్రహరీ తొలగింపు

- ఫలించిన ప్రధానోపాధ్యాయుడి పోరాటం
- జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం తీరుపై విమర్శలు

సికింద్రాబాద్/బౌద్ధనగర్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుడి నిరసనతో ప్రభుత్వ విభాగాలు స్పందించాయి. చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలకు దారి చూపాయి. కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ ఉందంటూ ఇన్నాళ్లూ ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించిన సికింద్రాబాద్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు గత్యంతరం లేని పరిస్థితిలో కూల్చివేతలో భాగస్వాములయ్యారు. పాఠశాలకు వెళ్లే మార్గంలో రోడ్డుకు అడ్డుగా గోడ నిర్మించారని, కూల్చివేయాలని పలు మార్లు ప్రజావాణి, ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు విద్యార్థుల తల్లిదండ్రులు, పలు సంఘాలు మద్దతు తెలిపాయి. పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో కథనాలు రావడంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. మంగళవారం హైడ్రా అధికారులు పాఠశాలకు చేరి స్కూల్ వెళ్లే దారిలో నిర్మించిన ప్రహరీని కూల్చివేశారు. దీంతో మల్లికార్జున్‌రెడ్డితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడి పోరాటాన్ని అభినందించారు. ఇంజక్షన్ ఆర్డర్ పేరిట ఇన్నాళ్లు కాలయాపన చేస్తూ వచ్చిన పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు.. హైడ్రా రంగంలోకి దిగడంతో వారికి సహకరించడం గమనార్హం.



పాఠశాలకు అడ్డుగా ఉన్న ప్రహరీని కూల్చి వేస్తున్న హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది

ఎన్టీఆర్ జీవితం నేటి తరానికి మార్గదర్శకం


వంశీ రామరాజును సత్కరిస్తున్న రేలంగి నరసింహారావు

చిక్కడపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జీవితం నేటి తరానికి మార్గదర్శకం అని ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. రామారావు 102వ జయంతి సందర్భంగా శోభా ఇంటర్నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజుకు ఎన్టీఆర్ కళా సేవా పురస్కారం, లలిత కళోద్ధారక బిరుదు మంగళవారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో సినీ జర్నలిస్ట్ ఎస్వీ రామారావు, డా. తెన్నేటి సుధ, కళాపోషకులు మధు జగన్నాథ్, సంస్థ స్థాపకులు శోభ తదితరులు పాల్గొన్నారు.


లీజు స్థలంలో నిర్మాణ సామగ్రి, షెడ్లు

జైళ్లశాఖ స్థలం అక్రమ లీజుపై హోం శాఖ ఆరా

(5వ పేజీ తరువాయి)

జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా హోం శాఖను కోరినట్లు తెలిసింది. విచారణ చేపడితే ఇందులో ఎవరెవరి పాత్ర ఎంత ఉందన్న విషయం తెలియనుంది. అక్రమ లీజు వ్యవహారాన్ని వెలుగులోకి తేవడంతో 'ఆంధ్రజ్యోతి'పై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. తమ శాఖ పేరుతో నెలకు లక్ష రూపాయలు వసూలు చేస్తున్నట్టు తమకే తెలియదని, 'ఆంధ్రజ్యోతి' కథనంతో వాస్తవాలు తెలిశాయని జైళ్లశాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు చెబుతుండటం గమనార్హం.

శాంతిని కాపాడటం సమష్టి బాధ్యత

- బక్రీద్ పండగ సమన్వయ సమావేశంలో సీపీ సీవీ ఆనంద్


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరంలో 'గంగా-జమునా తెహజీబ్'ని నిలబెట్టడం, శాంతిని కాపాడటం సమష్టి బాధ్యత అని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. బక్రీద్ పండగను పురస్కరించుకొని సాలార్ జంగ్ మ్యూజియం ఆడిటోరియంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మతపెద్దలతో సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జంతువుల అక్రమ రవాణాను అరికట్టడానికి నగర కమిషనరేట్ చుట్టూ తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. బక్రీద్ పండగ సందర్భంగా వివిధ శాఖల వారీగా పలు నిర్ణయాలు చేశారు.

నగరంలో అన్ని తనిఖీ కేంద్రాలలో 24/7 పశువైద్యులు అందుబాటులో ఉండాలని, వీధి కుక్కలను పట్టుకోవడంతో పాటు పండగ రోజు ఇంటింటికీ కవర్లతో పాటు కళేబరాల సేకరణకు ప్రత్యేక బృందాలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చేయాలని నిర్ణయించారు. జంతు వ్యర్థాలను కేవలం నిర్దిష్ట ప్రాంతాల్లోనే పారేయాలని, వీధులను శుభ్రంగా ఉంచాలని కోరారు. పోలీసులు, ఇతర శాఖల అధికారులతో సహకరించాలని మత పెద్దలను కోరారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, విద్యుత్, ఆర్టీఏ, పశుసంవర్థక, తదితర శాఖల అధికారులు, మత పెద్దలు పాల్గొన్నారు.

నిమ్స్‌మే స్థలాలను పరిశీలించిన కేంద్రమంత్రి

బోరబండ, మే 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నిమ్స్‌మేకు చెందిన స్థలాలను కేంద్రమంత్రి జితిన్‌రామ్ మాంజీ సంస్థ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ స్థలాన్ని సంస్థ భవిష్యత్ అవసరాల కోసం వినియోగించాలని సూచించారు. యూసుఫ్‌గూడ ప్రాంతంలో 1960లో చిన్నపరిశ్రమల విభాగానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 100 ఎకరాల స్థలంలో కాలక్రమేణా 40ఎకరాలకు పైగా స్థలం ఆక్రమణలకు గురైంది. కార్యక్రమంలో కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ సంయుక్త కార్యదర్శి మెర్సీ ఎపావో, నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ డా.అశుతోష్ ఎ.మురుర్కటే, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసవర్మ, సిబ్బంది పాల్గొన్నారు.


నిమ్స్‌మే స్థలాలను పరిశీలించిన కేంద్ర మంత్రి జితిన్‌రామ్ మాంజీ

ఎంఎస్ఎంఈ సెక్టార్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

బేగంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ సెక్టార్‌లోని ట్రేడర్లు, టెక్స్‌టైల్ ఇండస్ట్రీల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర మంత్రి జితిన్‌రామ్ మాంజీ అన్నారు. మంగళవారం టూరిజం ప్లాజాలో తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈల తరహాలో ట్రేడర్లకు కూడా సబ్సిడీ బ్యాంక్ రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కేంద్ర మంత్రిని ఛాంబర్ అధ్యక్షుడు ప్రకాశ్, ప్రతినిధి సతీష్ కోరారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై

జూన్ 2 లోపు స్పష్టమైన ప్రకటన చేయాలి

బర్కత్‌పుర, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై జూన్ 2వ తేదీ లోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ. 10 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని, సాంస్కృతిక విభాగంలో ఉద్యోగాలు కేటాయించాలని, ఒక్కో ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు సురేందర్‌రెడ్డి, దయానంద్, కొండస్వామి, గగన్‌కుమార్, వీరస్వామి, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎంకు రాసిన లేఖను విడుదల చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ తదితరులు

పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్‌లు

తెలివి తక్కువ జోకర్లు

- కువైట్‌లో మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలు
- భారత్‌పై విజయం సాధించామని తప్పుడు ప్రచారాలు

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ తెలివి తక్కువ జోకర్లని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎద్దేవా చేశారు. అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ కుటిల నీతి, కుట్రలను ఎండగట్టేందుకు భారత ఎంపీ ప్రతినిధుల బృందాలు విదేశాల్లో పర్యటిస్తున్నాయి. ప్రస్తుతం కువైట్‌లో పర్యటిస్తున్న బృందంలో ఒవైసీ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా కువైట్‌లోని భారతీయ సంతతి పౌరులనుద్దేశించి ఒవైసీ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిగా తాము 'ఆపరేషన్ బున్యాన్-ఉన్-మర్సూస్' నిర్వహించి విజయం సాధించామని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ తప్పుడు ప్రచారంతో మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేయడం వారి తెలివి తక్కువ తనానికి నిదర్శనమని అన్నారు. ఈ జోకర్లు భారత్‌తో పోటీ పడాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 2019 నాటి చైనా ఆర్మీ డ్రిల్ ఫొటోను చూపుతూ భారత్‌పై విజయమని చెప్పుకుంటున్నారని ఒవైసీ విమర్శించారు.

ఆదిలోనే హంసపాదు

(5వ పేజీ తరువాయి)


మారేడుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..

ఫైళ్లు ముందుకు కదలడం లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల బయట తిష్ఠవేస్తున్న మధ్యవర్తులకు అడిగినంత చెల్లిస్తే తప్ప పనులు కావడం లేదని పలువురు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకువచ్చారు. స్లాట్ బుకింగ్ విధానంపై అవగాహన లేకపోవడంతో చాలా మంది మధ్యవర్తులను, డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయిస్తున్నారు. అయితే, వీరు సబ్ రిజిస్ట్రార్లతో కుమ్మక్కై డాక్యుమెంట్ విలువ ఆధారంగా ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

భవిష్యత్తులో మంచి ఫలితాలు

ప్రభుత్వం భవిష్యత్తును ఆలోచించి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన స్లాట్ విధానంతో ప్రస్తుతం కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నా.. భవిష్యత్తులో మంచి ఫలితాలు వస్తాయన్న నమ్మకం ఉంది. గతంలో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చి గంటల తరబడి వేచి ఉండేవాళ్లం. ప్రస్తుతం స్లాట్ బుకింగ్ వల్ల పనులు వెంటనే పూర్తవుతున్నాయి.

\- కృష్ణ, పంజాగుట్ట, వినియోగదారుడు

8 నిమిషాల్లో రిజిస్ట్రేషన్

స్లాట్ బుకింగ్‌తో 8 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది గతంలో ఒక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ పూర్తికావడానికి 40 నిమిషాలు పట్టేది. ప్రస్తుత స్లాట్ విధానంలో కేవలం 8 నిమిషాల్లో ఒక రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. రోజూ 15 నుంచి 20 వరకు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. ఇక్కడ 53 వరకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం ఉంది.

\- సతీష్, సబ్ రిజిస్ట్రార్, పాటిగడ్డ వల్లభనగర్

చెత్త తీసుకెళ్లడం లేదా.. ఫిర్యాదు చేయొచ్చు

(5వ పేజీ తరువాయి)

తీసుకురావాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఇందుకోసం కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలా..? ప్రత్యేకంగా మొబైల్ యాప్ రూపొందించాలా..? ఇప్పటికే ఉన్న యాప్‌లో ఆప్షన్ అందుబాటులోకి తీసుకురావాలా..? అన్నది పరిశీలించాలని ఐటీ విభాగం అధికారులకు సూచించారు. ఫిర్యాదు చేసేందుకు రూపొందించనున్న వ్యవస్థ వివరాలపై అందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలనుకుంటున్నారు.

గాడి తప్పిన సేకరణ..

గ్రేటర్‌లో 4,500 స్వచ్ఛ ట్రాలీలున్నాయి. ఒక్కో కార్మికుడికి 400 నుంచి 600 వరకు ఇళ్లు కేటాయించారు. కొన్నిచోట్ల రోజు విడిచి రోజు, ఇంకొన్ని ఏరియాల్లో వారానికి ఒకటి, రెండు సార్లు మాత్రమే కార్మికులు చెత్త తీసుకెళ్తున్నారు. డబ్బులు ఎక్కువ ఇస్తారన్న ఆశతో హోటళ్లు, కూరగాయల దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాల నుంచి చెత్త సేకరణకు ప్రాధాన్యమిస్తూ.. వీలు కుదిరినప్పుడు ఇళ్లకు వెళ్తున్నారు. దీంతో రోడ్లపై చెత్త కుప్పలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చెత్త సేకరణ ప్రక్రియపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని భావిస్తున్నారు. ట్రాలీ కార్మికుడు చెత్త సేకరణకు రాకపోతే ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసే వ్యవస్థను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్టు పారిశుధ్య నిర్వహణ విభాగం వర్గాలు చెబుతున్నాయి.

'బయోమెట్రిక్' ఫోర్జరీ..

(5వ పేజీ తరువాయి)

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గైర్హాజరును కూడా హాజరు అయినట్లు మార్పులు, చేర్పులు చేస్తూ డబ్బు తీసుకున్నట్లు సమాచారం. సదరు ఉద్యోగి సెలవు రోజుల్లో కూడా పూర్తి జీతాలను పొందినట్లు తెలుసుకున్న తోటి ఉద్యోగులు అందుకు సంబంధించిన వివరాలను వివరిస్తూ ఓ ఫిర్యాదును ఆస్పత్రి సూపరింటెండెంట్, డీఎంఈలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించారు. అయితే, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులే ఫిర్యాదు పత్రాలు డీఎంఈకి చేరకుండా సెక్షన్ కార్యాలయంలో ఉంచినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. బయోమెట్రిక్‌లో మార్పులు చేస్తున్న ఉద్యోగికి మద్దతుగా ఉంటున్న ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఈనెల 30న బ్రహ్మాండమైన విడుదల




దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
సంతోష్ 70 ఎ/సి - ఆర్.సి.పురం | మల్లికార్జున 70 - కూకట్‌పల్లి
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ | శివశక్తి 70ఎంఎం - కాప్రా | శ్రీసాయిరాం 70 - మల్కాజ్‌గిరి
యాదగిరి - సంతోష్‌నగర్ | గోకుల్ 70 ఎ/సి - ఎర్రగడ్డ

SUPER HIT నేడే చూడండి



సంధ్య 35 - ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్ 2.15,6.15,9.00 Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 7.45pm
PVR ఐనాక్స్ - హైటెక్‌సిటీ 1.50pm

ఈనెల 30న బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
తారకరామ 70 ఎ/సి - కాచిగూడ
GLOBAL CINEMAS RELEASE

BLOCK BUSTER HIT నేడే చూడండి



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00 ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

SUPER HIT నేడే చూడండి





సప్తగిరి 70 ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
లక్ష్మీకళ సినీప్లెక్స్ 70 ఎ/సి - మూసాపేట్
మరియు మీ అభిమాన థియేటర్లలో

అన్ని రంగాల్లో భారత్ పురోగతి

● కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్



రాయదుర్గం, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం కొనసాగుతుంటే భారత్ అన్ని రంగాల్లో స్థిరమైన పురోగతి సాధిస్తుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ, జాతీయ గణాంకాల కార్యాలయం, ఐఎస్ బీ, ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో 2023-24 వార్షిక సర్వే డేటా ఫలితాలపై మంగళవారం ఐఎస్‌బీలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంత నాగేశ్వరన్ హాజరై కీలక ఉపన్యాసం చేశారు. తయారీ రంగంలో పటిష్టమైన మూల ధన వ్యయంతో సంస్థలు పురోగతి సాధిస్తున్నా యన్నారు. ఇన్‌కార్పొరేటెడ్, వ్యవసాయేతర రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధిస్తున్నామని, ఈ సర్వే గణాంకాల డేటా వెల్లడిస్తోందన్నారు. గణాంక కార్యక్రమాల కార్యదర్శి డాక్టర్ సౌరబ్‌గార్గ్ మాట్లాడుతూ, ప్రభుత్వం పటిష్టమైన పురోగతికి అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన గణాంకాల డేటా భవిషత్తులో ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ డేటాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి

భర్తను హత్య చేసిన భార్య

● నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



సభావత్ కిషన్ నాయక్ (ఫైల్)

వనస్థలిపురం, మే 27(ఆంధ్రజ్యోతి): భర్తను గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి హత్య చేసిందో మహిళ. అనంతరం ప్రమాదవశాత్తూ చనిపోయాడని పోలీసులతో సహా అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం భావత్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ సభావత్ కిషన్ నాయక్(40)కు కళతో 2005లో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. మొదటి భార్య మృతి చెందడంతో పిల్లలు ముగ్గురూ అమ్మమ్మ వద్ద ఉంటున్నారు. కిషన్ నాయక్ నగరానికి వచ్చి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇలా ఉండగా, యాదాద్రి - భువనగిరి జిల్లా గోకారం గ్రామానికి చెందిన శిరీషకు భర్తతో మనస్పర్థలు రావడంతో 2015లో విడాకులు తీసుకుంది. ఈమెకు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న కిషన్ నాయక్‌తో పరిచయం ఏర్పడటంతో 2015లో రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అమ్మమ్మ దగ్గర ఉంటున్నారు. భార్యాభర్తలు కిషన్ నాయక్ గ్రామంలో వ్యవసాయం చేసుకొనేవారు. ఈ క్రమంలో శిరీషకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కిషన్ నాయక్ భార్యను మందలించడంతో గొడవలు జరిగేవి. ఈ క్రమంలో రెండు నెలల క్రితం వనస్థపురంలోని హిల్‌కాలనీకి మకాం మార్చారు. కిషన్ నాయక్ సోమవారం సాయంత్రం మద్యం తాగి తన భార్య పనిచేసే చోటికి వెళ్లి ఆమెతో గొడవపడి ఇంటికి తీసుకొచ్చాడు. మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తనపై అనుమానం వ్యక్తం చేయడమే కాకుండా ఆఫీసుకొచ్చి గొడవపడాడ్డని కోపోద్రిక్తురాలైన శిరీష భర్త కిషన్ నాయక్‌ను గట్టిగా గోడకేసి కొట్టింది. తర్వాత గొంతు నులిమి హత్య చేసింది. అనంతరం అంబులెన్స్‌లో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లింది. కిషన్ నాయక్‌కు పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఇలా ఉండగా, కిషన్ నాయక్ మొదటి భార్య కూతురు బిందు తన తండ్రిని శిరీష చున్నీతో హత్య చేసిందని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు శిరీషపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

శివరాంపల్లి రేల్వే స్టేషన్ వద్ద దారి వదలండి



అడిషనల్ డివిజనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాజేంద్రనగర్, మే 27(ఆంధ్రజ్యోతి): శివరాంపల్లి రైల్వే గేట్ (ఎల్‌సీ-8) దగ్గర ప్రజలు రాకపోకలు చేసేలా రహదారిని వదలాలని బీఆర్ఎస్ మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు మంగళవారం రైల్వే శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఎస్.వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు అక్కెం రాఘవేందర్ యాదవ్, నోముల రాము యాదవ్, ఎడ్లకాడి సూర్యం, బండ రాజేశ్ యాదవ్, ఎస్ అశోక్ దక్షిణమధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కో ఆర్డినేషన్) పీటీవీ దుర్గా ప్రసాద్, అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎంఏ రహమాన్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. 2022 వరకు శివరాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి బాబుల్‌రెడ్డినగర్ పరిసర బస్తీల ప్రజలు మోహన్‌రెడ్డినగర్ మీదుగా శివరాంపల్లి ప్రాంతానికి వెళ్లడానికి రోడ్డు ఉండేదన్నారు. 2022లో శివరాంపల్లి రైల్వే స్టేషన్‌ను పెద్దదిగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పి రోడ్డును మూసివేశారన్నారు. దీంతో బాబుల్‌రెడ్డినగర్, సాయిబాబానగర్, బృందావన్ కాలనీ, వెంకటేశ్వర కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శివరాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రోడ్డు వదలాలని, లేదా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. దానికి అధికారులు సానుకూలంగా స్పందించినట్లు వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డం పొలిటికల్ అకాడమి ఆవిర్భావం

బర్కత్‌పుర, మే 27(ఆంధ్రజ్యోతి): ఓబీసీలను రాజకీయంగా అభివృద్ధి చేయడానికి గడ్డం పొలిటికల్ అకాడమి ఏర్పాటు చేసినట్టు ఆ అకాడమి చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఓబీసీలు పోటీ చేసి విజయం సాధించేలా ఈశిక్షణా తరగతులు దోహద పడతాయన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని హైందవీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పొలిటికల్ అకాడమిని ప్రారంభించి ఆయన మాట్లాడారు. వివిధ రంగాల్లోని నిష్ణాతులతో ఈ రాజకీయ శిక్షణా తరగతులు ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఓబీసీలు ఈశిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఇతర వివరాలకు 8096112432 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అడ్వయిజరీ కమిటీ సభ్యులు మేకల రాముయాదవ్, భేరీ రాంచందర్‌యాదవ్, సాయన్న ముదిరాజ్, కుమార్‌యాదవ్, మహేష్‌గౌడ్, అందెల సత్యనారాయణయాదవ్, గొరిగే శ్రీనివాస్ యాదవ్, వీరేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

కులగణనపై షెడ్యూల్ విడుదల చేయాలి

బర్కత్‌పుర, మే 27(ఆంధ్రజ్యోతి): కులగణనపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే షెడ్యూల్‌ను విడుదల చేయాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. కులగణన ప్రధాన ఎజెండాగా అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని పేర్కొన్నారు. మంగళవారం జాతీయ బీసీదళ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కులగణన చేపడుతున్నట్టు ప్రకటించినప్పటికీ ఇప్పటి వర కు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బీసీల అభివృద్ధికి ఈ కులగణన కీలకం కానున్నదన్నారు. పలు బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

పారదర్శకంగా కురుమ సంఘం ఎన్నికలు

అఫ్జల్‌గంజ్, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కురుమ సంఘం ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల కమిటీని ఏర్పాటు చేశామని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం ముస్లిం పూల్ వంతెన వద్ద ఉన్న రాష్ట్ర కురుమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లేశం మాట్లాడారు. ఎన్నికల కమిటీ చైర్మన్‌గా న్యాయవాది ఎ.శ్రీనివాస్ కురుమ, సభ్యులుగా గొరిగే కృష్ణ కురుమ, న్యాయవాది కె.సదానందం, డి.ప్రవీణ్‌కుమార్, డి.ప్రకాశ్‌కుమార్‌ను నియమించినట్టు ఆయన తెలిపారు. నూతనంగా ఏర్పాటైన ఎన్నికల కమిటీలు గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో పర్యటించి కురుమ సంఘం ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నారాయణ, ఉపాధ్యక్షులు కె.రాజు, శ్రీకాంత్, కోశాధికారి మల్లేశం, సెక్రెటరీ నరసింహ, కన్నా పాల్గొన్నారు.

‘సమస్యలు పరిష్కరించండి’

రాజేంద్రనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్ప కాలనీలో మంగళవారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అధికారులతో కలిసి పర్యటించారు. రాజీవ్ గృహకల్ప కాలనీలో ప్రజ లు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్, ఈఈ నరేందర్‌గౌడ్, జలమండలి జనరల్ మేనేజర్ సాయిలక్ష్మి, డిప్యూటీ జనరల్ మేనేజర్ రేణుకను కోరారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈసందర్భంగా స్థానికులు తమ బస్తీకి పారిశుధ్య సిబ్బంది రారని, డ్రైనేజీ పైపులైన్లు పొంగుతున్నా జలమండలి అధికారులు పట్టించుకోరని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని వాపోయా రు. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.దనుంజయ, టి.ప్రేంగౌడ్, అడికె అర్జున్, శరణమ్మ, ఎస్.వెంకటేశ్, పుష్ప, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ భవనాన్ని పరిశీలించిన జీహెచ్‌ఎంసీ అధికారులు

రాజేంద్రనగర్, మే 27(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ న్యూ గ్రీన్ సిటీ కాలనీలో పార్కు స్థలంలో నిర్మాణాలు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం గ్రేటర్ దక్షిణ మండలం విజిలెన్స్ విభాగం అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించారు. విజిలెన్స్ విభాగం అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, ఎస్ఐ మోహన్‌తో పాటు రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీధర్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈసందర్భంగా భవన నిర్మాణం చేస్తున్న వి.ప్రశాంత్, నీరజ తాము 2013లో పి.వాణి నుంచి 642 గజాల స్థలాన్ని కొనుగోలు చేశామని అధికారులకు దస్తావేజులు చూపించారు. ఆ స్థలానికి 2018లో ఎల్‌ఆర్ఎస్ కట్టామని, 2024లో స్టిల్ ప్లస్ ఐదు ఫ్లోర్‌లకు జీహెచ్‌ఎంసీ పర్మిషన్ తీసుకుని భవనం నిర్మిస్తున్నామని అనుమతి పత్రాలను చూపించారు. మాగని శివ అనే వ్యక్తి తమను డబ్బులు డిమాండ్ చేయగా ఇవ్వని కారణంగా తమపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని వాపోయారు.

● బుద్వేల్ న్యూ గ్రీన్ సిటీ కాలనీలో పి.ప్రశాంత్, నీరజ నిర్మిస్తున్న భవనానికి అన్ని అనుమతులున్నాయని, అక్రమ నిర్మాణం కాదని రాజేంద్రనగర్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీదర్ తెలిపారు. అది హుడా లే అవుట్ కాదన్నారు. అందుకే ఎల్‌ఆర్ఎస్ కట్టారని గుర్తు చేశారు.

నెహ్రూకు నివాళి

మదీన/అఫ్జల్‌గంజ్, మే 27(ఆంధ్రజ్యోతి): పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని జూపార్కు వద్ద ఉన్న నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్‌షా ముజాహిద్ హుసేనీ, జి.కన్నయ్యలాల్, సయ్యద్ ఇక్బాల్, జబ్బార్, మీర్ మహమ్మద్ అలీషాన్, నజీర్‌ఖాన్, నసీర్, బారీ ఖాన్, జ్యోతిశెట్టి, శ్రీకాంత్, రామకృష్ణ, గణేష్, గులాం నబీ, మఖ్బూల్, అష్ఫాక్ పాల్గొన్నారు.

● గాంధీభవన్‌లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి టీపీసీసీ సెక్రెటరీ మసీలాల్‌షా, నాయకులు భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, బాబురావు, మహ్మద్ యూనుస్, శ్రీకాంత్, రవీందర్ తదితరులు నివాళులర్పించారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/m8uTnIDలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

జర్నలిస్టుల పోరాటం చరిత్రాత్మకం

గన్‌పార్క్, మే 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పోరాట పటిమ చరిత్రాత్మకమని, వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని జలవిహార్‌లో ఈనెల 31న నిర్వహించ తలపెట్టిన టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్‌ను మంగళవారం గన్‌పార్క్‌లో ఆయన సీనియర్ పాత్రికేయులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జర్నలిస్టులు కీలక భూమికను పోషించారని, ఉద్యోగాలను త్యాగం చేసి రాష్ట్ర సాధనలో భాగస్వాములయ్యారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఆరోగ్యకార్డులు, సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. 31న జరిగే టీజేఎఫ్ రజతోత్సవ సభకు పాత్రికేయులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు సోమేశ్వర్, టీజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, కోశాధికారి యోగానంద్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్, నేతలు నవీన్, రమణ, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, రవికుమార్, భూపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

‘అసత్య ఆరోపణలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి’

అఫ్జల్‌గంజ్, మే 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీలో మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్, ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ సోషల్ మీడియా అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకుంటోందని, త్వరలో వారికి తగిన బుద్ధి చెబుతామని బీఆర్ఎస్ బేగంబజార్ జనరల్ సెక్రెటరీ ప్రదీప్‌రాజ్, గోషామహల్ నియోజకవర్గం బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి శైలేష్ కురుమ హెచ్చరించారు. మంగళవారం వారు సీసీఎస్‌లోని సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో జరుగబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా ఏంటో చూపిస్తుందని వారు అన్నారు.

31న వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ధర్నా

మదీన, మే 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పిలుపునిచ్చారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఏపీ, తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 31న మధ్యాహ్నం 3నుంచి 5 గంటల వరకు ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఈ ధర్నా ఉంటుందన్నారు. వక్ఫ్ సవరణ చట్టం రద్దు అయ్యేంతవరకు జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసనలు కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

జగదాంబిక అమ్మవారి ఆలయంలో పూజలు

కార్వాన్, మే 27 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మ బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం జగదాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గోల్కొండ ఆలయ చైర్మన్ కె.చంటిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా చంటిబాబు మాట్లాడుతూ.. అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ గోల్కొండ బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గోల్కొండ బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389 కె. అనిల్ కుమార్: 99854 03628

హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో వాటర్ లాగింగ్ పాయింట్స్ 170

జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక ఫోకస్

వర్షాకాలంలో నగరం అతలాకుతలం

చెరువులను తలపిస్తున్న రోడ్లు

ఉమ్మడి కార్యాచరణ

జోన్ వారీగా

జోన్	వాటర్ లాగింగ్ పాయింట్స్	పనులు పూర్తి	అండర్ ప్రాసెస్	పెండింగ్
ఖైరతాబాద్	34	18	11	5
సికింద్రాబాద్	18	08	3	07
చార్మినార్	19	07	05	07
శేరిలింగంపల్లి	40	23	02	15
కూకట్‌పల్లి	26	16	02	08
దుండిగల్ మున్సిపాలిటీ	05	00	02	03
నిజాంపేట మున్సిపాలిటీ	05	04	05	00
ఆర్ అండ్ బి	05	05	00	00
హెచ్ఎండీఏ	04	01	03	00
మొయినాబాద్	04	02	02	00
టీజీహెచ్‌సీ	03	02	01	00
ఎన్‌హెచ్ఏఐ	02	02	00	00
మొత్తం	165	87	31	51

వచ్చే వర్షాకాలం నేపథ్యంలో జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు ఉమ్మడి కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. వాటర్ లాగింగ్స్ పాయింట్స్ ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నగరం అతలాకుతలమవుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో రోడ్లపై వరదతో రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. వర్షపు నీరు వెళ్లిపోయేందుకు అనుగుణంగా మ్యాన్‌హోల్స్ పనిచేయకపోవడంతో రోడ్లమీద చేరిన నీటి ప్రవాహం చెరువులను తలపించింది.



జగద్గిరిగుట్టలో..

హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, అల్కాపురికాలనీ, కోఠి, మోజాంజాహి మార్కెట్, లక్డీకపూల్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎర్రగడ్డ, బేగంపేట్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, హైటెక్‌సిటీ, జేఎన్‌టీయూ, గచ్చిబౌలి, రాయదుర్గం మాదాపూర్, కొండాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో హైటెక్స్ ప్రాంతంలో వర్షం వల్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు ముందుకు కదిలే పరిస్థితి లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వ సేవలపై దృష్టి

హైదరాబాద్ సిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మంగళవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లోని వార్ రూమ్‌లో ప్రధాన ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధిలో గుర్తించిన 141 నీరు నిలిచే ప్రదేశాలలో వరద పర్యవేక్షణ, ట్రాఫిక్ నిర్వహణపై చర్చ జరిగింది. శిథిలావస్థకు చేరిన నిర్మాణాలను గుర్తించడం, అవసరమైన చర్యలు తీసుకోవడం, అత్యవసర సహాయం కోసం ఆపద మిత్ర వలంటీర్లు, ఎన్‌జీఓలను మోహరించడం.ప్రజల భద్రతను నిర్ధారించడానికి సాచెట్ మొబైల్ అప్లికేషన్, ఇతర ప్రభుత్వ సేవల వాడకాన్ని ప్రోత్సహించడంపై దృష్టి సారించాలని అధికారులు నిర్ణయించారు.

170 ప్రాంతాల గుర్తింపు..

వర్షాకాలం ప్రారంభం నేపథ్యంలో అధికారులు దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు రంగంలోకి దిగారు. హైదరాబాద్ సిటీ, సైబరాబాద్ కమిషనరేట్స్ పరిధిలో మొత్తం 170 వాటర్ లాగింగ్స్ పాయింట్స్ ఉన్నట్లు గుర్తించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న అధికారులు వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టిన అధికారులు మరి కొన్ని పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా 87ప్రాంతాల్లో పనులు పూర్తి చేసిన అధికారులు 31 ప్రాంతాల్లో పనులు కొనసాగిస్తున్నారు. కాగా.. 51 ప్రాంతాల్లో ఇంకా ఎలాంటి పనులు ప్రారంభించలేదు. కాగా, మణికొండ, బండ్లగూడ, నార్సింగి, శంషాబాద్ మున్సిపాలిటీ, తెల్లాపూర్ పరిధిలో ఒక్కొక్కటి మాత్రమే వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు వెల్లడించారు.

यूनियन बैंक ऑफ़ इंडिया యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)

అసెట్ రికవరీ బ్రాంచ్
#249/3RT, 1వ అంతస్తు, SR నగర్, మెయిన్ రోడ్, హైదరాబాద్-500038.

ఇ-వేలం అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8 క్రింద నిబంధనలు చూడగలరు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ చార్జ్‌చేయబడినట్టి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారి ద్వారా లాంఛనప్రాయ/ వాస్తవిక స్వాధీనం చేసుకొనబడినట్టి దిగువ వివరించబడిన స్థిరాస్తులు దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) & హామీదారు(ల) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావలసిన దిగువ తెలిపిన బకాయిలు రాబట్టుకొనుటకు, దిగువ తెలిపిన తేదీన "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏమి ఉంటే అదే" మరియు "ఏది అక్కడ ఉందో అదే" ప్రాతిపదికన విక్రయించబడునని ముఖ్యంగా రుణగ్రహీత(ల)కు మరియు హామీదారు(ల)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. రిజర్వు ధర మరియు బయానా కూడా దిగువ తెలియజేయబడినవి:

1 రుణగ్రహీత పేరు మరియు చిరునామా: 1) మెసర్స్ నప్పి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇ.నం.8-2-472, ఫ్లాట్ నం.5, పెంట్‌హౌస్, రోడ్డు నం.4, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500035. మరియు ఇ.నం.8-2-598/ఎ/9/1, ఏఎస్‌సిఐ కాలనీ, అంబె సిల్క్స్ సమీపాన, రోడ్డు నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034. తనఖాదారులు/హామీదారులు : 2) శ్రీమతి నప్పి రతన్ పిళ్లై, ఫ్లాట్ నం.301, స్వర్ణ హెవెన్స్, రోడ్డు నం.14, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034. 3) శ్రీ ప్రతీక్ ఫూల్‌చంద్ ఖండేకర్, 690/ఎ, సెయింట్ జోసెఫ్ స్కూల్ సమీపాన, [illegible], నాగ్‌పూర్, మహారాష్ట్ర - 440016.: 4) జోగినపల్లి పవిత్ర (డైరెక్టర్), ఇ.నం.8-2-472, ఫ్లాట్ నం.5, పెంట్‌హౌస్, రోడ్డు నం.4, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500035.
సదరు సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించి రాబట్టుకొనవలసిన బకాయి మొత్తము: 31.03.2025 నాటికి రూ.17,46,50,241.44/-(పదిహేడు కోట్ల నలభై ఆరు లక్షల యాభై వేల రెండు వందల నలభై ఒకటి మరియు నలభై నాలుగు పైసలు మాత్రమే) తదుపరి వడ్డీ, వ్యయాలు, ఖర్చులు కలుపుకొని
విక్రయించబోయే స్థిర సెక్యూర్డ్ ఆస్తి వివరణ:
తెలంగాణ, సికింద్రాబాద్ కంటోన్మెంట్, తిరుమలగిరి, గాంధీనగర్, సెయింట్ ఆంథోనీస్ చర్చ్ సమీపాన గల అమ్ముగూడ, (ఆర్‌కె పురం ఆశ ఆఫీసర్స్ కాలనీ సమీపాన) బ్లాక్ నం.12, వార్డు నం.6, జీఎల్ఆర్ సర్వే నం.255, సర్వే నం. 194/1 వద్ద గల 3279.44 చ.గజాల విస్తీర్ణం గల ఖాళీ భూమి. సరిహద్దులు: ఉత్తరం: సర్వే నం.194/1లోని పొరుగువారి ఆస్తి, దక్షిణం: సర్వే నం.194/1లోని పొరుగువారి ఆస్తి, తూర్పు: సర్వే నం.194/1లోని పొరుగువారి ఆస్తి, పశ్చిమం: 30 అడుగుల వెడల్పు రోడ్డు.
ఎస్ఆర్ఓ. మారేడ్‌పల్లి వద్ద నమోదైన రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.1966/2013, తేది: 11.07.2013
గూగుల్ కోఆర్డినేట్స్: 17.483195, 78.523517
రిజర్వు ధర : రూ. 5,54,40,000/- బయానా: రూ. 55,44,000/- బిడ్ పెరుగుదల మొత్తం: రూ. 5,54,400/-
గమనిక: డిఆర్‌టి-2 హైదరాబాద్ వద్ద సెక్యూరిటైజేషన్ అప్లికేషన్ ఎస్ఎ/81/2024 యొక్క ఫలితానికి లోబడి అమ్మకం ఉంటుంది.
తేది: 21.05.2025 తదుపరి వివరాలకు సంప్రదించగలరు: 9493268455

2 రుణగ్రహీత పేరు మరియు చిరునామా: 1. M/s. శ్రీలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్, ఇ.నం.8-7-38/1, 3వ అంతస్తు, లక్ష్మీనిలయం, రాజరాజేశ్వరినగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి సికింద్రాబాద్, హైదరాబాద్-500011. సహ-బాధ్యతాదారు/పార్ట్‌నర్/హామీదారు : 2 (ఎ) శ్రీ చిట్టి భాస్కర్ రెడ్డి తండ్రి శ్రీ చిట్టి రంగారెడ్డి ఇ.నం.8-7-38/1, 3వ అంతస్తు, లక్ష్మీనిలయం, రాజరాజేశ్వరినగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి సికింద్రాబాద్, హైదరాబాద్-500011. 2 (బి) శ్రీ చిట్టి విజయరెడ్డి తండ్రి శ్రీ చిట్టి రంగారెడ్డి ఇ.నం.8-7-38/1, 3వ అంతస్తు, లక్ష్మీనిలయం, రాజరాజేశ్వరినగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి సికింద్రాబాద్, హైదరాబాద్-500011. 2 (సి) శ్రీ చిట్టి రమేష్‌రెడ్డి తండ్రి శ్రీ చిట్టి రంగారెడ్డి ఇ.నం.8-7-38/1, లక్ష్మీనిలయం, రాజరాజేశ్వరినగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి సికింద్రాబాద్, హైదరాబాద్-500011. 2 (డి) శ్రీ చిట్టి రంగారెడ్డి ఇ.నం.8-7-38/1, 3వ అంతస్తు, లక్ష్మీనిలయం, రాజరాజేశ్వరినగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి సికింద్రాబాద్, హైదరాబాద్-500011. 2 (ఇ) శ్రీ చిట్టి లక్ష్మిరెడ్డి భర్త చిట్టి రంగారెడ్డి లక్ష్మీనిలయం, రాజరాజేశ్వరినగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి సికింద్రాబాద్, హైదరాబాద్-500011; 2 (ఎఫ్) శ్రీమతి అటిగడ్డ శంకరమ్మ భర్త స్వర్గీయ ఎ. రేవారెడ్డి, ఫ్లాట్ నం.4, 5వ అంతస్తు, ఇ.నం.6-3-163/504,ఖైరతాబాద్, హైద్రాబాద్ 500036. మరియు శ్రీమతి అటిగడ్డ శంకరమ్మ భర్త స్వర్గీయ ఎ. రేవారెడ్డి, శాశ్వత చిరునామా : ఇ.నం.14-91, ఈదమ్మ గడ్డ, గోపాల్‌పేట మండలం, మహబూబ్‌నగర్-509206.
సదరు సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించి రాబట్టుకొనవలసిన బకాయి మొత్తము: 31.03.2025 నాటికి రూ.8,48,40,148.89 పైసలు, తదుపరి వడ్డీ, వ్యయాలు, ఖర్చులు కలుపుకొని
విక్రయించబోయే స్థిర సెక్యూర్డ్ ఆస్తి వివరణ:
శ్రీమతి అటిగడ్డ శంకరమ్మ భర్త స్వర్గీయ ఎ.రేవారెడ్డి పేరున గల హైదరాబాద్, ఖైరతాబాద్ గ్రామం, స.నం.49లోని లకిడీకాపూల్ వద్ద గల ఎం.సి.హెచ్.నం.6-1-1063/సి & సి1, బి/4, బి/2, 6-1-1063/బి/4/1, 6-1-1063 (కొత్తది) మరియు 2650 (పాతది) కలిగిన "ఆనంద్ ప్లాజా"లోని 2316 చ.గజాల మొత్తంలో 30 చ.గజాలకు సమానమైన భూమి అవిభాజ్య వాటాతో పాటు కామన్ ఏరియాలు సహా కలుసుకొని 1720 చ.అడుగుల విస్తీర్ణం గల ఐదవ అంతస్తులోని నివాస ఫ్లాట్ నం.4 (504) యావత్తు. ఫ్లాట్ సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: ఖాళీ, తూర్పు: కారిడార్, పశ్చిమం: ఖాళీ. భూమి సరిహద్దులు : ఉత్తరం: ఆంధ్రాబ్యాంక్, ఖైరతాబాద్ శాఖ, దక్షిణం: ద్వారకా మ్యారేజ్ హాల్, తూర్పు: ఇ.నం.6-1-1063/1/5, పశ్చిమం: రాజ్‌భవన్ రోడ్, 80 అ. పొడవుకు 40 అ.ల మెయిన్‌మార్గము మరియు 15 అ.ల మార్గము.
ఎస్ఆర్ఓ. సంజీవరెడ్డినగర్ వద్ద నమోదైన సేల్ డీడ్ నం.2751/2006 తేది: 29.08.2006
గూగుల్ కోఆర్డినేటర్స్: 17.406435,78.463464
రిజర్వు ధర : రూ. 73,35,000/- బయానా: రూ. 7,33,500/- బిడ్ పెరుగుదల మొత్తం: రూ. 73,350/-
తేది: 21.05.2025 తదుపరి వివరాలకు సంప్రదించగలరు: 9540870585

3 రుణగ్రహీత పేరు మరియు చిరునామా: 1) మెసర్స్ విక్టియార్ ప్రాజెక్ట్స్, (ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీ శ్రీనివాస్ డెండుకూరి), ఫ్లాట్ నం.617, 6వ అంతస్తు, చినాయ్ ట్రేడ్ సెంటర్ కాంప్లెక్స్ పార్క్ లేన్, సికింద్రాబాద్-500003. ప్రొప్రయిటర్/తనఖాదారు: 2) శ్రీ శ్రీనివాస్ డెండుకూరి తండ్రి డి.జి.కృష్ణం రాజు, నివాసం ఫ్లాట్ నం.23, ఎస్‌బిహెచ్ కాలనీ, డి.ఆర్.ఆర్. మిల్స్ సికింద్రాబాద్, హామీదారు/తనఖాదారు: 3) శ్రీమతి అల్లంశెట్టి శైలజ, భర్త అల్లంశెట్టి రఘునాథ్, నివాసం 5బి1, జాగృతి రెసిడెన్సీ, స్ట్రీట్ నం.8, ఈస్ట్ మారేడ్ పల్లి, సికింద్రాబాద్, 4) శ్రీ అల్లంశెట్టి రఘునాథ్ తండ్రి సుందర్ రాజు నాయుడు, నివాసం 5బి1, జాగృతి రెసిడెన్సీ, స్ట్రీట్ నం.8, ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్, సదరు స్థిర సెక్యూర్డ్ ఆస్తిని విక్రయించి రాబట్టుకొనవలసిన బకాయి మొత్తాలు: 31.03.2025 నాటికి రూ.1,38,18,419.54, మరియు తదుపరి వడ్డీ, వ్యయాలు మరియు ఖర్చులు.
విక్రయించబోయే స్థిర సెక్యూర్డ్ ఆస్తుల వివరణ:
ఫ్లాట్ షెడ్యూలు: శ్రీ డెండుకూరి శ్రీనివాస్‌కు చెందిన చినాయ్ ట్రేడ్ సెంటర్, పార్క్‌లేన్, సికింద్రాబాద్-50003లో 21 చ.గ.లు అవిభాజ్య వాటాతోపాటు 1018 చ.అ.లు విస్తీర్ణం కలిగిన ఎంసిహెచ్ నం.1-7-255 నుండి 263 మరియు 275 నుండి 280 మరియు 1-7-350 నుండి 377, 6వ అంతస్తు, వాణిజ్య కార్యాలయ స్థలం నం.617.సరిహద్దులు: ఉత్తరం: ఆఫీస్ నం.616, దక్షిణం: ఆఫీస్ నం.618, తూర్పు: ప్యాసేజ్, పశ్చిమం: ఖాళీ.
రిజర్వు ధర : రూ. 38,94,000/- బయానా: రూ. 3,89,400/- బిడ్ పెరుగుదల మొత్తం: రూ.39,000/-
తేది: 22.05.2025 తదుపరి వివరాలకు సంప్రదించగలరు: 9848151643

4 రుణగ్రహీత పేరు మరియు చిరునామా: 1) మెసర్స్ రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్, ప్రాతినిధ్యం వహించు యజమాని శ్రీ మంచాల రాఘవేంద్ర, 133/ఎ, అల్‌కరీం ట్రేడ్ సెంటర్, రాణిగంజ్, సికింద్రాబాద్, హైదరాబాద్ - 500003, శ్రీ ఎం. రాఘవేంద్ర న్యాయవారసులు: 2) శ్రీమతి మంచాల ఉమారాణి భర్త స్వర్గీయ ఎం. రాఘవేంద్ర, ఫ్లాట్ నం.39, స.నం.368/జిఎల్ఆర్55, చంద్రగిరి కాలనీ, లాల్‌బహదూర్ కాలనీ, సికింద్రాబాద్ కంటోన్మెంట్, సికింద్రాబాద్, తెలంగాణ - 500015 & 3) శ్రీ మంచాల నాగదీప్ తండ్రి స్వర్గీయ ఎం. రాఘవేంద్ర, ఫ్లాట్ నం.39, స.నం.368/జిఎల్ఆర్55, చంద్రగిరి కాలనీ, లాల్‌బహదూర్ కాలనీ, సికింద్రాబాద్ కంటోన్మెంట్, సికింద్రాబాద్, తెలంగాణ - 500015, హామీదారు(లు): 4) శ్రీ మంచాల నగేష్‌కుమార్, ఇ.నం.10-2-80, నెహ్రూనగర్, ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ - 500026 మరియు ఇ.నం.10-2-94, ఫ్లాట్ నం.301, 3వ అంతస్తు, సాయి శుభం అపార్ట్‌మెంట్, రోడ్డు నం.3, వీధి నం.7, వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ - 500026 మరియు 133/ఎ, అల్-కరీం ట్రేడ్ సెంటర్, రాణిగంజ్, సికింద్రాబాద్, హైదరాబాద్ - 500003.
సదరు సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించి రాబట్టుకొనవలసిన బకాయి మొత్తము: 31.03.2025 నాటికి రూ.5,24,61,317.40/-(రూపాయలు ఐదు కోట్ల ఇరవై నాలుగు లక్షల అరవై ఒక్క వేల మూడు వందల పదిహేడు మరియు నలభై పైసలు మాత్రమే) తదుపరి వడ్డీ, వ్యయాలు, ఖర్చులు కలుపుకొని
విక్రయించబోయే స్థిర సెక్యూర్డ్ ఆస్తి వివరణ:
శ్రీ మంచాల రాఘవేంద్రకు చెందిన హైదరాబాద్ జిల్లా కంటోన్మెంట్ ఏరియా, సికింద్రాబాద్, తిరుమలగిరి గ్రామం, రెవెన్యూ నం.55 (జిఎల్ఆర్ స.నం.368 భాగం)లో కలిగిన మెసర్స్ చంద్రగిరి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, లేఅవుట్ ప్రకారం 271.7 చ.మీటర్లకు సమానమైన 325 చ.గజాల విస్తీర్ణం గల ప్లాట్ నం.39లోని నివాస భవనం (గ్రౌండ్ + అప్పర్ ఫ్లోర్) యావత్తు మరియు సరిహద్దులు: ఉత్తరం: 30 అ. వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నం.38, తూర్పు: 30 అ. వెడల్పు రోడ్డు, పశ్చిమం: ప్లాట్ నం.40.
ఎస్ఆర్ఓ. బోయిన్‌పల్లి వద్ద నమోదైన రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.1286/2010, తేది: 05.08.2010
గూగుల్ కోఆర్డినేట్స్: 17.46920, 78.50701
రిజర్వు ధర : రూ. 2,91,00,000/- బయానా: రూ. 29,10,000/- బిడ్ పెరుగుదల మొత్తం: రూ. 2,91,000/-
తేది: 23.05.2025 తదుపరి వివరాలకు సంప్రదించగలరు: 9493268455

5 రుణగ్రహీత పేరు మరియు చిరునామా: 1) మెసర్స్ బిర్డ్స్ డిసిన్‌ఫెక్టంట్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, పరిపాలనా కార్యాలయం: ఫ్లాట్ నం.12బి, ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ, బేగంపేట, హైదరాబాద్ - 500016. నమోదిత కార్యాలయం: ఇ.నం.3-3-182, చప్పల్‌బజార్, కుత్బిగూడ, కాచిగూడ, హైదరాబాద్- 500027. ఫ్యాక్టరీ: ప్లాట్ నం.29, ఫేజ్-1, ఐడిఎ, పాషమైలారం, మెదక్ జిల్లా - 502307. తనఖాదారు/హామీదారు(లు): 1) డా. గౌరి అనిల్‌కుమార్ తండ్రి గౌరి బాలకిష్టయ్య, ఫ్లాట్ నం.301 (పెంట్‌హౌస్), సాయిపూర్ణ రెసిడెన్సీ, ప్రకాశ్‌నగర్, బేగంపేట, హైదరాబాద్ - 500016. 2) శ్రీమతి కొరళ్ల సులోచనా రాణి భర్త శ్రీ కృష్ణారెడ్డి, 1-2-51/సి, గగన్‌మహల్, దోమల్‌గూడ, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500029. 3) శ్రీ మర్లపూడి దేవిడ్ రాజు, తండ్రి మోసెస్, ఇ.నం.219/సి, ఎల్ఐజి బి.కె.గూడ, సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్-500038. 4) శ్రీ శ్రీనివాస్ యాద్గిర్కర్ తండ్రి మాధవ్‌రావు యాద్గిర్కర్, ఇ.నం.3-3-182, చప్పల్‌బజార్, కుత్బిగూడ, కాచిగూడ, హైదరాబాద్ - 500027. 5) మిస్ వి. స్వరూపారెడ్డి తండ్రి వి. కేశవ్‌రెడ్డి, ఇ.నం.2-9/2, ఎల్లంతకుంట, జమ్మికుంట, కరీంనగర్ జిల్లా - 505122. 6) శ్రీ వెనుముద్దల కేశవ్‌రెడ్డి తండ్రి వి. వెంకట్‌రామ్ రెడ్డి, ఇ.నం.5-132/1, కొంగరకుర్దు, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లా. 7) శ్రీమతి మేకా సునీతారెడ్డి భర్త శ్రీ ఎం.ఆర్.జి. రెడ్డి (తండ్రి శ్రీ వి. కేశవ్‌రెడ్డి), ఇ.నం.1-5-149/3, ఫ్లాట్ నం.44, జ్యోతి కాలనీ, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్ - 500010.
సదరు సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించి రాబట్టుకొనవలసిన బకాయి మొత్తము: 31.03.2025 నాటికి రూ.11,82,95,127.06 (రూపాయలు పదకొండు కోట్ల ఎనభై రెండు లక్షల తొంభై ఐదు వేల ఒక వంద ఇరవై ఏడు మరియు ఆరు పైసలు మాత్రమే), తదుపరి వడ్డీ, వ్యయాలు, ఖర్చులు కలుపుకొని
విక్రయించబోయే స్థిర సెక్యూర్డ్ ఆస్తి వివరణ:
శ్రీ మర్లపూడి దేవిడ్‌రాజుకు చెందిన హైదరాబాద్, సంజీవరెడ్డినగర్ వద్దగల ఎల్ఐజి (జిహెచ్ఎంసి నం.7-1-277/123, ఇ.నం.219/సి వద్దగల 125 చ.గజాల విస్తీర్ణం గల భూమిపై నిర్మించబడిన గ్రౌండ్‌ఫ్లోర్ ప్లస్ రెండు పై అంతస్తులలోని నివాస ఇంటి ఆస్తి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: 30 అ. వెడల్పు రోడ్డు, తూర్పు: ఇ.నం.220/సి, దక్షిణం: ఇ.నం.198/సి, పశ్చిమం: ఇ.నం.218/సి.
ఎస్ఆర్ఓ. సంజీవరెడ్డినగర్ (1611) వద్ద నమోదైన సేల్ డీడ్ నం.838/2011, తేది: 24.05.2011
గూగుల్ కోఆర్డినేట్స్: 17.447806,78.443019
రిజర్వు ధర : రూ. 1,21,00,000/- బయానా: రూ. 12,10,000/- బిడ్ పెరుగుదల మొత్తం: రూ. 1,21,000/-
గమనిక: డిఆర్‌టి-2 హైదరాబాద్ వద్ద డిఆర్‌టి-2 హైదరాబాద్, ఎస్ఎ 146/2025 వద్ద సెక్యూరిటైజేషన్ అప్లికేషన్ ఎస్ఏ నం.423/2023 యొక్క ఫలితానికి లోబడి అమ్మకం ఉంటుంది.
తేది: 23.05.2025 తదుపరి వివరాలకు సంప్రదించగలరు: 9493268455

ఇ-వేలం తేది మరియు సమయం: 13.06.2025 ఉ.12:00 గం. నుండి సా.5:00 గం. వరకు
(10 నిమిషాల అపరిమిత ఆటో విస్తరణలతో) ఇ-వేలం వెబ్‌సైట్ - https://baanknet.com

బయానా దాఖలుకు చివరి తేది: వేలం ముగింపు సమయం కంటే ముందుగా బయానాను డిపాజిట్ చేయవలెను మరియు ఆస్తి ఐడితో బయానా మొత్తాన్ని లింక్‌చేయవలెను/ మ్యాప్ చేయవలెను. ఏదేని సాంకేతిక సమస్యను నివారించడానికి తగినంత ముందుగా ఆస్తి ఐడితో బయానా మొత్తాన్ని డిపాజిట్ చేసి, లింక్ / మ్యాప్ చేయవలసిందిగా సూచించడమైనది.

మొబైల్ నంబర్ మరియు చెల్లుబాటు గల ఇమెయిల్ ఐడి ఉపయోగించి https://baanknet.com లో నమోదు చేసుకోండి. రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు https://baanknet.com లోని హోమ్‌పేజీలో ఏర్పాటు చేసిన బయ్యర్ మాన్యువల్ లింక్‌ను దర్శించండి. విచారణల కొరకు సంప్రదించు నంబర్: 8291220220, ఇమెయిల్ ఐడి: support.baanknet@psballiance.com. బిడ్డర్లు వారి బిడ్లను దాఖలు చేసేముందు మరియు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనే ముందు వేలం అమ్మకం యొక్క సవివరమైన టెండరు నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్: https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.in చూడవలసిందిగా సూచించబడుచున్నారు. ఈ బిడ్డింగ్ ప్రాసెస్ ముగిసిన తరువాత సఫలీకృత బిడ్డర్‌కు ఇమెయిల్ ద్వారా తెలియజేయబడును. ఆసక్తిగల బిడ్డరు సంప్రదించగలరు: అధీకృత అధికారులు, 249/3ఆర్‌టి, 1వ అంతస్తు, మెయిన్‌రోడ్, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్ - 500038, మొబైల్ నం: 8077983839, 9987321173
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8 క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం ప్రకటన
పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీతలు మరియు హామీదారులకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 క్రింద ప్రకటనగా కూడా దీనిని పరిగణించగలరు.

ప్రదేశం: హైదరాబాద్ అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసెట్ రికవరీ శాఖ

అందుబాటులోకి హెల్ప్‌లైన్

హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో రోగుల కోసం 24 గంటల పాటు ప్రత్యేక హెల్ప్‌లైన్, రోగి సహాయక సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ మేరకు మంగళవారం బీఎస్సీ హ్యూమన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ప్రతినిధి సల్మాన్ బాబు ఖాన్ ప్రారంభించారు. 15 ప్రభుత్వ ఆస్పత్రిలో 80కిపైగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సాయంతో సేవలు అందించనున్నామని చెప్పారు. అత్యవసర విభాగం పక్కన ఉన్న ఓపీ బ్లాక్ ర్యాంప్ పక్కనున్న ఖాళీ ప్రదేశాన్ని ఒక వార్ రూమ్‌లా మార్చామని, అక్కడే ఈ ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. 77802 88622 నంబర్లో సంప్రదించవచ్చన్నారు.

నిజమైన విజయం అప్పుడే



మాట్లాడుతున్న ప్రమోద్ చౌదరి

రాజేంద్రనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి ఆహారం పెట్టే స్థితికి భారత్ చేరుకోవాలని భారతీయ వ్యవసాయ ఆర్థిక పరిశోధన కేంద్రం అధ్యక్షుడు ప్రమోద్ చౌదరి అన్నారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)లో రెండు రోజుల పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో జాతీయ విద్యా విధానంపై మేధోమథన సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, భారతదేశం తన జనాభాకే కాకుండా ప్రపంచానికి ఆహారం పెట్టే దేశంగా ఎదిగిన నాడే నిజమైన విజయం అన్నారు. వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) విద్యా ప్రణాళిక గృహ శాస్త్ర విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బీమ్లేశ్ మాన్, వ్యవసాయ ఆర్థిక పరిశోధన కేంద్రం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ కే దూబే, నార్మ్ యాక్టింగ్ డైరెక్టర్, ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (వ్యవసాయ విద్య) డాక్టర్ ఆర్ సీ అగర్వాల్ ప్రసంగించారు. కార్యక్రమంలో 45 రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాల నుంచి 56 మంది డీన్‌లు, డైరెక్టర్లతో పాటు నార్మ్ విద్యావ్యవస్థల విభాగం అధిపతి డాక్టర్ ఎస్ సెంథిల్ వినాయగం పాల్గొన్నారు.

ఐజీసీఎస్‌బీ ఫలితాల్లో 'శ్రీచైతన్య' సత్తా



హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): ఐజీసీఎస్‌బీ పరీక్షా ఫలితాల్లో ఫ్యూచర్‌పాత్‌వేస్ విద్యార్థులు మంచి ప్రతిభను కనబర్చారని శ్రీచైతన్య ఫ్యూచర్ పాత్‌వేస్ డైరెక్టర్ సీతా బొప్పన మంగళవారం ప్రకటనలో తెలిపారు. 24 మంది విద్యార్థులు 10వ తరగతి ఐజీసీఎస్ఈ తరగతి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. గచ్చిబౌలికి చెందిన 8వ తరగతి విద్యార్థిని లక్ష్మ అనిక నృసింహదేవర 10వ తరగతికి సంబంధించి రసాయన శాస్త్రంలో 93 శాతం మార్కులు సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పిందన్నారు. పలువురు విద్యార్థులు కూడా సత్తా చాటారని తెలిపారు.

డబ్బులు ఇచ్చేంత వరకు ఆగండి

● లేదంటే కేసులు పెడతా

● ఉద్యోగాలు రావు, విదేశాలకు వెళ్లరని హెచ్చరిక

● కన్సల్టెన్సీకి మద్దతుగా మాట్లాడినట్లు ఎస్సై ఆడియో వైరల్

అల్వాల్, మే27 (ఆంధ్రజ్యోతి): "డబ్బులు ఇచ్చేంత వరకు ఆగండి.. లేదంటే కేసులు పెడతా.. ఉద్యోగాలు రావు, విదేశాలకు వెళ్లరని" అల్వాల్ ఎస్సై విద్యార్థులను బెదిరించినట్లు మంగళవారం ఆడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. విషయానికొస్తే.. అల్వాల్ లయోలా కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ అధికారి సదరు కన్సల్టెన్సీ గురించి చెప్పడంతో విద్యార్థులు ఏఎస్‌రావునగర్‌లోని గ్లోబల్ పైయనీర్ కన్సల్టెన్సీ యజమాని సుబ్బలక్ష్మికి రూ. 45 లక్షలను గత ఏడాది క్రితం చెల్లించారు. డబ్బులు తీసుకున్న కన్సల్టెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు ఉద్యోగాలు ఇప్పించలేదు. సొమ్ములు తిరిగి ఇవ్వడం లేదు. వారికి విద్యార్థులు ఒత్తిడి రావడంతో నకిలీ ఐడీలు, నియామక పత్రాలు ఇచ్చారు. వాటిపై విచారణ చేపట్టగా పూర్తిగా బోగస్ అని తేలింది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ సెల్ అధికారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జూన్ 25 వరకు డబ్బులు ఇస్తామని కళాశాల నిర్వాహకులు చెప్పారు. అయితే కొంతకాలంగా ఇదే సమాధానం చెప్పి దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని కొందరు విద్యార్థులు మరోసారి కాలేజీకి వెళ్లి డబ్బుల కోసం నిలదీశారు. ఈ విషయం తెలుసుకున్న అల్వాల్ ఎస్సై బాధిత విద్యార్థులకు ఫోన్ చేసి బెదిరించినట్లు సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యింది..

మెరుగైన విద్యా ప్రమాణాలు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

రాంనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచి విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని, ఇందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పీపుల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సంక్షోభంలో తెలంగాణ విద్యారంగం అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం మాట్లాడుతూ విద్య ద్వారా సమాజంలో మార్పు వస్తుందన్నారు.

అంబేడ్కర్ డిగ్రీ, పీజీ కాలేజీకి న్యాక్ గుర్తింపు

రాంనగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): దివంగత కేంద్రమంత్రి జి.వెంకటస్వామి ప్రారంభించిన డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థలలోని డిగ్రీ, పీజీ కళాశాలకు యూజీసీ అటనామస్ గుర్తింపు రావడం గొప్ప విషయం అని విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ డిగ్రీ కాలేజీ ఆవరణలో జరిగిన సమావేశంలో అటనామస్ గుర్తింపును వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో సంబరాలు నిర్వహించారు. అటనామస్ గుర్తింపు వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు.

స్టీల్ హింజ్స్ కంపెనీపై దాడులు

● నకిలీ ఉత్పత్తులు జప్తు

హైదరాబాద్ సిటీ, మే27 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఐఎస్ఐ ముద్రలతో ఉత్పత్తులు తయారు చేస్తున్న స్టీల్ హింజ్స్ కంపెనీపై మంగళవారం బీఐఎస్ హైదరాబాద్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఓ కంపెనీలో నకిలీ ఐఎస్ఐ ముద్రలతో ఇంటి తలుపులకు వాడే స్టీల్ హింజ్స్‌ను తయారు చేస్తూ మార్కెట్‌ను సరఫరా చేస్తున్నారన్న సమాచారంతో అధికారులు ఈ దాడులు చేశారు. ఉత్పత్తులతో పాటు నకిలీ ఐఎస్ఐ ముద్రించిన ప్యాకేజింగ్ లేబుల్ అట్టలనూ సీజ్ చేసినట్లు బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ తెలిపారు.

మావోయిస్టుల పేరుతో లేఖ

మాజీ ఎమ్మెల్యే సోదరుడి కుమారుడిని చంపేస్తామని బెదిరింపులు

రూ.50లక్షలు డిమాండ్

జీడిమెట్ల పోలీసుల అదుపులో ఇద్దరు

జీడిమెట్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సోదరుడి కుమారుడిని చంపేస్తామంటూ కుత్బుల్లాపూర్‌లో మావోయిస్టుల పేరుతో లేఖ బయటపడటం కలకలం రేపింది.

పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని షాపూర్‌నగర్ హెచ్ఎంటీ సొసైటీలో నివాసముంటున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ సోదరుడు రవీందర్‌గౌడ్ ఇంటికి ఈనెల 21న రాత్రి గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి వేళ ఇంటి ఆవరణలోకి చొరబడ్డాడు. కారుపైన ఒక లేఖ పెట్టాడు. ఇంటి ఎదుట ఉన్న తులసీ మొక్కను ధ్వంసం చేశాడు. ఎర్రరంగులో ఉన్న కండువాను కారుపై పెట్టి వెళ్లారని తెలిపారు. ఆ లేఖను రవీందర్‌గౌడ్ తన కుమారుడు రాఘవేంద్రగౌడ్‌కు చూపించాడు. అందులో తాము మావోయిస్టులమని, శుక్రవారం ఉదయం 9 గంటల వరకు రూ. 50 లక్షలు పంపించకపోతే రాఘవేంద్రగౌడ్‌ను చంపేస్తామని రాసి ఉందని పోలీసులు తెలిపారు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు సీసీ ఫుటేజీని పరిశీలించారు. 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ముఖానికి మాస్క్ వేసుకున్న వ్యక్తి లోపలికి దూకినట్టుగా గుర్తించి, 22 కు ఫిర్యాదు చేశారని జీడిమెట్ల పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. కూన రవీందర్, రాఘవేందర్‌లు చేస్తున్న వ్యాపార కార్యకలాపాలే బెదిరింపులకు కారణం పోలీసులు అనుమానిస్తున్నారు.

శిల్పారామంలో కంటెంట్ క్రియేటర్స్ బృందం

హైటెక్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ అండ్ వెస్ట్ ఆఫ్రికా కంటెంట్ క్రియేటర్స్ బృందం మంగళవారం మాదాపూర్లోని శిల్పారామాన్ని సందర్శించింది. మినిస్ట్రీ ఆఫ్ ఎక్సటర్నల్ అఫైర్స్ విభాగం ఐఎఫ్ ఎస్ అధికారులు కృతిక భరద్వాజ, అన్నపూర్ణ సింగ్ వీరికి నాయకత్వం వహించారు. ఐదు రోజుల హైదరాబాద్ పర్యటనలో భాగంగా 15 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలను ఆయా దేశాల్లో వారు ఇనుమడింప చేసేందుకు ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.

అత్యవసర బృందాలకు రూ.11.25 కోట్లు

హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. మహానగర వాసుల వరద కష్టాలు తీర్చేలా ప్రత్యేక బృందాల ఏర్పాటుకు సిద్ధమైంది. వార్డుకొకటి చొప్పున 150 మాన్‌సూన్ అత్యవసర, తక్షణ మరమ్మతు బృందాలతో కూడిన వాహనాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. రూ.11.25 కోట్లతో ఆయా బృందాల ఏర్పాటుకు కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పాలనాపరమైన అనుమతులు జారీ చేశారు. జోన్లవారీగా అత్యవసర, తక్షణ మరమ్మతు బృందాల ఏర్పాటుకు టెండర్ నోటిఫికేషన్ ప్రకటించాలని సూచించారు. మంగళవారం సికింద్రాబాద్ జోన్‌కు సంబంధించిన టెండర్ ప్రకటించారు. రెండు ప్యాకేజీలుగా 27 వాహనాలు, బృందాల ఏర్పాటుకు రూ.2.02 కోట్లతో బిడ్‌లు ఆహ్వానించారు. 30వ తేదీ వరకు బిడ్‌ల దాఖలుకు అవకాశముంది.

'రామ్‌కీ' టస్కర్ అవార్డు



శశిథరూర్ నుంచి అవార్డు అందుకుంటున్న రామిరెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న "రామ్ కీ ఫౌండేషన్" టస్కర్ అవార్డు అందుకుంది. టస్కర్ లీడర్‌షిప్ అవార్డులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో సహజ వనరుల సంరక్షణ, విద్య, వైద్యం, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, మహిళా సాధికారత వంటి రంగాల్లో ఫౌండేషన్ అందించిన సేవలకు గుర్తింపుగా పురస్కారం అందుకుంది. కేరళ తిరువనంతపురంలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో సీఎస్ఆర్ ఎక్సలెన్స్ విభాగంలో కాంగ్రెస్ నేత ఎంపీ శశిథరూర్ చేతుల మీదుగా రామ్ కీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎం.వి.రామిరెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ శాన్య రాష్ట్రాల్లోనూ సేవల్ని మరింతగా విస్తరించబోతున్నట్లు, ఈ ఆర్థిక సంవత్సరంలో సేవా కార్యక్రమాల నిమిత్తం రూ. 100 కోట్లు వెచ్చించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

సాగరతీరంలో 'రోయింగ్'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ సబ్ జూనియర్ రోయింగ్ చాంపియన్‌షిప్ పోటీల ఏర్పాట్లను మంగళవారం శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర రోయింగ్ సంఘం అధ్యక్షుడు ఏపీ మిథున్ రెడ్డి పరిశీలించారు. బుధవారం మంత్రి కొండా సురేఖ పోటీలను ప్రారంభిస్తారని వివరించారు.

రైతుల బారులు



రాజేంద్రనగర్, మే 27(ఆంధ్రజ్యోతి): డీఆర్ఆర్ ధాన్ 75 రకం వరి విత్తనాల కోసం మంగళవారం రైతులు రాజేంద్రనగర్ ఐఐఆర్ఆర్(జాతీయ వరి పరిశోధన సంస్థ) వద్ద మంగళవారం రైతులు బారులుదీరారు. అనివార్య కారణాల వల్ల విత్తనాల పంపిణీని వాయిదా వేశారు. వినిపించుకోకుండా ఇక్కడే నిరసనకు దిగారు. చేసేదేమీ లేక 500 విత్తనాలను పంపిణీ చేశారు.

ప్రేమ, పెళ్లి పేరిట వంచన

● ఇంగ్లండ్ నుంచి వస్తుండగా శంషాబాద్‌లో ప్రియుడి అరెస్ట్

అమీర్‌పేట, మే 27 (ఆంధ్రజ్యోతి): యువతిని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి లొంగదీసుకున్నాడు. ఉన్నత చదువుల పేరిట ఇంగ్లండ్‌కు వెళ్లి దూరం పెట్టసాగాడు. మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దేశంలోని అన్ని ఎయిర్ పోర్టులకు లుకౌట్ నోటీసులు పంపారు. శంషాబాద్ ఎయిర్ పోర్టులో పోలీసులు ప్రియుడిని అరెస్ట్ చేశారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేటకు చెందిన యువతి (31) బెంగుళూరులో ఓ కామన్ ఫ్రెండ్స్ మీటింగ్‌లో శశాంక్ వేలూరి పరిచయమయ్యాడు. తొలిచూపులోనే పెళ్లి చేసుకుంటానని ప్రతిపాదన తెచ్చాడు. ఇద్దరు కలిసి డేటింగ్ చేసే క్రమంలో ఆమెను లొంగదీసుకున్నాడు. అనంతరం ఉన్నత చదువుల కోసం ఇంగ్లండ్ వెళ్తున్నానని కొన్నాళ్ల తర్వాత యువతిని తీసుకెళ్తానని నమ్మించాడు. ఇక్కడి వచ్చాక ఈమె సోషల్ మీడియా అకౌంట్లన్ని బ్లాక్ చేసి చిన్న కారణాలతో దూరం పెట్టసాగాడు. తాను మోసపోయానని 2023 డిసెంబర్ 30న పోలీసులకు ఫిర్యాదు చేసింది. విదేశాలకు వెళ్లిన శశాంక్ ఇండియాకు తిరిగి రాగానే పట్టుకునేందుకు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. సోమవారం ఇంగ్లాండ్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు వస్తున్నట్లు ఇమ్మిగ్రేషన్ అధికారులు సమాచారం అందించగా శశాంక్ ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆస్పత్రుల్లో 5జి అంబులెన్స్ సేవలు

హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): కేర్ ఆస్పత్రి.. పవర్ ఆఫ్ త్రీ పేరుతో హైదరాబాద్‌లోని అన్ని ఆస్పత్రిలో 5జి అంబులెన్సులను మంగళవారం ప్రారంభించింది. హైదరాబాదులో తొలిసారిగా అందుబాటులోకి తెచ్చామని క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా తెలిపారు. అత్యవసర సమయంలో ప్రజలు ఈ హెల్ప్‌లైన్ 040-61656565 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నౌహిరా షేక్ అరెస్టు

హైదరాబాద్ సిటీ, మే27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త, హిరా గ్రూపు సంస్థ సీఈఓ నౌహిరా షేక్‌ను మంగళవారం సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. 2017-18 సంవత్సరంలో అధిక లాభాలు ఇస్తామంటూ పెట్టుబడుల పేరుతో కోట్ల రూపాయల ఆర్థిక మోసానికి పాల్పడినందుకు ఆమెపై కేసులు నమోదయ్యాయి. పోలీసులకు దొరక్కుండా తప్పించుకొని తిరుగుతోంది. ప్రత్యేక బృందాలు గాలించి హర్యానాలో పట్టుకున్నారు. ఆమెను నగరానికి తీసుకొచ్చిన పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచిన్నట్లు సమాచారం.

జీవో జారీ చేయండి: ఎంపీ కృష్ణయ్య

బర్కత్‌పుర, మే 27 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు పెంచిన 42 శాతం పై జీవో జారీ చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, జీవో జారీ చేయకుండా ఎన్నికలకు వెళ్తే రాష్ట్ర ప్రభుత్వంపై బీసీల యుద్ధభేరీ, వెయ్యి మందితో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని 243 ఆర్టికల్ ప్రకారం జీవో జారీ చేసి ఎన్నికలకు వెళ్లవచ్చని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS
PLOT FOR SALE
» VJA, మంగళగిరి, బందరు రోడ్డు, మచిలీపట్నం పోర్టు, బెంజిసర్కిల్‌కి 6 కిమీ, గన్నవరం ఎయిర్‌పోర్టు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల ప్రక్కన, కుంచనపల్లి చ.గ.2900/- నుండి 13,900/- ఇళ్ళ ప్లాట్స్. 20 సెంట్ల ఫామ్ హౌస్‌ప్లాట్ సెంట్ రూ.1,35,000/- సంప్ర:93985 76997 AJB- 31

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ADVT
క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386 97036 18806

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 28 మే 2025

సంకల్పం

ఒక తల్లి సంకల్పం డౌన్ సిండ్రోమ్‌తో పుట్టిన కూతురికి మరో జన్మనిచ్చింది. చదువు చెప్పి... ఆత్మవిశ్వాసం నింపి... ఆమె అభిరుచినే వ్యాపారంగా మార్చేలా తీర్చిదిద్దింది. ఇప్పుడు లెక్కకు మించిన ఆర్డర్లతో... ఒక ప్రముఖ లిప్‌బామ్ బ్రాండ్‌గా ఆ కంపెనీ అవతరించింది. కూతురు అనసూయ శర్మ విజయవంతమైన ప్రయాణం... ఆమె తల్లి అరితా పెర్సాడ్ మాటల్లో...

అమ్మ సంకల్పమే ఆసరాగా..!



"మొదటి సంతానంగా అబ్బాయి పుట్టాక... అమ్మాయి కావాలనుకున్నాం. మా ప్రార్థనలు ఫలించి రెండో కాన్పులో నాకు అమ్మాయి పుట్టింది. ఇంట్లో ఆనందానికి హద్దులు లేవు. సంబరాలు చేసుకున్నాం. కానీ ఆ సంతోషం ఎంతోకాలం లేదు. మా అమ్మాయి అనసూయశర్మకు డౌన్ సిండ్రోమ్ వ్యాధి ఉందని వైద్యులు నిర్ధారించారు. అది మా కుటుంబాన్ని కుదిపేసింది. దుఃఖంలో మునిగిపోయాం. తన భవిష్యత్తు తలుచుకొని చాలా బాధపడ్డాం. కొన్ని రోజుల తరువాత అనిపించింది... అన్నీ తెలిసిన మేమే ఇంతలా కుంగిపోతే లోకం తెలియని మా అమ్మాయి పరిస్థితి ఏంటని! బాధను పక్కన పెట్టేశాం. ఇక ఆలస్యం చేయలేదు. తనే నా లోకం అనుకున్నాను. సాధారణ పిల్లలకు దీటుగా పాపను పెంచాలని దృఢంగా సంకల్పించుకున్నాను. దేశ రాజధాని ఢిల్లీ మాది. అను పుట్టే సమయానికి నేను ఒక కార్పొరేటు కంపెనీలో మంచి ఉద్యోగం చేస్తున్నాను. బిజినెస్ పాఠాలు చెప్పేదాన్ని. తన కోసం ఉద్యోగం మానేశాను. కూతురు దిగులుతో నేను ఏమైపోతానో అని మావారు మొదట్లో ఆందోళన పడ్డారు. ఒక్కసారి బాధలో నుంచి బయటకు వచ్చాక... ఆయన మనసు కాస్త కుదుటపడింది.

సవాళ్లు కొత్త కాకపోయినా...

కెరీర్‌లో ఉన్నత స్థానంలో ఉన్న ఒక మహిళగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. కానీ కూతురు విషయంలో ఎదురైన సవాలు నా జీవితంలోనే అతిపెద్దది. వ్యక్తిగతమైనది. 'భవిష్యత్తులో అను వేరొకరి సాయం లేకుండా జీవించగలదా? ఎదగాలంటే తనకు ఉన్న అవకాశాలేమిటి? ఈ సమాజం తనను ఎలా చూస్తుంది?' ఈ ప్రశ్నలు నాకు నిద్ర పట్టనిచ్చేవి కావు. ఈ క్రమంలో నేను, మావారు... అనులాగా డౌన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న పిల్లలు, వారి కుటుంబాలను కలిశాం. మా పరిధిమేర లోతుగా వ్యాధి గురించి, వారికి ఇచ్చే శిక్షణ గురించి తెలుసుకున్నాం. ఎక్కడో చిన్న నమ్మకం కలిగింది... తను కూడా అందరిలా అద్భుతాలు చేయగలదని.



యోగాతో మొదలుపెట్టి...

ముందుగా అనూకు యోగాను పరిచయం చేశాను. చిన్న చిన్నవాటితో మొదలై క్రమంగా క్లిష్టమైన ఆసనాలు నేర్పించాను. దానివల్ల శరీరంలో కదలికలే కాదు... క్రమశిక్షణ కూడా అలవడింది. ఏకాగ్రత కుదిరింది. స్కూల్లో చేర్పిస్తే... అక్కడ మళ్లీ సమస్యలు ఎదురయ్యాయి. చాలా నెమ్మదిగా రాసేది. లెక్కల్లో అయితే ఇంకా నిదానం. ఎంతో ఓర్పుతో ఒకటికి పదిసార్లు అనూతో చేయించాను. దాంతో నిదానంగా పుంజుకుంది. ఒక్కసారి తన మెదడులోకి వెళితే అలా గుర్తుండిపోతుంది. అదే తన బలం. 2020లో కరోనాతో అందరూ ఇళ్లకే పరిమితమైపోయారు. ఆ సమయంలో మా గ్యారేజీలో ఒక లెమనేడ్ స్టాండ్ ఏర్పాటు చేశాను. స్టాండ్ అంటే ఒక చిన్న కొట్టులాగా. అందులో నాణేల లెక్కలు, నిమ్మకాయ రసం తయారీకి అవసరమైన పదార్థాలను కొలవడం నేర్పించాను. అన్నిటికంటే తనకు బాగా ఇష్టమైంది... ఇరుగుపొరుగుతో మాట్లాడడం. ఆ స్టాండ్ పెట్టాక చుట్టుపక్కలవారు వచ్చి అనూను సరదాగా పలుకరించేవారు.

మక్కువనే వ్యాపారంగా మలిచి...

క్రమంగా అనూలో ఆత్మవిశ్వాసం పెరిగింది. చదువుతో పాటు చిన్నపాటి వ్యాపార మెళకువలు కూడా నేర్పిస్తే బాగుంటుందని అనిపించింది. ఏంచేయాలని ఆలోచిస్తుంటే.. అనూకు లిప్‌స్టిక్‌పై ఉన్న ఇష్టం గుర్తుకువచ్చింది. లిప్‌స్టిక్ తను వేసుకోదు కానీ... ఆ రంగులు, అందమైన ప్యాకింగ్‌లవల్ల వాటిని ఎంతో ఆసక్తిగా చూస్తుండేది. ఆ సమయంలో తన కళ్లల్లో మెరుపు కనిపించేది. తనకు నచ్చిన లిప్ బామ్స్ తయారు చేస్తే ఎలా ఉంటుంది? ఆలోచన బాగుంది. కానీ ఎలా? యూట్యూబ్‌లోకి వెళ్లి తయారీ నేర్చుకున్నా. తనకూ చూపించి, వివరించి చెప్పాను. బానే అర్థం చేసుకునేది.

ఎన్నో ప్రయత్నాల తరువాత...

లిప్‌బామ్ తయారీ కోసం గంటల తరబడి ఇద్దరం వీడియోలు చూసేవాళ్లం. ఒకరోజు ప్రయోగాత్మకంగా మొదలుపెట్టాం. తొలి ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. ఒకటి రెండు కాదు... ఎన్నోసార్లు ప్రయత్నించాం. పట్టు విడవలేదు. చివరకు మా కష్టం ఫలించింది. మంచి లిప్‌బామ్ తయారైంది. బంధువులు, స్నేహితులకు ఇచ్చాం. వారి నుంచి అనూహ్య స్పందన వచ్చింది. దాంతో అందంగా ప్యాకింగ్ చేసి, విక్రయానికి పెట్టాం. అనుకున్నదాని కంటే పది రెట్లు అమ్ముడయ్యాయి. తెలిసినవారి నుంచే కాదు, కార్పొరేటు కంపెనీల బహుమతుల జాబితాలో కూడా మా 'లవ్‌బర్డ్స్ బై అను' లిప్‌బామ్ చేరింది. మేం లేకపోయినా... ఇప్పుడు అను సొంతంగా లిప్ బామ్ తయారు చేయగలుగుతుంది. మా అమ్మాయికి ప్రస్తుతం పంథొమ్మిదేళ్లు. ఎవరైనా వచ్చి తనను పలుకరిస్తే... 'ఇప్పుడు నేను కంపెనీకి సీఈఓ' అంటూ చాలా గర్వంగా చెబుతుంది. ఇదే కదా నేను కోరుకున్నది."



నృత్యం అంటే ఆమెకు ప్రాణం. ఎంతంటే... 160 కిలోమీటర్ల దూరం ప్రయాణించి అభ్యాసం చేసేటంత. ఇప్పుడు ఉన్నతోద్యోగిగా బాధ్యతలు నిర్వరిస్తూ... కళాకారిణిగానూ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు వెంట్రాప్రగడ వాణీభవాని. తన అడుగుజాడల్ని అనుసరిస్తూ, చిన్నవయసులోనే ప్రతిభను ప్రదర్శిస్తున్న కుమార్తెకు మార్గదర్శిగా నిలుస్తున్న ఆమె "నృత్యం జీవితాంతం కొనసాగించాల్సిన ఒక తపస్సు" అంటున్నారు. తన నృత్య ప్రయాణం గురించి, అభిరుచుల గురించి, నృత్యం వల్ల కలిగే ప్రయోజనాల గురించి 'నవ్య'తో ఆమె సంభాషించారు.

నాట్యమే శ్వాసగా..

"నృత్యం... సమాహార కళ. అంటే అనేక కళా రూపాల సమ్మేళనం. సంగీతం, సాహిత్యం, (పాత్రల) మానసిక శాస్త్రం, రంగాలంకరణ... ఇంకా ఎన్నో కలిస్తేనే నృత్యం. అలాంటి కళతో నాకు బాల్యంలోనే పరిచయం ఏర్పడింది. క్రమంగా అది నా జీవితంతో పెనవేసుకుపోయింది. నేను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఒక స్కూల్‌లో చదువుతున్నప్పుడు మాకు డ్యాన్స్ క్లాస్ ఉండేది. టీచర్లు కూడా నన్ను బాగా ప్రోత్సహించేవారు. కానీ అప్పట్లో నేను తీసుకున్నది పరిపూర్ణమైన శిక్షణ అని చెప్పలేను. అభ్యాసం మాత్రం కొనసాగిస్తూనే వచ్చాను. అయితే నృత్యం పట్ల నాకు శ్రద్ధ, భక్తి, ఎలాగైనా నిష్ణాతురాలు కావాలనే పట్టుదల కలిగించినది.. కళాతపస్వి కె.విశ్వనాథ్‌గారి 'స్వర్ణకమలం' సినిమా. కొన్నేళ్ళ తరువాత ఆయన సమక్షంలోనే అరంగేట్రం (రంగప్రవేశం) చేయడం నాకు దక్కిన అదృష్టంగా భావిస్తాను. కానీ మధ్యలో చాలా పరిణామాలు చోటుచేసుకున్నాయి.

అది గొప్ప ఆరంభం

ఇంటర్ చదవడానికి హైదరాబాద్ వచ్చాను. నల్లకుంటలో మా అమ్మమ్మగారి ఇంట్లో ఉండేదాన్ని. అక్కడ సుప్రసిద్ధ నాట్య గురువు మద్దాళి ఉషాగాయత్రి గారి దగ్గర చేరాను. ఒకవైపు ఇది కొనసాగుతూ ఉండగా... మా నాన్నగారు హఠాత్తుగా మరణించారు. ఆయన రెవెన్యూ శాఖలో పని చేసేవారు. కారుణ్య నియామకం కింద ఆయన ఉద్యోగం నాకు ఇచ్చారు. దాంతో కరీంనగర్‌లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. అప్పటికి నాకు పంతొమ్మిదేళ్ళు. నా నాట్యాభ్యాసం ఆగిపోయే పరిస్థితి వచ్చింది. కానీ ఎలాగైనా కొనసాగించాలని అనుకున్నాను. అప్పుడు మా తల్లిగారు, సోదరి నాకు చాలా మద్దతుగా నిలిచారు.. నిష్ణాతులైనవారి దగ్గరే విద్య నేర్చుకోవాలని నా తపన. ఈ విషయం మా గురువుగారితో మాట్లాడాను. ఆమె ప్రోత్సాహంతో... వారాంతాల్లో కరీంనగర్ నుంచి 160 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్ వచ్చి నృత్యాభ్యాసం చేసేదాన్ని. కొన్నాళ్ళకు హైదరాబాద్‌లో పౌరసరఫరాల శాఖలో ఖాళీలు ఉన్నాయని తెలిసింది. దరఖాస్తు చేసుకొని... రెవెన్యూ శాఖ నుంచి ఆ శాఖలోకి మారి, హైదరాబాద్ వచ్చేశాను. అవసరమైన వనరులు సమకూర్చుకున్నాక, నా ఇరవయ్యారో ఏట... హైదరాబాద్ రవీంద్రభారతిలో... కె.విశ్వనాథ్‌గారు, ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్‌గారు తదితరుల సమక్షంలో నా రంగప్రవేశం ఘనంగా జరిగింది. నృత్య కళాకారిణిగా నాకు గొప్ప ఆరంభాన్ని అందించింది. నా అభిరుచి గురించి నా భర్త భరణికి, నా అత్తింటివారికి ముందుగానే చెప్పాను. వారు దాన్ని ఆమోదించారు. వారి ప్రోత్సాహం లేకపోతే ఉద్యోగ బాధ్యతలను, కళాభిరుచిని సమాంతరంగా కొనసాగించడం సాధ్యమయ్యేది కాదు.



అనన్య కృషి

మా అమ్మాయి నూతన అనన్య కూడా నా గురువు ఉషాగాయత్రి గారి దగ్గరే శిక్షణ పొందుతోంది. ఇప్పుడు తన వయసు పద్నాలుగేళ్ళు. తనకు బాల్యం నుంచి సంప్రదాయ నృత్యం అంటే ఆసక్తి ఎక్కువ. అనేక ప్రదర్శనలు ఇచ్చింది. ఆరేళ్ళ వయసులో 'గోదా కళ్యాణం'లో చిన్న గోదాదేవి, 'శివభక్త మార్కండేయ'లో మార్కండేయుడు లాంటివి వీటిలో ఉన్నాయి. మా అమ్మాయి నాతో కలిసి రవీంద్ర భారతిలో 'అలమేలు మంగ... హరి అంతరంగ' అనే నృత్య నాటికను ప్రదర్శించింది. తల్లి, కుమార్తె కలిసి చేసిన అరుదైన సంప్రదాయ నృత్యంగా ఇది ప్రశంసలు పొందింది. 2022-23లో... 'సెంటర్ ఫర్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్' (సిసిఆర్‌టి) నుంచి 'కల్చరల్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ స్కీమ్' (సిటిఎస్ఎస్ఎస్) కింద తెలంగాణ నుంచి ఉపకార వేతనం పొందిన 15 మంది డ్యాన్సర్లలో అనన్య కూడా ఉంది. శ్రీమద్భగవద్గీతలోని మొత్తం 700 శ్లోకాలను పూర్తిగా కంఠస్థం చేసింది. ఈ నెల 18న నిర్వహించిన పరీక్షలో గెలిచి... మైసూరు అవధూత దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా బంగారు పతకాన్ని, సర్టిఫికెట్‌ను అందుకుంది. నేను ప్రస్తుతం తెలంగాణ పౌరసరఫరాల శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. కూచిపూడి నృత్యరీతిలో 'బి హై గ్రేడ్'కు ప్రసార భారతి నన్ను అప్‌గ్రేడ్ చేసి గౌరవించింది. అవకాశం వచ్చినప్పుడల్లా నర్తకిగా నా అభినయాన్ని ప్రదర్శిస్తున్నాను. దీనికి మా శాఖ అధికారుల ప్రోత్సాహం కూడా ఎంతో ఉంది. మా అమ్మాయి నూతన అనన్యకు నాట్యంలో ఇతర అంశాల్లోనూ తర్ఫీదు, ప్రోత్సాహం అందిస్తున్నాను.

పర్యావరణ పరిరక్షణ కూడా...

నాకు గార్డెనింగ్ ఇష్టం. మా ఇంటి టెర్రస్ మీద తోట పెంచుతున్నాను. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతిని, పక్షులను కాపాడడం, పరిరక్షించడం గురించి ప్రచారం చేసి, అవగాహన కల్పించడం కోసం నేను, మా అమ్మాయి కృషి చేస్తున్నాం. రోజూ మా వంటింటి బాల్కనీకి 25-30 పక్షులు వస్తాయి. వాటికి నీరు, తృణధాన్యాలు అందిస్తూ, వాటి కిలకిలారావాలను విని ఆనందించడం ఎన్నో ఏళ్ళుగా అలవాటైపోయింది. "వీటన్నిటికీ మీకు తీరిక ఎక్కడుంటుంది?" అనే ప్రశ్న నాకు తరచూ ఎదురవుతూ ఉంటుంది. ఎలాంటి ఒత్తిడి లేకుండా చేయడానికి, చేస్తున్న ప్రతి పనిని ఆస్వాదించడానికి కారణం... నృత్యమే. నృత్యకళాకారులకు శరీరాన్ని, మనస్సును బ్యాలెన్స్ చేసుకోవడం అలవాటైపోతుంది.. వేదిక మీద ఏమాత్రం తడబడినా దాని ప్రభావం ప్రదర్శన మీద పడుతుంది. రసాభాస అవుతుంది. కాబట్టి ప్రతి క్షణం అప్రమత్తతతో, ఏకాగ్రతతో ఉండాలి. దీనివల్ల ప్రతి పనీ పరిపూర్ణతతో చేయడం అలవాటైపోతుంది. అది నా ఉద్యోగ జీవితానికి కూడా ఎంతో ఉపకరిస్తోంది. చిన్నప్పుడు నృత్యం నేర్చుకొని, మధ్యలో మానేసినవారు ఎంతోమంది ఉన్నారు. వారికి నేను ఇచ్చే సూచన ఏమిటంటే... మళ్ళీ ప్రారంభించండి. అప్పుడు మీలో కలిగే మార్పు మీకు ఆశ్చర్యాన్నే కాదు, ఆనందాన్నీ ఇస్తుంది."

• కృష్ణశర్మ

నర్తనం... ఎన్నిటికో దోహదం

నృత్యం వల్ల అపారమైన ప్రయోజనాలున్నాయి. ఇది కదలికల ద్వారా చేసే ధ్యానం లాంటిది. అర్థంతో, లయతో కదలికలను సమన్వయం చేసుకోవాలి. అదే సమయంలో భంగిమలను సరిగ్గా ప్రదర్శించగలగాలి. దీనివల్ల ఏకాగ్రత పెరుగుతుంది.దైవసంబంధమైన కీర్తనలను, గీతాలను నేర్చుకోవడం, వాటి అర్థాలను తెలుసుకోవడం, ఆ భావాలను ప్రదర్శించడం కూడా ధ్యానాన్ని అభ్యసించడం లాంటిదే. సంప్రదాయ నృత్య రూపకల్పనలో కుడివైపు, ఎడమవైపు కదలికలు ఉంటాయి. దీనివల్ల మెదడులోని ఇరు భాగాలనూ సమానంగా ఉపయోగించగలిగే సామర్థ్యం కలుగుతుంది. జీవన నైపుణ్యాలమీద దీని ప్రభావం ఉంటుంది. నృత్యం అంటే శరీరం, ఆత్మల కలయిక. అది యోగ సూత్రాల సమగ్రతను ప్రతిఫలిస్తుంది. దుస్తులు, ఆభరణాలు, మేకప్, రంగాలంకరణతో సహా నృత్యంలో అనేక అంశాలు భాగంగా ఉంటాయి. వీటన్నిటికీ సమయాన్ని ఖర్చు చెయ్యాలి. దానికి ఎంతో ఓపిక కూడా కావాలి. ప్రస్తుత తరం పిల్లల్లో అసహనం తరచుగా కనిపిస్తోంది. నృత్యాభ్యాసం దాన్ని నివారిస్తుంది. అలాగే నాట్య కళారంగంలో పెద్దలకు, గురువులకు గౌరవం ఇవ్వడం తప్పనిసరి సంప్రదాయం. అది నిజ జీవితంలోనూ అలవాటవుతుంది. క్రమశిక్షణ పెరుగుతుంది. ప్రదర్శించే అంశానికి సంబంధించిన సందర్భం, సారాంశం, సందేశం లాంటి వాటిపై అవగాహన పెరుగుతుంది.

దోమ తెరలతో మలేరియా నివారణ!

దోమల ద్వారా వ్యాపించే వ్యాధులలో మలేరియా ఒకటి. దీని వల్ల ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది మృత్యువాత పడుతున్నారు. అలాంటి మలేరియాను వ్యాపింప చేసే దోమలోని పరాన్న జీవిని చంపేందుకు రసాయన సమ్మేళనాలను అమెరికా పరిశోధకులు అభివృద్ధి చేశారు.



నేచర్ జర్నల్‌లో ప్రచురించిన ఈ పరిశోధనలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. మలేరియా పరాన్నజీవిని చంపే ఆ రసాయన సమ్మేళనాలను దోమ తెరల్లో వాడే ప్లాస్టిక్‌లో వాడొచ్చని గుర్తించామని పరిశోధకులు వివరించారు. దోమలు వచ్చి ఆ తెరల మీద వాలినప్పుడు ఆ సమ్మేళనాలు వాటి కాళ్ల ద్వారా దోమలోకి ప్రవేశించి మలేరియా పరాన్న జీవిని చంపేస్తాయని వెల్లడించారు. ఈ సమ్మేళనాలను దోమ తెరల తయారీలో ఉపయోగించే పదార్థాలతో కలిపినా ప్రభావవంతంగా పని చేస్తున్నాయని కనుగొన్నామని చెప్పారు. ఈ పరిశోధనలో మొత్తం 81 సమ్మేళనాలను పరిశీలించామని, అందులో రెండు మాత్రం మలేరియా పరాన్న జీవిని నివారిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ సమ్మేళనాల వలన మలేరియా వ్యాప్తి గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కొత్త దుస్తులను ఉతికే ధరించాలా..?



మనలో చాలామంది కొత్త బట్టలు కొనుక్కున్న తరవాత వాటిని అలాగే ధరిస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల పలు ఆరోగ్య సమస్యలు ఏర్పడవచ్చని అంటున్నారు నిపుణులు. కొత్త బట్టలను ఉతికి ధరించడం మంచిదని సూచిస్తున్నారు.

- షాపుల్లో కొత్త బట్టలు చాలా రోజులుగా ఉండి ఉండవచ్చు. వీటి మీద కంటికి కనపడని దుమ్ము చేరుతూ ఉంటుంది. ఈ బట్టలను అలాగే ధరించడం వల్ల తుమ్ములు, దగ్గు, ముక్కు కారడం లాంటి శ్వాసకోశ సమస్యలు ఏర్పడవచ్చు.
- ఒక బకెట్ నీటిలో ఒక చెంచా సర్ఫ్ లేదా షాంపూ, ఒక చెంచా బేకింగ్ సోడా, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ నీటిలో కొత్త బట్టలను అయిదు నిమిషాలు నానబెట్టి తరవాత మంచినీళ్లలో ముంచి ఆరవేస్తే అవి పూర్తిగా శుభ్రమవుతాయి.
- చాలామంది... షాపుల్లో బట్టలను ఒకసారి ధరించి తమకు సరిపోయాయో లేదో చూసుకుంటూ ఉంటారు. దీనివల్ల బట్టల మీదికి హానికారక బ్యాక్టీరియాలు చేరే అవకాశం ఉంటుంది. ఇలాంటి బట్టలను నేరుగా ధరించడం వల్ల పలు చర్మ సమస్యలు రావచ్చు. కొనుక్కున్న తరవాత వాటిని డెటాల్ కలిపిన నీళ్లలో ముంచి ఆరవేయాలి.
- మిల్లుల్లో తయారు చేసిన తరవాత వాటిపై కొన్ని రకాల రసాయనాలు మిగిలి ఉండవచ్చు. వీటివల్ల చర్మం మీద దద్దుర్లు, దురద, అలెర్జీ లాంటి సమస్యలు ఏర్పడవచ్చు. కొత్త బట్టలను వాటిపై సూచించిన ప్రకారం డ్రైక్లీనింగ్ లేదా మంచినీళ్లతో శుభ్రం చేశాకే ధరించాలి.
- కొత్త బట్టలను పాత బట్టలతో కలిపి ఉతకకూడదు. అలా చేస్తే కొత్తవాటి రంగులు, వాటిపై ఉండే దుమ్ము కణాలు, ఇతర బ్యాక్టీరియాలు పాతవాటికి అంటుకోవచ్చు. కాబట్టి కొత్తవాటిని విడిగా ఉతకడమే మంచిది. కొన్ని వాషింగ్ మెషిన్లలో కొత్త బట్టలను ఉతికేందుకు సూచనలు ఉంటాయి. వాటి ప్రకారం ఉతికితే కొత్త బట్టలు రంగు మారకుండా ఉంటాయి.

ఫ్యాషన్

కలర్‌ఫుల్ కాన్స్ చీరలు

చీరకట్టు కొత్త పంథా పట్టింది. కొత్త పోకడలతో పూర్తి స్వరూపాన్ని మార్చుకుని అంతర్జాతీయ వేదికల్లో వినూత్నంగా వెలిగిపోతోంది. తాజా 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ వేడుకల్లో అవాక్కయ్యే రూపాల్లో వెలుగులు విరజిమ్మిన బాలీవుడ్ భామలు, వాళ్లు ధరించిన ఫ్యూజన్ చీరల విశేషాల గురించి తెలుసుకుందాం!





చీరలు, హుందాతనానికీ, నిండుదనానికీ ప్రతీకలు. ప్రత్యేకించి దక్షిణ భారతదేశపు సంప్రదాయ వస్త్రధారణలో చీరలదే అగ్రస్థానం. ఆరు గజాల అందమైన చీర, రమ్యమైన రవిక, కట్టిపడేసే కుచ్చిళ్లు, కవ్వించే కొంగు... ఇలా చీరలోని ఒక్కో అంశానిదీ ఒక్కో ప్రత్యేకత. చీరలో ఈ అంశాలన్నీ ఉండాలనే నియమానికి రోజులు చెల్లి, నేటి డిజైనర్ల సృజనాత్మకతకు అద్దం పట్టే ఆధునిక పోకడలు నేడు మనుగడలోకొచ్చాయి. తాజా కాన్స్ వేడుకల్లో రెడ్ కార్పెట్ మీద అడుగుపెట్టిన ఐశ్వర్యా రాయ్ మొదలు ఆలియా భట్ వరకూ ఎంతో దర్జాగా ఈ ఫ్యూజన్ చీరలను ప్రదర్శించి ప్రపంచాన్ని విస్మయపరచడం విశేషమనే చెప్పుకోవాలి.

ఐశ్వర్యా రాయ్ బచ్చన్

మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యా రాయ్, ప్రముఖ డిజైనర్ రూపొందించిన చేనేత కద్వా చీర కట్టింది. బ్రొకేడ్ మోటిఫ్స్, వెండి జరీ పనితనం ఈ చీర ప్రత్యేకతలు. బంగారం, వెండితో రూపొందిన సున్నితమైన జర్దోజి ఎడ్జింగ్‌తో ఈ చీరకట్టుకు అదనపు ఆకర్షణ తోడైంది. ఈ చీరకు జోడీగా ఐశ్వర్య ధరించిన, 500 క్యారెట్ల మొజాంబిక్ కెంపులు, అన్‌కట్ డైమండ్స్‌తో తయారుచేసిన భారీ నెక్లెస్ అందర్నీ ఆకట్టుకుంది.



జాన్వి కపూర్

లండన్ ఆధారిత లేబుల్ డిపెట్సా రూపొందించిన తెల్ల షిఫాన్ చీరను ఎంచుకుంది జాన్వీ. ఈ బ్రాండ్... నీళ్లలో తడిచినట్టు కనిపించే వెట్ లుక్‌కు పేరు పొందింది. జాన్వీ ఈ చీరను పచ్చలు, నీలాలతో తయారైన చోపార్డ్ నెక్లెస్‌తో మ్యాచ్ చేసింది.



ఆలియా భట్

ఆలియా సంప్రదాయ చీరకు సమకాలీన ముద్రను జోడించే ప్రయత్నం చేసింది. అందుకోసం చీరను తలపించే కస్టమ్ మేడ్ గుచి గౌన్‌ను ఎంచుకుంది. అలాగే బ్రాలెట్ స్టైల్ బ్లౌజ్, ఫిట్టెడ్ స్కర్ట్, పవిటను పోలిన డ్రేప్‌ను చీరకు జోడించింది.

మనం ఇంటి ముంగిట అలాగే ఇంటి లోపల కూడా రకరకాల మొక్కలు పెంచుతూ ఉంటాం. ఆకర్షణీయమైన ఆకులతో ఉండే మొక్కలు... ఇంటి అందాన్ని మరింత పెంచుతాయి. ఈ కోవకు చెందిందే 'రియో' మొక్క. దీనిని బోట్ లిల్లీ, ఓస్టెర్ ప్లాంట్ అని కూడా పిలుస్తారు. కార్యాలయాల్లో సైతం ఇది అందంగా ఒదిగిపోతుంది.


ఇంటి అందాన్ని పెంచే 'రియో'


- ఈ మొక్క ఆకులు పొడవైన వెడల్పాటి కత్తుల్లా కనిపిస్తాయి. సూర్యరశ్మి హెచ్చు తగ్గులను అనుసరించి ఊదా, గులాబీ, ఆకుపచ్చ రంగుల్లో ప్రకాశవంతంగా మెరుస్తుంటాయి.
- ఈ మొక్కను పెంచడానికి ప్రత్యేకమైన శ్రద్ధ అవసరం లేదు. ఎండ ఎక్కువైనా, తక్కువైనా; వర్షాకాలంలోనైనా, చలి ఎక్కువగా ఉన్నా... ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకోగల్గుతుంది.
- ఈ మొక్క కేవలం మట్టిలోనే కాదు నీళ్లలో కూడా పెరుగుతుంది. వెడల్పాటి కుండీలో సారవంతమైన మట్టిని నింపి కొమ్మను నాటితే చాలు... చక్కగా పెరుగుతుంది. నెలకు ఒకసారి సేంద్రియ ఎరువును అందిస్తే అందంగా కనిపిస్తుంది. గాజు గ్లాసులో నీళ్ల నింపి కొమ్మను ఉంచినా మెల్లగా ఆకులు వచ్చేస్తాయి.
- రియో మొక్క కుండీని బాల్కనీలో, వంటగది కిటికీ మీద, లివింగ్ రూమ్‌లో టేబుల్ మీద, స్టడీ రూమ్‌లో, సోఫా పక్కన అమర్చుకుంటే బాగుంటుంది. రాత్రి సమయాల్లో ట్యూబ్‌లైట్ల కాంతి పడి ఆకులు మెరుస్తాయి. ఈ మొక్క కాలుష్య కారకాలను పీల్చుకుని గాలిని శుద్ధి చేస్తుంది. దీనివల్ల ఇల్లు ఎప్పుడూ తాజాగా ఉంటుంది. ఇంటి చుట్టూ ఖాళీ స్థలంలో ఈ మొక్కను పెంచితే... సాయంత్రం సమయాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.



చిత్రజ్యోతి SINCE 1965







తారకరామ నామం... సదా స్మరామి!



ఆపరేషన్ సిందూర్ ప్రజలందరిలోనూ దేశ భక్తిని తట్టిలేపింది. యుద్ధంలో అమరులైన సైనికులకు దేశం యావత్తు అశ్రునివాళులు అర్పించింది. మన సైన్యం వీరత్వాన్ని తలచుకొని జాతి యావత్తు పులకించింది. వారి శౌర్యంతో పాటు సైనికుల సంక్షేమం కోసం మహానటుడు ఎన్టీఆర్ గతంలో చేసిన ఓ మంచి పనిని సమాజానికి గుర్తుచేసింది. 1965 పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలో మన సైనికుల సంక్షేమం కోసం తనవంతు బాధ్యత నెరవేర్చేందుకు నడుం బిగించిన ఎన్టీఆర్ జనాల్లోకి వెళ్లారు. విరాళాలు సేకరించి జాతీయ రక్షణ నిధికి అందించారు. అలాగే ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమను పట్టి కుదిపేస్తున్న థియేటర్ల వ్యవహారం కాస్తా రచ్చకెక్కిన విషయం చూస్తున్నాం. కానీ తన నాయకత్వ ప్రతిభతో ఒకప్పుడు ఇండస్ట్రీని ఏకతాటిపై నడిపించారు ఎన్టీఆర్. పరిశ్రమకు ఏ ఇబ్బంది వచ్చినా పెద్దదిక్కుగా ఉండి పరిష్కరించడంలో ముందుండేవారు. కానీ, ఇప్పుడు ఏదీ ఆ నాటి ఎన్టీఆర్ స్ఫూర్తి? ఓటీటీ ప్రభావంతో ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదనేది చాలాకాలంగా వినిపిస్తోంది. దీనివల్ల సింగిల్ స్ర్కీన్ల నిర్వహణభారంగా మారి పెద్ద సంఖ్యలో థియేటర్లు మూతపడుతున్నాయి. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు కూడా అన్న ఎన్టీఆర్‌నే పరిశ్రమ గుర్తుచేసుకుంటోంది. ఆయన మాటకు గౌరవమిస్తూ తరువాతి తరం హీరోలు ముందుకు సాగారు. కానీ, ఈనాడు ఆ రీతిన పిలుపునిచ్చేవారెక్కడ? అంత పెద్దరికం ఎవరిలో ఉంది?

ఎన్టీఆర్ జైత్రయాత్ర...

ఎన్టీఆర్‌ను ఈ విషయాల్లోనే తలచుకోవడం కాదు ఆ రోజుల్లో సినిమా థియేటర్లకు ఫీడింగ్ అంటే రామారావు సినిమాలే! ఇతర హీరోలవి ఎంత పెద్ద విజయాలు సాధించినా, ఎన్టీఆర్ స్థాయిలో వసూళ్ళు చూసేవి కావు. అందువల్ల ఆయన యేడాదికి పదికి తక్కువ కాకుండా నటించారు. యాభై ఏళ్ళు పైబడ్డ తరువాత కూడా సంవత్సరానికి ఏడెనిమిది సినిమాల్లో నటిస్తూ సాగారు రామారావు. ఇక ఆయన స్టార్ డమ్ 'పాతాళభైరవి'తో తిరుగులేని జానపద నాయకునిగానూ, 'మాయాబజార్' తరువాత పౌరాణికాలంటే రామారావే అనే రీతిలోనూ జైత్రయాత్ర చేశారు. అంతకు ముందు జానపద కథానాయకులుగా వెలిగిన వారు, పౌరాణికాల్లో రాణించినవారు వేరే దారి చూసుకోవలసి వచ్చింది. 'నిప్పులాంటి మనిషి' రీమేక్‌తో గ్రాండ్ సక్సెస్ చూసిన ఎన్టీఆర్ యాభై ఏళ్ల తరువాత కూడా స్టార్స్‌గా రాణించవచ్చునని దేశంలోని నటులందరికీ నిరూపించి చూపించారు. ఆ సినిమా ఒరిజినల్ 'జంజీర్'లో నటించిన అమితాబ్ మాత్రం యాభై తరువాత కేరెక్టర్ రోల్స్‌కు మారారు. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ఆరవై ఏళ్ళు దాటినా హీరోలుగా సాగుతున్న మన స్టార్స్‌ను చూస్తూనే ఉన్నాం. ఆయన సినీ రంగ నిష్క్రమణ తరువాత టాప్ స్టార్స్‌గా వెలిగిన నటులు కూడా ఆయన సినీ రంగంలో ఉన్నప్పుడు కేవలం సైడ్ పాత్రలకు, చిన్న సినిమాలకే పరిమితమయ్యారన్న విషయం అందరికీ తెలిసిందే.

పాత చిత్రాలతో బాక్సాఫీస్‌కు కళ

ఆ రోజుల్లో సింగిల్ థియేటర్స్ వారికి ఎన్టీఆర్ రిపీట్ రన్ మూవీస్ శ్రీరామరక్షగా ఉండేవి. ఎంత పెద్ద థియేటర్ అయినా, ఎంత కొత్త సినిమా హాలయినా గ్యాప్ వస్తే చాలు వెంటనే ఎన్టీఆర్ పాత చిత్రాలు ప్రదర్శించేవారు. ఎన్టీఆర్ పాత సినిమాలు సైతం మంచి వసూళ్లు చూసేవి. దాంతో థియేటర్లకు నష్టం వాటిల్లేది కాదు. పైగా ఆ రోజుల్లో సినిమా పరిశ్రమను నమ్ముకున్న వారి కోసం ఎన్టీఆర్ ఏడాదికి ఏడు, ఎనిమిది సినిమాలు తగ్గకుండా చేసేవారు. ఒకదశలో పదికి పైగా చిత్రాలలోనూ ఆయన నటించిన సందర్భాలున్నాయి. అలా థియేటర్లకు నష్టాలు వాటిల్లకుండా చూడడంలోనూ ఎన్టీఆర్ సినిమాలే ఆదరువుగా నిలిచాయి. కానీ, ఈ తరం హీరోలు, ముందు తరం కథానాయకులు సైతం ఏడాదికో, రెండేళ్లకో ఒక సినిమా చేస్తున్న పరిస్థితులున్నాయి. పైగా సినిమాలకు పెనుభూతంగా ఓటీటీ బయలు దేరింది. చిన్నా చితకా సినిమాలు వస్తున్నాయి కానీ, అవేవీ థియేటర్లను ఆదుకొనే పరిస్థితుల్లో లేవు. ఈ నేపథ్యంలో అగ్రకథానాయకులు కనీసం సంవత్సరానికి రెండు సినిమాల్లోనైనా నటించవలసిన పరిస్థితి ఏర్పడింది. చిత్రపరిశ్రమ క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు రామారావు ఎన్నో సార్లు ఆదుకున్న దాఖలాలున్నాయి. తన తరువాతి తరం హీరోలకు సైతం ఎక్కువ సినిమాల్లో నటించమని, అప్పుడే పరిశ్రమ బాగుపడుతుందని చెప్పేవారు ఎన్టీఆర్.

అన్ని రికార్డులూ ఆయనవే

ఇక తెలుగునాట స్టార్‌గా ఎన్టీఆర్ విజయాలకు, రికార్డులకు కొదువే లేదు. 'పాతాళభైరవి'తో 30 థియేటర్లలో వందరోజులు అవలీలగా సాధించడం ఎవరి వల్లా కాలేదు. మరో ఆరుసార్లు ఆ సక్సెస్ మార్కును ఎన్టీఆరే సాధించగలిగారు గాని ఇతరులు ఎవరికీ సాధ్యం కాలేదు. ఈయన పరిశ్రమవదలి వెళ్లిన పదేళ్ల తరువాత టాక్స్ రాయితీలు ఇస్తేనే ఇతర హీరోలకు 30 థియేటర్లలో సెంచరీ సాధ్యమైంది. ఎన్టీఆర్ చిత్రసీమలో ఉండగా కోటి రూపాయలు వసూళ్లు చూసిన సినిమాలు మొత్తం 16 కాగా, అందులో 13 ఈయనవే! మొదటివారం రూ.23 లక్షలు ఓపెనింగ్ చూసిన చిత్రాలు ఎన్టీఆర్‌వి 12 సినిమాలు కాగా, ఎన్టీఆర్ సినీరంగంలో ఉన్నంత వరకు తెలుగులో మరే హీరోకూ ఒకటి కూడా లేకపోవడం గమనార్హం! ఆ సమయంలో ఎన్టీఆర్ సినిమాల ఓపెనింగ్స్ రూ.23 లక్షల నుంచి రూ. 71 లక్షల రూపాయల దాకా వెళ్లినా కూడా ఇతరులెవరికీ రూ. 23 లక్షలు ఓపెనింగ్ లేకపోవడం, అంటే మూడో వంతు ఓపెనింగ్ కూడా లేకపోవడం గమనించదగ్గ అంశం. ఇలా ఎటు చూసినా ఎన్టీఆర్ నామాన్ని స్మరించడం అన్నది తెలుగువారికి, తెలుగు చిత్రపరిశ్రమకు రివాజుగా మారింది. అందుకే 'తారకరామ నామం సదా స్మరామి'!

● కొమ్మినేని వెంకటేశ్వర రావు

వ్యక్తిగత హోదాతో సంప్రదింపులకు పవన్ చెక్

● 'హరిహర వీరమల్లు' ధరల పెంపునకూ ఇదే నిబంధన



కొత్త చిత్రాల విడుదల సందర్భంలో టికెట్ ధరల పెంపు నిమిత్తం నిర్మాతలు, వారికి సంబంధించిన వారు వ్యక్తిగత హోదాలో కాకుండా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. సినిమా హాళ్ల బంద్ ప్రకటన, ఈ క్రమంలో తమ శాఖ ద్వారా చేపట్టిన చర్యలను, తాజా పరిణామాలను రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మంగళవారం వివరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పలు కీలక సూచనలు చేశారు. త్వరలో విడుదలయ్యే 'హరిహర వీరమల్లు' సినిమాకు టికెట్ ధరల పెంపు కోసం నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించాలనీ, ఇందులో తన మన భేదాలు పాటించవద్దని స్పష్టంగా చెప్పారు.

ప్రేక్షకులు సినిమా హాల్ వరకూ రావాలంటే..?

రాష్ట్ర వ్యాప్తంగా మల్టీప్లెక్సులు, సింగిల్ స్ర్కీన్స్‌లో ఆహార పదార్థాలు, శీతల పానీయాల వ్యాపారంలోనూ గుత్తాధిపత్యం సాగుతోందనే విషయం కూడా ప్రభుత్వం దృష్టికి వచ్చినందున దీనిపై విచారణ చేపట్టాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి పవన్‌కల్యాణ్ సూచించారు. ప్రేక్షకులు కుటుంబ సమేతంగా సినిమా హాళ్లకు రావాలంటే తినుబండారాలు, పానీయాల ధరలు చూసి వెనుకంజ వేసే పరిస్థితి రాకూడదని పవన్ అభిప్రాయపడ్డారు.

సినిమా హాళ్ల బంద్ నేపథ్యంలో...

థియేటర్ల బంద్ అంశంపై చేపట్టిన విచారణ పురోగతిని మంత్రి దుర్గేశ్ డిప్యూటీ సీఎంకు వివరించారు. బంద్ ప్రకటన వెనుక జనసేనాయకుడు ఉన్నారని ఒక నిర్మాత మీడియా ముందు ప్రకటించిన విషయంపైనా చర్చించారు. ఈ ప్రకటన వెనుక ఒక సినీ నిర్మాత, సినిమా హాళ్లు కలిగిన ఒక రాజకీయ నాయకుడి ప్రమేయం ఉన్నాయని సినిమా వర్గాలు చెబుతున్న క్రమంలో ఈ కోణంలో కూడా విచారణ చేయించాలని ఆయన మంత్రికి సూచించారు. థియేటర్ల బంద్‌కు కారకుల్లో జనసేన తరపువాళ్లు ఉన్నా చర్యలకు వెనుకాడవద్దని ఆదేశించారు. నిర్మాతలను, నటులను, దర్శకులను బెదిరింపు ధోరణిలో దారికి తెచ్చుకొని వ్యాపారాలు సాగించాలనుకొనే అనారోగ్యకర వాతావరణానికి తావు ఇవ్వకుండా సినిమా వ్యాపారం సాగించే ప్రోత్సాహకర పరిస్థితులను ప్రభుత్వం తీసుకువస్తుందనే విషయాన్ని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలికి, నిర్మాతల మండలికి, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, దర్శకుల సంఘాలకు తెలియజేయాలన్నారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

జనసేన ఇన్‌చార్జిపై వేటు

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల నేపథ్యంలో జూన్ 1 నుంచి థియేటర్ల బంద్‌కు నిర్ణయించారన్న వివాదానికి సంబంధించి జనసేన రాజమండ్రి సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, సినీ డిస్ట్రిబ్యూటర్ అనుశ్రీ(అత్తి) సత్యనారాయణను ఆ పార్టీ నాయకత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు జనసేన పార్టీ కాన్ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ హెడ్ వేములపాటి అజయ్‌కుమార్ పేరిట సత్యనారాయణకు లేఖ పంపారు. 'అవాంఛనీయమైన థియేటర్ల బంద్ పిలుపు నిర్ణయంలో మీరూ భాగస్వాములేనని మీపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినందున పార్టీలో మీ సభ్యత్వాన్ని రద్దు చేయడంతోపాటు మిమ్మల్ని పార్టీ రాజమండ్రి నగర నియోజకవర్గం ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగిస్తున్నాం. వచ్చిన ఆరోపణలు సత్యమో కాదో మీరు నిరూపించుకునేవరకూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలి' అని అందులో ఆదేశించారు. బంద్ పిలుపు వెనుక నలుగురు వ్యక్తులు ఉన్నారని ప్రచారం జరగడం, దానిపై పవన్ కల్యాణ్‌తోపాటు రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ కూడా స్పందించడం.. ఈ వివాదం వెనుక ఎవరు ఉన్నారనే దానిపై రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఆధ్వర్యంలో విచారణ కూడా జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రముఖ నిర్మాత దిల్ రాజు సోమవారం మాట్లాడుతూ.. అసలు బంద్ విషయం ప్రస్తావనకు తెచ్చింది గోదావరి జిల్లాలకు చెందిన జనసేన నేత, సినిమా థియేటర్ల యజమాని అనుశ్రీ సత్యనారాయణేనని ఆరోపించారు. వాస్తవానికి ఈ వివాదం వచ్చిన తర్వాత సత్యనారాయణ చాలాసార్లు విలేకరులతో మాట్లాడుతూ.. బంద్‌ను వ్యతిరేకించారు. పైగా ఆయన పవన్ కల్యాణ్‌కు బాగా సన్నిహితుడు. పార్టీ ఆవిర్భావం నుంచి జనసేనలోనే ఉన్నారు. 2019 ఎన్నికల్లో రాజమండ్రి సిటీ నుంచి పార్టీ అభ్యర్థిగా కూడా పోటీ చేశారు. అప్పటి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఆయన సస్పెన్షన్ చర్చనీయాంశమైంది.


రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)



'జైలర్ 2' విలన్‌గా నాగార్జున?

తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంతో జరుగుతోంది. 'జైలర్' సినిమాతో రజనీకాంత్ అభిమానులనే కాకుండా తమిళ, తెలుగు ప్రేక్షకుల్ని కూడా ఆకట్టుకొన్న దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దానికి సీక్వెల్‌గా వస్తున్న 'జైలర్ 2' పై ఉన్న భారీ అంచనాలను దృష్టిలో ఉంచుకొని మరింత ఆసక్తికరంగా రూపొందిస్తున్నారు. రజనీకాంత్ ఇందులో పవర్‌ఫుల్ క్యారెక్టర్ చేస్తుండగా, ఈ సినిమాలో ఆయనతో తలపడే విలన్‌గా నాగార్జున నటించనున్నట్లు మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే 'కూలీ' చిత్రంలో వీరిద్దరూ పోటాపోటీగా ఉండే పాత్రలను పోషిస్తున్నారు. 'జైలర్ 2' లో విలన్ పాత్ర కోసం కొన్ని పేర్లు పరిశీలించినా, చివరకు 'కూలీ' చిత్రంలో సైమన్‌గా నాగార్జున లుక్, పెర్ఫార్మెన్స్ చూసి ముగ్ధుడైన దర్శకుడు నెల్సన్ తన సినిమాకు ఆయనే విలన్ అని ఫిక్స్ అయ్యారట. వెంటనే నాగార్జునను కలిశారట. కథ, తన పాత్ర నచ్చడంతో నాగార్జున గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని తెలుస్తోంది. 'జైలర్ 2' చిత్రానికి సంబంధించి ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. మూడో షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది. ఇందులోనే రజనీకాంత్, నాగార్జున పాల్గొనే భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరించాలని దర్శకుడు నెల్సన్ ప్లాన్ చేస్తున్నారు. 'జైలర్ 2'లో బాలకృష్ణ కూడా నటించనున్నారని వార్తలు వచ్చాయి. ఇంతవరకూ ఒక్క సినిమాలో కూడా కలసి నటించని బాలకృష్ణ, నాగార్జున ఈ సినిమాలో కలసి ఒక ఫ్రేమ్‌లో కనిపిస్తారా, లేక వారిద్దరికీ విడివిడిగా సన్నివేశాలు ఉంటాయా అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

పవన్‌తో ఏకీభవిస్తున్నా



'సగటు సినిమా ప్రేక్షకులను థియేటర్లకు తీసుకురావడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన సూచనలతో నేను ఏకీభవిస్తున్నాను. సినిమా హాళ్లలో తినుబండారాలు, పానీయాల ధరలను అందరికీ అందుబాటులోకి తేవాలన్న వారి అభిప్రాయం అభినందనీయం. దీనిని మనమందరం స్వాగతించి, కలసికట్టుగా ముందుకు సాగుదాం' అని నిర్మాత దిల్ రాజు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. 'ప్రభుత్వాన్ని వ్యక్తిగతంగా కాకుండా ఫిల్మ్ చాంబర్ ద్వారా మాత్రమే సంప్రదించాలనే సూచన పరిశ్రమకు శాశ్వత దిశ ఇస్తుంది. అందుకే తెలుగు చిత్ర పరిశ్రమ ప్రభుత్వాలతో కలసి ముందుకు సాగాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన అన్ని అంశాలపై తెలంగాణ ప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరిపి, తెలుగు సినిమా అభివృద్ధికి నిర్మాతల మండలితో కలసి కృషి చేస్తాం' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఫైనల్..సిందూర్ స్పెషల్

త్రివిధ దళాధిపతులకు ఆహ్వానం

బీసీసీఐ నిర్ణయం

న్యూఢిల్లీ: తాజా ఐపీఎల్ సీజన్‌ను వినూత్నంగా ముగించాలని బీసీసీఐ భావిస్తోంది. దీనిలో భాగంగా ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా ముగించిన భారత సాయుధ దళాల చీఫ్‌లకు ఆహ్వానం పలికింది. అహ్మదాబాద్‌లో జూన్ 3వ తేదీన జరిగే ఫైనల్‌ను వీక్షించేందుకు రావాల్సిందిగా ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌లను కోరింది. 'ఆపరేషన్ సిందూర్‌లో మన సాయుధ దళాలు ప్రదర్శించిన శౌర్య పరాక్రమాలకు బీసీసీఐ సెల్యూట్ చేస్తోంది. అందుకే ఐపీఎల్ ముగింపు వేడుకలను సైన్యాన్ని గౌరవించేందుకు అంకితం చేయాలని భావించి త్రివిధ దళాధిపతులతో పాటు ఇతర మిలిటరీ ఉన్నతాధికారులు, సైనికులను ఆహ్వానించాం' అని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించాడు.

ఫీల్డింగ్ కోచ్‌గా మళ్లీ దిలీప్



న్యూఢిల్లీ: టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా హైదరాబాద్‌కు చెందిన టి. దిలీప్‌కు ఉద్వాసన పలికి నెల గడిచిందో లేదో మళ్లీ ఆ బాధ్యతలను అతనికే అప్పగించింది బీసీసీఐ. విదేశీ కోచ్ కోసం ఎంతగానో ప్రయత్నించినా, సరైన వ్యక్తి దొరకలేదని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో దిలీప్‌ను ఏడాది పాటు ఆ పదవిలో కొనసాగించాలని నిర్ణయించామన్నారు. వచ్చేనెల ఇంగ్లండ్‌లో పర్యటించే భారత జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా దిలీప్ వ్యవహరిస్తాడని తెలిపారు.

ఆసియా అథ్లెటిక్స్‌లో గుల్వీర్‌కు స్వర్ణం

గుమి (దక్షిణ కొరియా): ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలిరోజే భారత్ రెండు పతకాలతో అదరగొట్టింది. ఇందులో ఓ స్వర్ణం ఉండడం విశేషం. మంగళవారం మొదలైన ఈ పోటీల్లోని పురుషుల 10,000 మీటర్ల రేసులో గుల్వీర్ 28 నిమిషాల 38.63 సెకన్లలో రేసు పూర్తి చేసి విజేతగా నిలిచాడు. పురుషుల 20 కిలో మీటర్ల రేస్ వాక్‌లో భారత అథ్లెట్ సెర్విన్ సెబాస్టియన్ మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నాడు.

ప్లేఆఫ్స్‌లో ఎవరితో ఎవరంటే..	క్వాలిఫయర్-1 (గురువారం)	ఎలిమినేటర్ (శుక్రవారం)
	పంజాబ్ X బెంగళూరు	గుజరాత్ X ముంబై
	వేదిక: ముల్లాన్‌పూర్ (రా. 7.30 నుంచి)	వేదిక: ముల్లాన్‌పూర్ (రా. 7.30 నుంచి)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	14	9	4	1	19	0.372
బెంగళూరు	14	9	4	1	19	0.301
గుజరాత్	14	9	5	0	18	0.254
ముంబై	14	8	6	0	16	1.142
ఢిల్లీ	14	7	6	1	15	0.011
హైదరాబాద్	14	6	7	1	13	-0.241
లఖ్‌నవూ	14	6	8	0	12	-0.376
కోల్‌కతా	14	5	7	2	12	-0.305
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	14	4	10	0	8	-0.647

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

జితేశ్ జిగేల్

లఖ్‌నవూపై అద్భుత విజయం

పంత్ సెంచరీ వృథా

క్వాలిఫయర్-1కు బెంగళూరు



జితేశ్ శర్మ (85 నాటౌట్)

లఖ్‌నవూ: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సత్తా చాటుకుంది. ఎలిమినేటర్ గండాన్ని తప్పించుకోవాలంటే లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై కచ్చితంగా గెలిచి తీరాల్సిందే. కళ్లముందు 228 పరుగుల భారీ లక్ష్యం ఉన్నప్పటికీ.. కెప్టెన్ జితేశ్ శర్మ (33 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 85 నాటౌట్) చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. విరాట్ కోహ్లీ (30 బంతుల్లో 10 ఫోర్లతో 54) కూడా సహకరించడంతో బెంగళూరు 6 వికెట్లతో నెగ్గింది. దీంతో 19 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన ఆర్‌సీబీ క్వాలిఫయర్-1లో పంజాబ్‌తో ఆడనుంది. 2016 తర్వాత బెంగళూరు టాప్-2లో చోటు దక్కించుకోవడం విశేషం. ఇందులో ఓడిన జట్టుకు మరో చాన్స్ ఉంటుంది. అలాగే ఐపీఎల్‌లో ఆర్‌సీబీకిదే అత్యధిక ఛేదన కావడం విశేషం. ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 3 వికెట్లకు 227 పరుగులు చేసింది. కెప్టెన్ రిషబ్ పంత్ (61 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్సర్లతో 118 నాటౌట్) శతకంతో సత్తాచాటగా, మిచెల్ మార్ష్ (37 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 67) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఛేదనలో బెంగళూరు 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 230 పరుగులు చేసి నెగ్గింది. మయాంక్ (23 బంతుల్లో 5 ఫోర్లతో 41 నాటౌట్), సాల్ట్ (19 బంతుల్లో 6 ఫోర్లతో 30) ఆకట్టుకున్నారు. ఓరౌర్కీకి 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జితేశ్ నిలిచాడు.

ముందు విరాట్.. ఆ తర్వాత జితేశ్: భారీ ఛేదనను ఆర్‌సీబీ సజావుగానే ఆరంభించింది. మొదట ఓపెనర్ విరాట్ కోహ్లీ విజయంపై ఆశలు రేకెత్తించగా.. జితేశ్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ముగించాడు. రెండో ఓవర్‌లో విరాట్ నాలుగు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. మరో ఓపెనర్ సాల్ట్ ఆరో ఓవర్‌లో వెనుదిరిగినా పవర్‌ప్లేలో జట్టు 66/1 స్కోరుతో నిలిచింది. ఇక ఎనిమిదో ఓవర్‌లో రజత్ (14), లివింగ్‌స్టోన్ (0)లను పేసర్ ఓరౌర్కీ అవుట్ చేయడంతో 90/3తో తడబడినట్టు కనిపించింది. అయితే మయాంక్ పదో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో రన్‌రేట్ తగ్గకుండా చూశాడు. 27 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాక విరాట్‌ను పేసర్ అవేశ్ వెనక్కి పంపాడు. ఈ సమయంలో మయాంక్-జితేశ్ జోడీ వేగంగా ఆడే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా జితేశ్ 14వ ఓవర్‌లో 6,4.. తర్వాతి ఓవర్‌లో 4,6,4,4తో పరుగుల వరద పారించాడు. 17వ ఓవర్‌లో హైడ్రామా నెలకొంది. తొలి బంతికే జితేశ్ అవుటైనా అది నోబ్‌గా తేలడంతో బతికిపోయాడు. ఇక అదే ఓవర్‌లో స్పిన్నర్ దిగ్వేష్ అతడిని మన్కడింగ్ కూడా చేశాడు. కానీ పంత్ అప్పీల్‌ను వెనక్కితీసుకోవడంతో నాటౌట్‌గా ప్రకటించారు. ఓ సిక్సర్‌తో 22 బంతుల్లోనే జితేశ్ హాఫ్ సెంచరీ కూడా పూర్తయ్యింది. 18వ ఓవర్‌లో అతడి 4,4,6,6తో 21 రన్స్ రావడంతో సమీకరణం 12 బంతుల్లో ఏడు పరుగులకు మారింది. దీంతో బెంగళూరు మరో 8 బంతులుండగానే నెగ్గింది.

పంత్-మార్ష్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రిషబ్ పంత్ అజేయ శతకంతో పాటు ఓపెనర్ మార్ష్ అదరగొట్టాడు. బౌలర్ ఎవరైనా బాదుడే లక్ష్యంగా ఈ జోడీ ముందుకు సాగడంతో స్కోరుబోర్డు ఉరకలెత్తింది. మార్‌క్రమ్ స్థానంలో ఆడిన అరంగేట్ర ఓపెనర్ బ్రీట్‌స్కీ (14)ని మూడో ఓవర్‌లోనే తుషార బౌల్డ్ చేశాడు. కానీ మరో వికెట్ తీసేందుకు ఆర్‌సీబీ బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన పంత్ ఈసారి ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. ఇప్పటికే జట్టు ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించిన వేళ ఎలాంటి ఒత్తిడీ లేకుండా సహజశైలిలో ఆడడం కనిపించింది. రాగానే బాదుడు ఆరంభిస్తూ నాలుగో ఓవర్‌లో 6,4,4తో 18 రన్స్ అందించాడు. దీంతో జట్టు పవర్‌ప్లేలో 55 పరుగులు సాధించింది. ఇక భువీ ఓవర్‌లో 6,4తో ఆకట్టుకున్న పంత్.. పదో ఓవర్‌లో 6,4,4తో 29 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అప్పటికి మార్ష్ ఇంకా 26 పరుగుల దగ్గరే ఉండడం గమనార్హం. కాస్త ఆలస్యంగా జోరు పెంచిన మార్ష్ పేసర్ షెఫర్డ్ వేసిన ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో 4,6 బాదాడు. అలాగే సుయాష్ ఓవర్‌లో సిక్సర్‌తో 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అటు పంత్ మాత్రం తన ధాటిని కొనసాగిస్తూ 15వ ఓవర్‌లో రెండు సిక్సర్లతో అదుర్స్ అనిపించాడు. అయితే తర్వాతి ఓవర్‌లో మార్ష్ సైతం రెండు వరుస సిక్సర్లతో ఊపు మీద కనిపించినా పేసర్ భువీకి చిక్కాడు. దీంతో రెండో వికెట్‌కు 152 పరుగుల మెరుపు భాగస్వామ్యం ముగిసింది. పంత్ మాత్రం తన ధాటిని ఆపకుండా 18వ ఓవర్‌లో రెండు ఫోర్లతో 54 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేశాడు. ఈ సంతోషంలో తను రెండు చేతులూ కింద పెట్టి తలకిందులుగా జంప్ చేస్తూ (సోమర్ సాల్ట్) సంబరాలు చేసుకున్నాడు. అలాగే ఆఖరి రెండు ఓవర్లలో 26 పరుగులు చేసిన ఎల్ఎస్‌జీ పూరన్ (13) వికెట్ కోల్పోయినా భారీ స్కోరుతో ప్రత్యర్థికి సవాల్ విసిరింది.



పంత్ శతక సంబరం

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్ష్ (సి) సుయాష్ (బి) భువనేశ్వర్ 67, మాథ్యూ బ్రీట్‌స్కీ (బి) తుషార 14, పంత్ (నాటౌట్) 118, పూరన్ (సి) యశ్ దయాల్ (బి) షెఫర్డ్ 13, అబ్దుల్ సమద్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 227/3; వికెట్ల పతనం:** 1-25, 2-177, 3-226; **బౌలింగ్:** తుషార 4-0-26-1, క్రునాల్ 2-0-14-0, యశ్ దయాల్ 3-0-44-0, భువనేశ్వర్ 4-0-46-1, సుయాశ్ 3-0-39-0, షెఫర్డ్ 4-0-51-1.

బెంగళూరు: సాల్ట్ (సి) దిగ్వేష్ (బి) ఆకాశ్ 30, కోహ్లీ (సి) బదోని (బి) అవేశ్ 54, పటీదార్ (సి) అబ్దుల్ (బి) ఓరౌర్కీ 14, లివింగ్‌స్టోన్ (ఎల్బీ) ఓరౌర్కీ 0, మయాంక్ (నాటౌట్) 41, జితేశ్ (నాటౌట్) 85, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.4 ఓవర్లలో 230/4; వికెట్ల పతనం:** 1-61, 2-90, 3-90, 4-123; **బౌలింగ్:** ఆకాశ్ 4-0-40-1, ఓరౌర్కీ 4-0-74-2, దిగ్వేష్ రాఠి 4-0-36-0, షాబాజ్ 3-0-39-0, అవేశ్ 3-0-32-1, బదోని 0.4-0-9-0.

ఐపీఎల్‌లో 5 సార్లు (2013, 2016, 2023, 2024, 2025) 600+ స్కోర్లు సాధించిన ఏకైక బ్యాటర్‌గా విరాట్. అలాగే మొత్తంగా 63 హాఫ్ సెంచరీలతో వార్నర్ (62)ను అధిగమించాడు.

1 ఆర్‌సీబీ తరఫున (ఐపీఎల్‌లో 8606, చాంపియన్స్ లీగ్ టీ20లో 424) 9000+ పరుగులు సాధించిన విరాట్.



బెదిరింపులు నిజమే

ఆధారాలున్నాయి
సన్‌రైజర్స్‌ను జగన్మోహన్ అదనపు టికెట్లు అడిగారు
నిర్ధారించిన విజిలెన్స్
హెచ్‌సీఏ పై చర్యలకు సిఫారసు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)పై చర్యలకు విజిలెన్స్ సిఫారసు చేసింది. ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఫ్రాంఛైజీపై హెచ్‌సీఏ పెద్దలు ఒత్తిడి తీసుకొచ్చినట్టు విజిలెన్స్ నిర్ధారించింది. వ్యక్తిగతంగా తనకు అడిగినన్ని టికెట్లు ఇవ్వలేదని హెచ్‌సీఏ అధ్యక్షుడు ఫ్రాంఛైజీని ఇబ్బందులకు గురిచేసినట్టు విజిలెన్స్ విచారణలో తేలింది. ఒప్పందం ప్రకారం ప్రతి మ్యాచ్‌కూ స్టేడియం కెపాసిటీలో పదిశాతం టికెట్లను సన్‌రైజర్స్ ఫ్రాంఛైజీ హెచ్‌సీఏకు ఇస్తూ వచ్చింది. అయితే అదనంగా తమకు మరో పదిశాతం టికెట్లు కావాలని, వీవీఐపీ బాక్స్‌ల్లోనూ వాటా ఇవ్వాలని హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు ఫ్రాంఛైజీపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఇలాగైతే తాము హైదరాబాద్‌ను వీడి వెళ్లిపోతామంటూ సన్‌రైజర్స్ ప్రకటన చేసిన నేపథ్యంలో దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. ఈ క్రమంలో హైదరాబాద్ రూరల్ విజిలెన్స్ విభాగం సుదీర్ఘ విచారణ జరిపి హెచ్‌సీఏ బెదిరింపులు నిజమేనని నిర్ధారించింది. వీవీఐపీ గ్యాలరీలోని బాక్స్ రూములకు తాళం వేసినదీ వాస్తవమేనని విజిలెన్స్ అధికారులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. లఖ్‌నవూ మ్యాచ్ సందర్భంగా ఈ సంఘటన జరిగినట్టు నిర్ధారించారు. దీంతో ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను అందచేసి చర్యలకు సిఫారసు చేశారు.

ప్రీ క్వార్టర్స్‌కు సింధు, ప్రణయ్



సింగపూర్: భారత ఏస్ షట్లర్లు పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్ సింగపూర్ ఓపెన్ ప్రీక్వార్టర్స్‌కు చేరుకొన్నారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో సింధు 21-14, 21-9తో వెన్ యు జాంగ్ (కెనడా)పై నెగ్గింది. మాళవిక 21-14, 18-21, 11-21తో సుపనిదా కొటగొంగ్ (థాయ్‌లాండ్) చేతిలో, అన్‌మోల్ కర్బ్ 11-21, 22-24తో చెన్ యు పీ (చైనా) చేతిలో ఓడారు. ప్రణయ్ 19-21, 21-16, 21-14తో రాస్మస్ జమ్మే (డెన్మార్క్)పై నెగ్గగా.. కిరణ్ జార్జ్ 19-21, 17-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో, ప్రియాన్షు 21-14, 10-21, 14-21తో కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడారు. మహిళల డబుల్స్‌లో కవిప్రియ-సిమ్రన్ జంట 4-21, 9-21తో కొరియా జోడీ లి సొ హి-బెక్ హ న (కొరియా) చేతిలో, మిక్స్‌డ్‌లో ధ్రువ్ కపిల-తనీషా ద్వయం 18-21, 13-21తో చైనా జంట జియాంగ్-జాంగ్ చి చేతిలో, సూర్య-అమృత ద్వయం 11-21, 17-21తో జపాన్ జంట యుచి షిమోగమి-సయాక చేతిలో ఓడారు.

సిన్నర్, జొకో ముందంజ

- జ్వెరెవ్, గాఫ్ కూడా
- ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో టాప్ సీడ్ సిన్నర్, ఆరో సీడ్ జొకోవిచ్, జ్వెరెవ్, గాఫ్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో సిన్నర్ 6-4, 6-3, 7-5తో ఆర్థర్ (ఫ్రాన్స్)పై, జొకోవిచ్ (సెర్బియా) 6-3, 6-3, 6-3తో మెకెంజీ (అమెరికా)పై, మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6-3, 6-3, 6-4తో లెర్నర్ (అమెరికా)పై, ఐదో సీడ్ డ్రేపర్ (బ్రిటన్) 3-6, 6-1, 6-4, 6-2తో మాటి (ఇటలీ)పై, రుబ్లేవ్ 6-4, 4-6, 6-4, 6-1తో హ్యారిస్ (సౌతాఫ్రికా)పై గెలిచి ముందంజ వేశారు. కాగా, 11వ సీడ్ డానిల్ మెద్వెదెవ్ 5-7, 3-6, 6-4, 6-1, 5-7తో కామెరూన్ (బ్రిటన్) చేతిలో ఓడగా.. దిమిత్రోవ్ ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కోకో గాఫ్ 6-2, 6-2తో ఒలీవియా గడెకి (ఆస్ట్రేలియా)పై, మూడో సీడ్ జెస్సికా పెగుల 6-2, 6-4తో అన్కా టొడోని (రుమేనియా)పై నెగ్గారు.

13 శాతం పెరిగిన ఎన్‌ఎండీసీ లాభం

ఒక్కో షేరుపై రూపాయి డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి చక్కటి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.23,668 కోట్ల టర్నోవర్‌పై రూ.6,693 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే టర్నోవర్ 11 శాతం, నికర లాభం 13 శాతం పెరిగాయి. మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికంలోనూ కంపెనీ రూ.7,444 కోట్ల టర్నోవర్‌పై రూ.1,496 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే టర్నోవర్ ఎనిమిది శాతం పెరిగినా, నికర లాభం నామమాత్రంగా రెండు శాతం మాత్రమే పెరిగింది. అయినా 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు ఒక్కో షేరుపై రూపాయి చొప్పున తుది డివిడెండ్‌గా చెల్లించాలని ఎన్ఎండీసీ బోర్డు సిఫారసు చేసింది. ఇంతకు ముందు చెల్లించిన రూ.2.3 మధ్యంతర డివిడెండ్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటే 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ ఒక్కో షేరుపై రూ.3.3 చొప్పున డివిడెండ్ చెల్లించినట్టవుతుంది. రూపాయి ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై ఇది 330 శాతానికి సమానం.

ఇన్‌స్టామార్ట్ రీ బ్రాండింగ్

- **స్విగ్గీ పేరు తొలగింపు**

న్యూఢిల్లీ: క్విక్‌కామర్స్ సేవల ప్లాట్‌ఫామ్ 'స్విగ్గీ ఇన్‌స్టామార్ట్' పేరు మార్చుకుంది. తన మాతృ సంస్థ 'స్విగ్గీ' పేరును వదిలించుకుని కేవలం 'ఇన్‌స్టామార్ట్'గా కొత్త అవతారమెత్తింది. సరికొత్త లోగోను సైతం ఆవిష్కరించింది. శరవేగంగా వృద్ధి చెందుతున్న క్విక్ కామర్స్ రంగంలో స్వతంత్ర బ్రాండ్‌గా గుర్తింపు సాధించేందుకు వ్యూహాత్మకంగా ఈ రీబ్రాండింగ్ జరిపినట్టు తెలిసింది.

ఎల్ఐసీ లాభం రూ.19,013 కోట్లు

రూ.12 చొప్పున తుది డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎల్ఐసీ ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికంలో చక్కటి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ రూ.19,013 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే లాభం 38 శాతం పెరిగింది. అయితే ఇదే కాలంలో కంపెనీ స్థూల ఆదాయం మాత్రం రూ.2,50,928 కోట్ల నుంచి రూ.2,41,625 కోట్లకు పడిపోయింది. అయినా వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.12 చొపున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

ప్రీమియం ఆదాయం: గత ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంతో పోలిస్తే ఈ సంవత్సరం తొలి ఏడాది ప్రీమియం ఆదాయం రూ.13,810 కోట్ల నుంచి రూ.11,069 కోట్లకు పడిపోయింది. ఇదే సమయంలో రెన్యూవల్ ప్రీమియం ఆదాయం మాత్రం రూ.77,368 కోట్ల నుంచి రూ.79,138 కోట్లకు చేరింది.

సంవత్సరం మొత్తానికి: 202425 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఎల్ఐసీ రూ.48,151 కోట్ల నికర లాభం నమోదు చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఆర్జించిన రూ.40,676 కోట్లతో పోలిస్తే ఇది ఇది 18 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.8,53,707 కోట్ల నుంచి రూ.8,84,148 కోట్లకు చేరింది.

రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులు: 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ ఈక్విటీ మార్కెట్‌లో రూ.1.85 లక్షల కోట్లు పెట్టుబడిగా పెట్టింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 41 శాతం ఎక్కువ. ఇవిగాక రుణ పత్రాల్లోనూ రూ.80,000 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. పెట్టుబడుల విక్రయం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.73,000 కోట్ల రాబడులు ఆర్జించినట్టు కంపెనీ తెలిపింది. ఈ సంవత్సరం పెట్టుబడులు మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని పేర్కొంది.

రూ.54.52 లక్షల కోట్ల ఆస్తులు

గత ఏడాది మార్చి నాటికి రూ.51,21,887 కోట్లుగా ఉన్న ఎల్ఐసీ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) ఈ ఏడాది మార్చి నాటికి రూ.54,52,297 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరానికి పాలసీదారులకు బోనస్ కోసం కంపెనీ రూ.56,190.24 కోట్లు కేటాయించింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.3,234.37 కోట్లు ఎక్కువ.

బీఎస్ఎన్ఎల్‌కు రెండో వరుస లాభం

18 సంవత్సరాల తర్వాత ఇదే ప్రథమం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని టెలికం కంపెనీ బీఎస్ఎన్ఎల్ లాభాల బాటలో కొనసాగుతోంది. మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో రూ.280 కోట్ల లాభం నమోదు చేసింది. అంతకు ముందు డిసెంబరు త్రైమాసికంలో కూడా సంస్థ రూ.262 కోట్ల నికర లాభం ప్రకటించింది. 2007 తర్వాత బీఎస్ఎన్ఎల్ వరుసగా రెండు త్రైమాసికాలు నికర లాభాలు ఆర్జించడం ఇదే మొదటిసారని కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.849 కోట్ల నికర నష్టాలు చవిచూసింది.

ఏడాది మొత్తంలో తగ్గిన నష్టం: మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూస్తే మాత్రం బీఎస్ఎన్ఎల్‌కు నష్టాలు తప్పలేదు. అయితే 2023-24తో పోల్చితే నష్టం రూ.5,370 కోట్ల నుంచి రూ.2,247 కోట్లకు తగ్గింది. అంటే నష్టం 58 శాతం తగ్గిందన్న మాట. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మూడు సర్కిల్స్ మాత్రమే లాభాలు నమోదు చేయగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 10 సర్కిల్స్ లాభాలు నమోదు చేసినట్టు సింధియా చెప్పారు. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం 10 శాతం పెరిగి రూ.23,400 కోట్లకు, నిర్వహణ ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.20,841 కోట్లకు చేరాయని సింధియా చెప్పారు.

మెడ్‌ప్లస్ లాభం రూ.13.98 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ నాలుగో త్రైమాసికంలో రూ.13.98 కోట్ల స్టాండ్ అలోన్ లాభం ప్రకటించింది. ముందు ఏడాది ఇదే కాలంలో కంపెనీ 9.83 కోట్ల లాభం నమోదు చేసింది. ఆదాయం సైతం రూ.150.27 కోట్ల నుంచి రూ.204.46 కోట్లకు చేరింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూసినా కంపెనీ ఆదాయం రూ.473.34 కోట్ల నుంచి రూ.722.03 కోట్లకు, నికర లాభం రూ.9.44 కోట్ల నుంచి రూ.40.33 కోట్లకు పెరిగాయి.

ప్రపంచ టాప్ 12 టెక్ కేంద్రాల్లో బెంగళూరు

న్యూఢిల్లీ: బెంగళూరులో టెక్ నిపుణుల సంఖ్య 10 లక్షలు దాటింది. దీంతో ప్రపంచంలోని 12 అగ్రశ్రేణి టెక్నాలజీ కేంద్రాల్లో బెంగళూరు ఒకటిగా మారింది. రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ కంపెనీ సీబీఆర్ఈ ఒక నివేదికలో ఈ విషయం వెల్లడించింది. టెక్నాలజీ నిపుణుల లభ్యత, నాణ్యత, వ్యయాల ఆధారంగా టెక్నాలజీ కేంద్రాలను మూడుగా వర్గీకరించారు. పవర్‌హౌస్ (అత్యంత పోటీ సామర్థ్యం కలిగి ఉన్న 12 మార్కెట్లు), ఎస్టాబ్లిష్డ్ (ప్రతిభావంతులైన నిపుణులు నిలకడగా అందుబాటులో గల 63 పరిణతి చెందిన మార్కెట్లు), ఎమర్జింగ్ (సామర్థ్యాలు విస్తరించుకుంటున్న 40 వర్థమాన మార్కెట్లు) ఈ వర్గీకరణలో ఉన్నాయి. ఇందులో పవర్‌హౌస్ విభాగంలో బెంగళూరు నిలిచింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో టెక్నాలజీ నిపుణులు 10 లక్షలు దాటిన ఇతర నగరాలు బీజింగ్, షాంఘై మాత్రమేనని సీబీఆర్ఈ చైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ అన్నారు. డిజిటల్ ఇన్నోవేషన్, ఏఐ విభాగాల్లో భారతదేశ వ్యూహాత్మక స్థానానికి బెంగళూరు టాప్ 12లో చేరడం ఒక నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

రెండు రోజుల లాభాలకు బ్రేక్

625 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో రెండు రోజుల ర్యాలీకి అడ్డుకట్ట పడింది. బ్యాంకింగ్, ఐటీ, ఆటో షేర్లలో మదుపరులు లాభాలు స్వీకరించడంతో సెన్సెక్స్ మంగళవారం 624.82 పాయింట్లు క్షీణించి 81,551.63 వద్దకు జారుకుంది. ఒకదశలో సూచీ 1,054 పాయింట్లు కోల్పోయి 81,121.70 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 174.95 పాయింట్లు పతనమై 24,826.20 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 నష్టపోగా.. అల్ట్రాటెక్ సిమెంట్ షేరు 2.29 శాతం పతనమై సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. కాగా ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 30 పైసలు తగ్గి రూ.85.40 వద్ద ముగిసింది.

ఇండిగోలో గంగ్వాల్ రూ.11,564 కోట్ల వాటా విక్రయం

న్యూఢిల్లీ: ఇండిగో ఎయిర్‌లైన్స్ మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రమోటర్లలో ఒకరైన రాకేశ్ గంగ్వాల్, ఆయన కుటుంబ ట్రస్ట్ కలిసి సంస్థలో 5.7 శాతం వాటాను రూ.11,564 కోట్లకు విక్రయించారు. 5.7 శాతం వాటాకు సమానమైన 2.21 కోట్ల షేర్లను రూ.5,230.50 చొప్పున విక్రయించినట్లు తెలిసింది. ఈ లావాదేవీకి ముందు కంపెనీలో గంగ్వాల్, ఆయన కుటుంబ ట్రస్ట్‌కు 13.5 శాతం వాటా ఉండేది. ఇండిగో మరో ప్రమోటర్ రాహుల్ భాటియాతో విబేధాల నేపథ్యంలో గంగ్వాల్ తన వాటాను క్రమంగా తగ్గించుకుంటూ వస్తున్నారు.

ఐబీఎంలో 8,000 ఉద్యోగాలు ఉఫ్

న్యూయార్క్: భారీగా ఉద్యోగులను తొలగిస్తున్న అమెరికన్ టెక్ దిగ్గజాల్లో ఐబీఎం కూడా చేరింది. ఈ సంస్థ 8,000 ఉద్యోగులను తొలగించినట్టు తెలిసింది. అందులో మెజారిటీ సిబ్బంది మానవ వనరుల (హెచ్ఆర్) విభాగానికి చెందినవారే. ఐబీఎం ఈమధ్యనే 200 హెచ్ఆర్ ఉద్యోగాలను ఏఐ ఏజెంట్లతో భర్తీ చేసింది. కొద్ది రోజులకే ఈ విభాగంలో భారీగా తీసివేతలకు పూనుకోవడం గమనార్హం.

ఐటీ రిటర్న్‌ల గడువు పెంపు

న్యూఢిల్లీ: 2025-26 పన్ను మదింపు సంవత్సరానికి ఐటీ రిటర్న్‌ల దాఖలు గడువును ఆదాయపు పన్ను శాఖ జూలై 31 నుంచి సెప్టెంబరు 15 వరకు పొడిగించింది. వ్యక్తిగత ఐటీ చెల్లింపుదారులు, అవిభక్త హిందూ కుటుంబాలు, తమ అకౌంట్స్‌ను ఆడిట్ చేయించాల్సిన అవసరం లేని సంస్థలకు ఈ వెసులుబాటు వర్తిస్తుందని సీబీడీటీ తెలిపింది. ఐటీఆర్ ఫారాల్లో చేసిన మార్పులు, చేర్పులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది.

మ్యూచువల్ ఫండ్ వ్యాపారంలోకి జియో ఫైనాన్షియల్



న్యూఢిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జేఎఫ్ఎస్ఎల్) మ్యూచువల్ ఫండ్ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించేందుకు సెబీ ఆమోదం తెలిపింది. ఈ వ్యాపారం కోసం అమెరికాకు చెందిన బ్లాక్‌రాక్, జేఎఫ్ఎస్ఎల్ కలిసి 'జియో బ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో సమ భాగస్వామ్య కంపెనీని ఏర్పాటు చేశాయి. కాగా, 'జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్'కు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీతో పాటు దీనికి అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా వ్యవహరించేందుకు జియో బ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సెబీ అనుమతులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో జేఎఫ్ఎస్ఎల్ షేరు బీఎస్ఈలో 3.46 శాతం లాభపడి రూ.291.50 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	525
వరంగల్	517	గోదావరి	510
చిత్తూరు	603	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	117
కరీంనగర్	115	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	105
కర్నూలు	115	నెల్లూరు	110
విశాఖపట్నం	111	అనంతపురం	110
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,130 ▲	89,950 ▲	1,11,000 ▲
విజయవాడ	99,000 ▼	93,500 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	98,350 ▼	89,950 ▲	1,11,000 ▲
రాజమండ్రి	97,470 ▼	89,350 ▼	1,00,300 ▼
ప్రొద్దుటూరు	96,000 ▼	88,320 ▼	98,900 ▼
ముంబై	95,150 ▼	87,160 ▼	96,525 ▼

ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరపండి

- పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు
- విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లిన మాజీ మంత్రి

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయాలతోపాటు నియోజకవర్గాలు, పట్టణాలు, మండలాల్లో జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఎగురవేసి పెద్దఎత్తున సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా, వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మృతి పట్ల కేటీఆర్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లండన్, అమెరికాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కేటీఆర్ మంగళవారం విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

జూన్ 2న కవిత కొత్త పార్టీ పెట్టొచ్చు!

- షర్మిలక్కలా పాదయాత్ర చేస్తుందేమో..?: రఘునందన్‌రావు

తూప్రాన్, మే 27 (ఆంధ్రజ్యోతి): 'షర్మిలక్క చేసినట్లు పాదయాత్ర చేద్దామని, కొత్త పార్టీ పెట్టుకుందామని కల్వకుంట్ల కవిత నిర్ణయం తీసుకున్నట్లు కనబడుతుంది. బహుశా జూన్ 2న ఆమె కొత్త పార్టీ పెట్టొచ్చు' అని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తండ్రీకూతురు.. అన్నాచెల్లెల కొట్లాట.. ఏమైందో పక్క (ఏపీ) రాష్ట్రంలో చూశామని, ఈ రాష్ట్రంలో గదే అయితదని వ్యాఖ్యానించారు. గతంలో అక్క(షర్మిల) చెప్పింది కదా.. పాదాల మీద నడిస్తే పాదయాత్ర అని, ఇప్పుడు చెల్లె (కవిత) ఈ రాష్ట్రంలో కూడా పాదయాత్ర చేస్తుండొచ్చని పేర్కొన్నారు. సామాజిక తెలంగాణ అనో.. మహిళలకు అన్యాయం జరిగిందనో.. కవిత మాట్లాడితే బాధ అనిపిస్తదని అన్నారు. బీసీలకు అవమానం జరిగిందని ఈరోజు కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పుడు దేవుళ్లు.. దయ్యాల గురించి మాట్లాడుతున్నారని, పన్నెండేళ్లుగా ఈ విషయం గురించి ఎందుకు మాట్లాడలేదని రఘునందన్ ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రజలను అవమానించిన కాంగ్రెస్: లక్ష్మణ్

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మూడు రోజులు ఉన్నా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఇందుకు కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనపై "అప్రకటిత ఎమర్జెన్సీ" అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను లక్ష్మణ్ ఖండించారు. వివిధ అవినీతి కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత నిజాయతీపరులైతే తమ పదవులకు రాజీనామా చెయ్యాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు.

రెవెన్యూ రికార్డులో పేరు ఉంటే.. భూమిపై హక్కు ఉన్నట్టు కాదు: హైకోర్టు

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల్లో పేర్లు ఎక్కినంత మాత్రాన ఎలాంటి హక్కు లేదా టైటిల్ సంక్రమించదని హైకోర్టు స్పష్టం చేసింది. భూమి వర్గీకరణ, పంటల స్వభావం, భూమి శిస్తు (పన్ను) కోసం మాత్రమే పహాణీల్లో పేర్ల నమోదు లేదా రెవెన్యూ ఎంట్రీలు ఉపయోగపడతాయని పేర్కొంది. రెవెన్యూ రికార్డుల్లో ఎంట్రీలను ఎప్పుడూ రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్ఓఆర్)గా భావించరాదని తెలిపింది. రెవెన్యూ ఎంట్రీల వల్ల ఎలాంటి హక్కులు సంక్రమించబోవని, ప్రస్తుతం ఉన్న హక్కులు హరించుకొని పోవని పేర్కొంది. భూమిపై హక్కు ఎవరిది అనేది సంబంధిత సివిల్ కోర్టులోనే తేలుతుందని స్పష్టంచేసింది. పెద్దపల్లిలోని ఓదెల గ్రామంలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి చెందిన 14.05 ఎకరాల భూమికి సంబంధించి 2018లో పట్టాదారు పాస్ పుస్తకాలు జారీచేసి.. ఆ తర్వాత తమ పేర్లను తొలగించడం చెల్లదని పేర్కొంటూ ఆలయ పూజారి ఆరుట్ల నర్సింహాచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. ఆ వివాదాన్ని ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో తేల్చుకోవాలని సూచించింది.

వేబిల్లులో పేర్కొన్న వస్తువులు ఉంటే.. వాహనాన్ని వదిలేయాలి: హైకోర్టు

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ట్యాక్స్ ఇన్వాయిస్, వేబిల్లులో పేర్కొన్న వస్తువులనే రవాణా చేస్తుంటే అలాంటి వాహనాలను వదిలేయాలని హైకోర్టు తెలిపింది. అలా కాకుండా ఇతర స్వభావం ఉన్న వస్తువులు అయితే చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. చట్టబద్ధంగా ట్యాక్స్ ఇన్వాయిస్, వేబిల్లుతో రవాణా చేస్తున్న సరుకుల లారీని తెలంగాణ పోలీసులు పట్టుకోవడంపై ఏపీలోని నరసరావుపేటకు చెందిన కనుమూరి సునందం హైకోర్టులో సవాల్ చేశారు. పోలీసులు తమ వాదన వినిపిస్తూ ఇన్‌వాయిస్‌లో కటింగ్ చేసిన గ్రానైట్ రాయి అని పేర్కొన్నారని, కానీ వాహనంలో కటింగ్ చేయని గ్రానైట్ ఉందని తెలిపారు. వాదనలు విన్న జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. ఇన్వాయిస్‌లో ఉన్న ప్రకారం వస్తువులుంటే వదిలేయాలని.. లేనిపక్షంలో చర్యలు తీసుకోవాలని తెలిపింది.

నకిలీ ఏసీబీ అధికారులతో జాగ్రత్త: ఏసీబీ డీజీ

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారులమంటూ ఎవరైనా అనుమానాస్పద ఫోన్లు చేస్తే ప్రభుత్వ ఉద్యోగులు వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీజీ విజయకుమార్ తెలిపారు. ఏసీబీ అధికారులెవ్వరూ ఇటువంటి ఫోన్లు చేయరని స్పష్టం చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లా టేకులపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఏసీబీ అధికారినంటూ డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదయిందని ఆయన తెలిపారు. ఏసీబీ అధికారులమంటూ బెదిరింపులకు పాల్పడితే బాధితులు ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

పోలవరం బ్యాక్ వాటర్ ముంపుపై భేటీ రద్దు

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురయ్యే రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోదీ బుధవారం నిర్వహించనున్న వర్చువల్ సమావేశం రద్దయింది. ప్రగతి ఎజెండా నుంచి పోలవరం అంశం తొలగించారు. పోలవరం ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సీఎంలతో మోదీ చర్చించి, సమస్యకు పరిష్కారం చూపిస్తారని అధికారులు ఆయా రాష్ట్రాలకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుతో తెలంగాణకు జరుగుతున్న నష్టాన్ని వివరించేందుకు రాష్ట్ర అధికారులు ఎజెండాను సిద్ధం చేశారు. కాగా, అర్ధాంతరంగా సమావేశపు ఎజెండా నుంచి పోలవరం ముంపు అంశం మాయం కావడం విస్మయం కలిగించింది.

సాంకేతిక కారణాలతో ఆర్టీసీ కొలువుల భర్తీలో జాప్యం: సజ్జనార్



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి): "ఆర్టీసీలో 3036 పోస్టుల భర్తీకి సర్కారు అనుమతినిచ్చింది. అయితే.. సాంకేతిక కారణాలతో రిక్రూట్‌మెంట్‌లో జాప్యం నెలకొంటోంది. నియామకాలు కచ్చితంగా జరుగుతాయి. ఈ విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదు" అని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో రాష్ట్రస్థాయి ఉద్యోగుల సంక్షేమ మండలి(ఈడబ్ల్యూబీ) సభ్యులతో యాజమాన్యం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సజ్జనార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి వెల్ఫేర్ బోర్డు సభ్యుల సూచనలు, సలహాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు ఉద్దేశపూర్వకంగా.. తమ మనుగడ కోసం రెచ్చగొట్టేవిధంగా మాట్లాడుతున్నారని.. ఉద్యోగులు ఈ విషయాన్ని గ్రహించి, ఎంతో ఓపికగా ఉన్నారని చెప్పారు.మహాలక్ష్మి పథకం అమలుతో సిబ్బందిపై పెరిగిన పనిభారాన్ని తగ్గించేందుకు తాత్కాలికంగా డ్రైవర్, కండక్టర్ పోస్టులకు నియామకాలు చేపడుతున్నామన్నారు.

తండ్రి చనిపోయిన 19 ఏళ్లకు కారుణ్య నియామకం

- 1996లో హెడ్ కానిస్టేబుల్ మృతి
- కారుణ్య నియామకానికి అప్పట్లోనే ఆయన కూతురు రాజశ్రీ దరఖాస్తు
- తిరస్కరించిన గత ప్రభుత్వాలు
- స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్
- జూనియర్ అసిస్టెంట్‌గా నియామకం

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి) కారుణ్య నియామకం కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఆమె, ఎట్టకేలకు సాధించింది. తండ్రి చనిపోయిన 19 ఏళ్ల తర్వాత ఆమెకు కారుణ్య నియామకం లభించింది. ఆమెకు హోం శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియామక ఉత్తర్వులు ఇచ్చి ఆ కుటుంబంలో సంతోషం నింపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. వరంగల్‌కు చెందిన భీమ్ సింగ్, పోలీసు శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 1996 సెప్టెంబరు 24న మృతిచెందారు. కారుణ్య నియామకం కోసం ఆయన కూతురు రాజశ్రీ దరఖాస్తు చేసుకుంది. వివిధ సాంకేతిక కారణాలు చూపిస్తూ గత ప్రభుత్వాలు ఆమెకు ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించాయి. కారుణ్య నియామకానికి సంబంధించి రాజశ్రీ ఎన్నోసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మానవతా దృక్పథంతో స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి నిబంధనలు సడలించైనా ఉద్యోగం ఇవ్వాలని సీఎంవో అధికారులకు ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు హోంశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా రాజశ్రీని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కారుణ్య నియామకం కల్పించినందుకు రాజశ్రీ తన కుటుంబంతో కలిసి వచ్చి సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.



రాజశ్రీకి నియామక పత్రం అందజేస్తున్న సీఎం రేవంత్



లింగంపల్లి అండర్ బ్రిడ్జి కింద నడుములోతు నిలిచిపోయిన వరదనీరు



భూపాలపల్లి జిల్లా చింతకానిలో మునిగిపోయిన మల్చింగ్ కూరగాయల పంట

నేడూ రేపు అతి భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు దక్షిణ తెలంగాణలోని మహబూబ్‌నగర్ వరకూ నైరుతి రుతు పవనాలు విస్తరించాయని వెల్లడించింది. మంగళవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినా దాని ప్రభావం రాష్ట్రంపై ఉండదని తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి తరలించిన ధాన్యం నీట మునిగింది. పలు జిల్లాల్లో వానాకాలం సీజన్ కోసం సిద్ధం చేసుకున్న ఎరువుల బస్తాలు తడిసి ముద్దవ్వగా, లోతట్టు ప్రాంతాలు వరదమయం అయ్యాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు-రామచంద్రాపురంలో అత్యధికంగా 7.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో ప్రధాన రహదారులన్నీ జలమయం కావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద ముంచెత్తిన వరద నీటిలో మునిగిన వాహనాలను కష్టం మీద బయటకు తీసుకొచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో 9.7 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ స్థాయి కంటే 8.3 మి.మీ ఎక్కువ. అత్యధికంగా ఉట్నూర్ మండలంలో 29.5మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన జొన్నలు తడిసి ముద్దయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలుచోట్ల వాగులు పొంగి పొర్లాయి. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం కాశీంపేటలో 114.3 మి.మీ, రాజన్న-సిరిసిల్ల జిల్లా వేములవాడలో 102.5 మి.మీ, జగిత్యాల జిల్లా తిరుమలాపూర్‌లో 101 మి.మీ వర్షపాతం రికార్డయింది. కొడిమ్యాల-సూరంపేట మధ్య బుగ్గవాగు పొంగడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కథలాపూర్ మండలం పెగ్గెర్లలో పాఠశాల ప్రహరీగోడ కూలిపోయింది. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో 500 బస్తాల ధాన్యం తడిసిపోయింది. సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాకలో పిడుగు పడటంతో దాసరి లక్ష్మణ్ (35) అనే పశువుల కాపరి మృతి చెందాడు. మంచిర్యాల జిల్లా నెన్నెల సమీపంలోని ఎర్రవాగు ఉప్పొంగి తాత్కాలిక వంతెన కొట్టుకుపోగా ఆరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం చింతకానిలో లక్ష్మారెడ్డి అనే రైతు మల్చింగ్‌తో వేసిన కూరగాయల తోట నీటిమయం కావడంతో భారీ నష్టం వాటిల్లింది. మహదేవ్‌పూర్ మండల పరిధిలోని కాళేశ్వరంలో గోదావరిలోకి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరింది. నారాయణపేట జిల్లాలో అత్యధికంగా దామరగిద్ద మండలంలో 67.0 మి.మీ, సూర్యాపేట జాజిరెడ్డిగూడెంలో అత్యధికంగా 10.2 సెం.మీ, యాదాద్రి-భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో 5.2 సెం.మీ, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి నెమ్మానిలో 1.5 సెం.మీ వర్షపాతం నమోదైంది.

నైరుతిలో పుష్కలంగా వర్షాలు

విశాఖపట్నం, మే 27(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవనున్నాయి. జూన్ నుంచి సెప్టెంబరు వరకూ తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, ఈశాన్యలో ఎక్కువ ప్రాంతాలు, వాయవ్యంలో జమ్మూకశ్మీర్ మినహా దేశంలోని అన్ని ప్రాంతాల్లో దీర్ఘకాల సగటుకు 106 శాతం వర్షపాతం నమోదు కానుంది. ఈ మేరకు నైరుతి రుతుపవనాల సీజన్‌కు రెండో దశ అంచనా బులెటిన్‌ను భారత వాతావరణ శాఖ మంగళవారం విడుదల చేసింది. నాలుగు నెలల దీర్ఘకాలిక సగటు (1971 నుంచి 2020 వరకూ 87 సెం.మీ)లో ఈసారి 105 శాతం(నాలుగు శాతం అటుఇటుగా) నమోదవుతుంది. దేశంలో దక్షిణ, మధ్య భారతాల్లో దీర్ఘకాల సగటు కంటే 10 శాతం ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. తమిళనాడులో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది.

రంగంలోకి ఈడీ

- ఏపీ మద్యం స్కామ్‌లో కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ
- బెజవాడలో సిట్ అధికారులతో భేటీ
- ఉమ్మడిగా దర్యాప్తు చేయాలని నిర్ణయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీ మద్యం కుంభకోణంలో 'అంతిమ లబ్ధిదారు' ఎవరు? పక్కా ఆధారాలతో సహా తేల్చేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా రంగంలోకి దిగింది. ఈ కేసు విచారణలో పరస్పరం సహకారం అందించుకోవాలని సిట్, ఈడీ నిర్ణయించాయి. మూడున్నర వేల కోట్ల రూపాయల స్కామ్‌లో పేద ప్రజల నుంచి పిండుకుని దాచుకున్న అసలు దొంగకు ఉమ్మడిగా ఉచ్చు బిగించేందుకు సిద్ధమవుతున్నాయి. మంగళవారం విజయవాడలోని 'సిట్' కార్యాలయంలో ఈ దిశగా కీలక ముందడుగు పడింది. సిట్ బృందంతో ఈడీ అధికారులు భేటీ అయ్యారు. ముడుపులు సేకరించిన తీరు మొదలుకొని వాటిని మళ్లించిన దారుల వరకు సిట్ అధికారులు ఈడీకి వివరించారు. డిస్టిలరీస్ నుంచి తీసుకున్న కమీషన్లు నగదు రూపంలో ఎంత? బంగారం రూపంలో ఎంత? దుస్తులు, ఇతర గిఫ్ట్‌ల ఇన్వాయిస్‌ల ద్వారా ఏ కంపెనీ ఎవరెవరికి ఎంత చేర్చింది? అనే వివరాలు అందించారు. ప్రమోషనల్ గూడ్స్ రూపంలో హైదరాబాద్, ముంబై, ఢిల్లీలోని హవాలా ఆపరేటర్ల ద్వారా మనీలాండరింగ్ జరిగినట్లు నిర్ధారణకు వచ్చిన కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల అధికారులు ఉమ్మడి దర్యాప్తు చేయాలని నిర్ణయించారు. ఇటీవల ముంబైలో సిట్ అధికారులకు ఈడీ అధికారులు సహకరించారు. అలాగే ముడుపులు చేరిన మార్గం, అంతిమ లబ్ధిదారుడి గుట్టు రట్టు చేసేందుకు ఇప్పుడు సహకరించనున్నారు. మొత్తం కుంభకోణం ఎలా జరిగిందనే దానిపై సిట్ ప్రత్యేక నోట్ సిద్ధం చేసింది. ఈ వివరాలను ఈడీ అధికారులతో పంచుకుంది. రియల్ ఎస్టేట్ లింకులతో పాటు బినామీల ద్వారా బెంగళూరులో కొనుగోలు చేసిన భారీ ఆస్తుల వివరాలతో కూడిన ఐదు లేయర్ల డేటాను ఈడీకి అందజేసింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ సిట్, ఈడీ అధికారులు చర్చించారు.

యువతకు ఉపాధి కల్పన, మహిళా సాధికారత పార్టీ ఘనతే

మహానాడులో తెలంగాణ టీడీపీ తీర్మానాలు

రాష్ట్రం నుంచి 1500మంది ప్రతినిధుల హాజరు

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పన, మహిళా సాధికారత టీడీపీ ఘనతే అని తెలంగాణ టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. కడపలో జరుగుతున్న మహానాడులో తెలంగాణ టీడీపీ నాలుగు తీర్మానాలు ప్రతిపాదించింది. యువత, మహిళ, వ్యవసాయ రంగాలతో పాటు సంక్షేమ రంగం-తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలపై మరో తీర్మానం ప్రతిపాదించింది. ఆయా రంగాలకు సంబంధించి ఉమ్మడి ఏపీలో టీడీపీ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలు-వాటితో కలిగిన ప్రయోజనాలను ప్రస్తావించింది. రాష్ట్ర పార్టీ నాయకత్వం ఇటీవల సమావేశమై సంస్థాగత బలోపేతంపై మరో ప్రతిపాదన కేంద్ర పార్టీకి నివేదించింది. దీనిని పార్టీ ఉమ్మడి తీర్మానంలో చేర్చారని టీడీపీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ నుంచి 1,500 మంది ప్రతినిధులు మహానాడుకు హాజరవుతున్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు, జాతీయ అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న, పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్‌గౌడ్, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు నందమూరి సుహాసిని, మాజీ ఎమ్మెల్యేలు కాట్రగడ్డ ప్రసూన, బండి పుల్లయ్యతో పాటు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు కూడా కడపకు తరలివెళ్లారు.

ఏపీలో రాష్ట్ర పండుగగా ఎన్టీఆర్ జయంతి

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా మే 28ని ఏపీ రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులు, జిల్లా కలెక్టర్లు ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

మీ త్యాగాలతోనే అధికారం!

కార్యకర్తల పోరాటాలతోనే ఈ స్థానం.. కడప మహానాడు వేదికగా.. శిరస్సు వంచి పాదాభివందనం

- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- తెలుగు ప్రజల భవిష్యత్తు కోసం.. ఆరు శాసనాలను ప్రతిపాదించిన లోకేశ్

(మహానాడు ప్రాంగణం నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



మహానాడులో చంద్రబాబు, లోకేశ్

"మీరు చేసిన పోరాటాలే నేటి ఈ అధికారం. మీ త్యాగాలే నేటి ఈ స్థానం" అని టీడీపీ కార్యకర్తలనుద్దేశించి ఆ పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ 'చైతన్య రథం' నుంచి తాను చేపట్టిన 'వస్తున్నా మీ కోసం', లోకేశ్ 'యువగళం' పాదయాత్ర వరకు కార్యకర్తల్లో అదే పోరాట స్ఫూర్తి ఉందని చెప్పారు. గత ప్రభుత్వం హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులు, విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి, ఇబ్బందులు పెట్టారని.. అయినా ఎత్తిన జెండా దించకుండా పోరాడారంటూ కార్యకర్తలను ప్రశంసించారు. టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా మూడ్రోజులు నిర్వహించే మహానాడు మంగళవారం కడప శివార్లలో ప్రారంభమైంది. మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యాతగా సభ మొదలైంది. తొలుత తన ఐడీకార్డును చూపి, పేరు నమోదు చేసుకున్నాకే చంద్రబాబు వేదికపైకి వచ్చారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం గడిచిన ఐదేళ్లలో వైసీపీ పాలనలో అకృత్యాలకు అసువులు బాసిన కార్యకర్తలు, నాయకులు, పహల్గాం ఉగ్రదాడి మృతులు, ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన వీర సైనికులకు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజల జీవితాలను ప్రభావితం చేసిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. "అభివృద్ధి అంటే మన పార్టీ ఆవిర్భావానికి ముందు, తర్వాత అని చెప్పుకోవచ్చు. పాజిటివ్ పాలిటిక్స్‌తో రాజకీయాల్లో విలువలు పెంచిన ఏకైక పార్టీ టీడీపీ. తెలుగురాష్ట్రాల్లో ఏ పార్టీలో చూసినా టీడీపీ యూనివర్సిటీ విద్యార్థులే ఉన్నారంటే అదీ మన పార్టీ సత్తా. ఒక ప్రాంతీయ పార్టీగా కోటి సభ్యత్వాలను 45 రోజుల్లో పూర్తిచేశాం" అని అన్నారు. ఉమ్మడి కడపలో 10కి 7 అసెంబ్లీ సెగ్మెంట్లను సాధించామని, ఈసారి అన్నింటినీ గెలవాలని ఆకాంక్షించారు. ఎవరెన్ని మాట్లాడినా.. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసితీరుతామని చెప్పారు. రాజా ఆఫ్ కరెప్షన్ పేరుతో రూ.లక్షల కోట్ల అవినీతిపై టీడీపీ చేసిన పోరాటం నిజమని తేలిన విషయాన్ని గుర్తుచేశారు. "హైదరాబాద్ ఓఆర్ఆర్, ఇందూ, లేపాక్షి భూములు, ఓబుళాపురం అక్రమ మైనింగ్‌పై మనం చేసిన ఉద్యమం నాడు దేశంలోనే ఓ సంచలనం. ఓబుళాపురం కేసులో ఇన్నేళ్ల తర్వాత నిందితులకు శిక్షలు పడ్డాయి. గత ప్రభుత్వాల అవినీతి ఒక ఎత్తయితే.. వైసీపీ అక్రమాలు మరో ఎత్తు. కూటమి సర్కారు విధ్వంస పాలకుల స్కాములు లెక్కిస్తున్నాం. ఎవరు అవినీతికి పాల్పడ్డా విడిచిపెట్టం. డిజిటల్ కరెన్సీని ప్రవేశపెట్టి, అవినీతిని అంతమొందించడంపై ప్రధానికి ఓ నివేదిక ఇచ్చాను" అని వివరించారు.

ఆరు శాసనాలు

మారుతున్న కాలానికి, ఆలోచనా విధానానికి అనుగుణంగా ప్రజలకు, పార్టీకి, కార్యకర్తలకు మంచి భవిష్యత్తు అందించాలన్న లక్ష్యంతో సరికొత్త నినాదాన్ని రూపొందించామని నారా లోకేశ్ పేర్కొన్నారు. ఇందుకోసం ఆరు శాసనాలను ప్రతిపాదించారు. తెలుగుజాతి విశ్వఖ్యాతి, యువగళం, స్త్రీశక్తి, పేదల సేవలో- సోషల్ రీఇంజనీరింగ్, అన్నదాతకు అండ, కార్యకర్తే అధినేత.. అనే శాసనాలను వివరించారు.

'మహా'రుచులు

మహానాడుకు వచ్చిన వారికోసం రాయలసీమ రుచులతో చక్కటి వంటలను తయారు చేశారు. 1500 మందితో వంటలు చేయిస్తున్నారు. తొలిరోజు 70 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు.

టీడీపీ నియమావళిలో.. ఆరు శాసనాలు

నారా లోకేశ్ ప్రతిపాదించిన ఆరు శాసనాలను పార్టీ నియమావళిలో చేర్చారు. ఈ మేరకు పార్టీ సీనియర్ నేత పరుచూరి అశోక్‌బాబు ప్రకటించారు. 2021 తర్వాత నియమావళిని సవరించడం ఇదే తొలిసారని చెప్పారు. ఆరు శాసనాల్లో 'కార్యకర్తే అధినేత' అనే ప్రతిపాదనపై తొలిచర్చ జరిగింది. కార్యకర్తలకు వేదికపై మాట్లాడే అవకాశం కల్పించారు. మహానాడులో పాల్గొనేందుకు 23 వేల మంది పార్టీ ప్రతినిధులకు ఆహ్వానాలు పంపగా.. వారంతా తొలి రోజు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అదనంగా 10వేల పైచిలుకు కార్యకర్తలు తరలివచ్చారు. మహానాడు తొలిరోజు పార్టీకి రూ.22.28కోట్ల మేర విరాళాలు వచ్చాయి. మరోవైపు టీడీపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు మంగళవారం నోటిఫికేషన్ విడుదలైంది. మహానాడు వేదికగా బుధవారం సాయంత్రం ఫలితాలను ప్రకటిస్తారు. చంద్రబాబు ఒక్కరే నామినేషన్ వేసే అవకాశాలున్నాయి.

మందకృష్ణకు పద్మశ్రీ

- రాష్ట్రపతి చేతుల మీదుగా 68 మందికి పద్మ పురస్కారాల ప్రదానం

న్యూఢిల్లీ, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెలంగాణ నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రొఫెసర్ కేఎల్ కృష్ణ, ఆర్థిక శాస్త్రం, సంస్కృత పండితుడు వదిరాజ్ రాఘవేంద్రాచార్య పంచముఖి.. పద్మశ్రీ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అందుకున్నారు. 2025కిగాను కేంద్ర ప్రభుత్వం 139 మందిని పద్మ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఇందులో 7 పద్మ విభూషణ్, 11 పద్మభూషణ్, 113 పద్మశ్రీ ఉన్నాయి. తొలి విడతగా ఏప్రిల్ 28న నిర్వహించిన కార్యక్రమంలో డి.నాగేశ్వర్ రెడ్డి, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సహా 71 మంది పద్మ పురస్కారాలను అందుకున్నారు. మిగిలిన 68 మందికి మంగళవారం నిర్వహించిన రెండో విడత కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారాలను అందజేశారు. ముగ్గురికి పద్మవిభూషణ్, తొమ్మిది మందికి పద్మభూషణ్, 56 మందికి పద్మశ్రీ ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్ పద్మవిభూషణ్, ప్రముఖ సినీ నటి, భరతనాట్య కళాకారిణి శోభన, కన్నడ సినీ నటుడు అనంతనాగ్, విశ్వహిందూ పరిషత్ మహిళా విభాగం దుర్గావాహిని వ్యవస్థాపక అధ్యక్షురాలు సాధ్వి రితంబర పద్మభూషణ్ అందుకున్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, బండి సంజయ్, అవార్డు గ్రహీతలు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణకు చెందిన సామాజిక కార్యకర్త, రాజకీయ నాయకుడైన మందకృష్ణ మాదిగ తన అవిశ్రాంత పోరాటంతో ఎస్సీ ఉపవర్గీకరణను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆమోదించడంలో కీలకపాత్ర పోషించారని అవార్డుతోపాటు అందజేసిన ప్రశంసాపత్రంలో రాష్ట్రపతి భవన్ పేర్కొంది.



వదిరాజ్ రాఘవేంద్రాచార్య



కేఎల్‌కృష్ణ



మందకృష్ణ

29న ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తాం: భట్టి

» రూ.11 వేల కోట్ల బకాయిలు చెల్లిస్తామన్నారు

» భట్టితో సమావేశం తర్వాత ఉద్యోగుల జేఏసీ వెల్లడి



హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 29న సమావేశాన్ని నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, పంచాయత్ రాజ్ కార్యదర్శి లోకేశ్‌కుమార్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్‌లతో ప్రభుత్వం సబ్-కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.! ఉద్యోగులు లేవనెత్తిన సమస్యల గురించి సబ్-కమిటీ అధికారులు మంగళవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎంకు వివరించారు. 29న సబ్-కమిటీ సమావేశంలో ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అంశాలు, వాటి పరిష్కారంపై చర్చిస్తామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం తెలిపారు. కాగా.. భట్టితో భేటీ తర్వాత ఉద్యోగుల జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. "ఉద్యోగులకు రూ.11 వేల కోట్ల బకాయిలు చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి ఇచ్చారు. ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్)ను ప్రకటిస్తామన్నారు. ఐదు డీఏలలో ఒకటి లేదా రెండింటిని అందజేస్తామని చెప్పారు" అని వివరించారు. జూన్ 2న సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రకటన చేస్తారని వెల్లడించారు.

అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో 2న యువ వికాసం పత్రాల పంపిణీ: భట్టి విక్రమార్క

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం (జూన్ 2)న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ పథకం అమలుపై మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 2 నుంచి 9వ తేదీ వరకూ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయడంతోపాటు 10-15 మధ్య ఒకేసారి శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, కలెక్టర్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లోని యువత గిగ్ వర్కర్లుగా ఉపాధి పొందడానికి వీలుగా ద్విచక్ర వాహనాల కొనుగోలుకు అవకాశమివ్వాలన్నారు. కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జూన్ 2న మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం విజయవంతానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. కాగా, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలను అంబరాన్నంటేలా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులివ్వండి: పొన్నం

న్యూఢిల్లీ, మే 27 (ఆంధ్రజ్యోతి): పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. డీపీఆర్‌ను పరిశీలించి ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలు, పర్యావరణ అనుమతులు, అటవీ భూముల క్లియరెన్స్, రోడ్ల విస్తరణ ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సిన అంశాలపై మాట్లాడారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని విన్నవించారు. మంత్రి వెంట తెలంగాణ అడ్వకేట్ ఆన్ రికార్డ్ (ఏవోఆర్) శ్రవణ్ కుమార్ ఉన్నారు.

వనమహోత్సవాన్ని ఉద్యమంగా చేపట్టాలి: సురేఖ

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా చేపట్టాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని విస్తరింపజేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరుతో చేపడుతున్నది. ఈ ఏడాది అందుకు సంబంధించిన ఏర్పాట్లపై కొండా సురేఖ సచివాలయంలో సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ సారి నైరుతి ముందే వచ్చిందని, ఈ నేపథ్యంలో అధికారులంతా సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ప్రాజెక్టు గడువులోగా పూర్తికాకపోతే సర్కారు ఆమోదం పొందాకే అనుమతులు

» 3 టిమ్స్ ఆస్పత్రుల భవనాల నిర్మాణాల్లో జాప్యం వల్లే నిర్ణయం

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు భవనాలశాఖలో ఇటీవల ఓ అకస్మాత్తు నిర్ణయం వెనుక ఉన్న మతలబు ఏమిటన్నది బహిర్గతమైంది. హైదరాబాద్ పరిధిలో నిర్మిస్తున్న మూడు టిమ్స్ ఆస్పత్రుల భవనాల నిర్మాణ పనుల్లో జాప్యం, వాటి ప్రారంభోత్సవ తేదీలు మారడమే ఇందుకు కారణమని తేలింది. కొత్తగా చేపట్టనున్న, పాత ప్రాజెక్టులు నిర్దేశిత సమయంలో పూర్తికాకపోతే.. వాటికి సర్కారు ఆమోదం పొందాకే గడువు పొడిగింపునకు అవకాశం కల్పించాలని ఆర్‌అండ్‌బీలో నిర్ణయం తీసుకున్నారు. దానికి అనుగుణంగానే సమయానికి పూర్తి కాని ప్రాజెక్టుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించి, ఆ ఫైళ్లను ప్రభుత్వం పరిశీలించి, ఆమోదించాకే గడువు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేయనున్నట్టు శాఖలో ఓ సర్క్యులర్ జారీ అయింది. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, అల్వాల్, సనత్‌నగర్‌లో తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులను నిర్మిస్తోంది. దాదాపు పనులు చివరి దశకు రావడంతో ఆర్‌అండ్‌బీ, వైద్యారోగ్య శాఖల మంత్రులు ఆయా నిర్మాణాలను పరిశీలించి జూన్ 2 నుంచి విడతల వారీగా టిమ్స్‌ను ప్రారంభిస్తామంటూ పలు వేదికల ద్వారా చెప్పారు. నిర్మాణ పరంగా 85-90% పనులు పూర్తయినప్పటికీ.. మిగిలిన పలు పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ క్రమంలోనే నిర్దేశిత సమయానికి పూర్తికాని ప్రాజెక్టులకు గడువు పొడిగింపునకు సంబంధించిన ఫైళ్లను ప్రభుత్వానికి పంపి, సర్కారు ఆమోదం తర్వాతే గడువు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేయాలనే నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

భారత్‌పై పవిత్ర యుద్ధమే లక్ష్యం!

» ఒక్కటే విశ్వాసం, ఒక్కటే సమాజమే ధ్యేయం

» రెచ్చగొట్టే భావాలతో ముస్లిం యువతకు సిరాజ్ ఎర

» విచారణలో విస్తుగొల్పే విషయాలు

విజయనగరం, మే 27(ఆంధ్రజ్యోతి): 'ఘజ్వా-ఎ-హింద్ (భారత్‌పై పవిత్ర యుద్ధం) మన లక్ష్యం. ఒక్కటే ఉమ్మా (విశ్వాసం), ఒక్కటే సమాజం.. ఇదే మన ధ్యేయం.' అనే రెచ్చగొట్టే మతోన్మాద భావాల ద్వారా సిరాజ్ సోషల్ మీడియా ఇన్‌స్ట్రాగామ్, సిగ్నల్ యాప్‌ల ద్వారా అమాయక ముస్లిం యువతకు ఎర వేసేవాడని తెలిసింది. ఈ మేరకు ఐదో రోజు మంగళవారం కొనసాగిన ఎన్‌ఐఏ, ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్, పోలీసుల విచారణలో అతడు చెప్పినట్లు సమాచారం. సిరాజ్ పోస్టులను చూసిన కొంత మంది అరబ్ దేశాల్లోని ఉగ్రమూకలు, అమాయక ముస్లిం యువకులు అతడికి దగ్గరైనట్లు సమాచారం. సిరాజ్ పెట్టిన పోస్టులను ఎవరు ఎక్కువ ఫాలో అవుతున్నారు? ఎవరు రిప్లై ఇస్తున్నారు? వారు ఎక్కడ ఉంటున్నారు? అన్న కోణాల్లో అధికారుల దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిసింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సిరాజ్, సమీర్‌ల విచారణ రాత్రి వరకు సాగింది. ఘజ్వా-ఎ-హింద్ భావనకు తాను ఆకర్షితుడయ్యానని, ఇతరులనూ ఆ వైపు మళ్లించే దిశగా చేశానని సిరాజ్ చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు వందలాది మందితో ఒక గ్రూపును తయారు చేయాలనుకున్నాట! సిరాజ్ భాష, అతనిలో భారత్‌పై ఉన్న విద్వేషం అరబ్ దేశాల్లోని కొంత మంది మతోన్మాదులకు నచ్చటంతో అతనికి ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చినట్లు తెలిసింది. వీరి మధ్య ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయనే దానితో పాటు సిరాజ్, అతని కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాలపై అధికారులు దృష్టి సారించారు.

16 ఏళ్లకే ఎవరెస్ట్ ఎక్కిన విశ్వనాథ్ కార్తికేయ

» ప్రపంచంలోనే ఎత్తయిన 7 శిఖరాలు ఎక్కిన హైదరాబాదీ

» '7 సమ్మిట్ అడ్వెంచర్' పూర్తి చేసిన తొలి భారతీయుడు

హైదరాబాద్ / బోయినపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పర్వత శిఖరం మౌంట్ ఎవరెస్ట్‌ను విశ్వనాథ్ కార్తికేయ పడకంటి అనే యువకుడు 16 ఏళ్లకే అధిరోహించాడు. దీంతో ప్రపంచంలోని 7 ఖండాల్లో అత్యంత ఎత్తయిన ఏడు శిఖరాలను అధిరోహించి '7 సమ్మిట్ అడ్వెంచర్' పూర్తి చేశాడు. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన రెండో పిన్న వయస్కుడిగా, తొలి భారతీయునిగా విశ్వనాథ్ చరిత్ర సృష్టించాడు. నగరంలోని బాలానగర్‌కు చెందిన రాజేంద్ర ప్రసాద్, లక్ష్మీ దంపతుల కుమారుడు విశ్వనాథ్ కార్తికేయకు చిన్నప్పటి నుంచే పర్వతారోహణపై ఆసక్తి ఉండేది. ఎవరెస్ట్ అధిరోహించాలనే లక్ష్యంతో ఐదేళ్లగా భారత సైన్యంలో సేవలందించిన మౌంటేనీర్ రోవిల్ బార్వాల్ వద్ద శిక్షణ పొందాడు. పట్టుదలతో పర్వతారోహణ ప్రారంభించిన విశ్వనాథ్ ఐదేళ్లలో శారీరకంగా, మానసికంగా అనేక సవాళ్లను తట్టుకుని ఇప్పటివరకు 23 శిఖరాలు అధిరోహించాడు. అయితే గత సంవత్సరమే ఎవరెస్ట్ అధిరోహించాలని భావించిన 16 సంవత్సరాలు నిండాలి అనే నిబంధనతో వీలు కాలేదు. ఈ సంవత్సరం ఎవరెస్ట్ ఎక్కాలనే లక్ష్యంతో ఏప్రిల్ 7న హైద్రాబాద్ నుంచి బయలుదేరిన విశ్వనాథ్ నేపాల్‌లోని కాఠ్మాండూ చేరుకుని అక్కడ ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. ఈ నెల 18న ఎవరెస్ట్ సాహసయాత్రను ప్రారంభించిన విశ్వనాథ్‌కు శిఖరంపైకి చేరుకోవడానికి పది రోజుల సమయం పట్టింది. ప్రతికూల పరిస్థితులను తట్టుకుని మంగళవారం ఉదయం విశ్వనాథ్ మరో ముగ్గురితో కలిసి ఎవరెస్ట్ శిఖరంపైకి చేరుకున్నాడు.



ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన విశ్వనాథ్ కార్తికేయ పడకంటి

ధాన్యం మొత్తం కొంటాం

(మొదటిపేజీ తరువాయి)

తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, రుతుపవనాలు, వానాకాలం పంటల సాగు అంశాలపై సమీక్షించారు. ముందస్తు వానల కారణంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖను సీఎం ఆదేశించారు. ఏజెన్సీ, అటవీ ప్రాంతాలున్న జిల్లాల కలెక్టర్లు ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

కేసులు పెట్టేందుకు వెనుకాడొద్దు..

"గతంలో ఎన్నడూ లేనంత ధాన్యాన్ని ప్రభుత్వం ఈసారి యాసంగిలో కొనుగోలు చేసింది. గతేడాది 42 లక్షల టన్నులు కొంటే.. ఈసారి ఇప్పటికే 64.50 లక్షల టన్నులు కొనుగోలు చేశాం. రైతులకు 48 గంటల్లోనే డబ్బులు చెల్లిస్తున్నాం. ఈ సీజన్లో ఇప్పటికే రూ.12,184 కోట్లు చెల్లించాం. ముందస్తు వానలతో అక్కడక్కడా ధాన్యం సేకరణకు ఆటంకం కలిగింది. సుమారు 4-5 లక్షల టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉంది. ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలి" అని కలెక్టర్లను సీఎం రేవంత్ ఆదేశించారు. 21 జిల్లాల్లో ధాన్యం సేకరణ విజయవంతంగా జరిగిందని, మరో 12 జిల్లాల్లో అక్కడక్కడా ఆందోళనలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళితే సమస్యలన్నీ అక్కడికక్కడే పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ఎప్పటికప్పుడు కొనుగోలు వివరాలను వెల్లడించాలని, వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలని ఆదేశించారు.

విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉండాలి..

ఈసారి వానాకాలం సీజన్ ముందుగానే వచ్చిందని, రాష్ట్రంలో ఇప్పటికే 29 శాతం అధిక వర్షపాతం నమోదైందని సీఎం చెప్పారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎరువులు, విత్తనాలు అవసరమైన మేర సిద్ధంగా ఉన్నాయా, లేదా అన్నది ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. నకిలీ విత్తనాలు, బ్లాక్ మార్కెటింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ఈ అంశంపై పర్యవేక్షణ కోసం ఇక ప్రత్యేక అధికారిని నియమించుకోవాలని సూచించారు.



"ఈ ఏడాది దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో 2.75 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇది మన రైతులు సాధించిన విజయం. ఇందులో భాగస్వామ్యమైన వ్యవసాయ శాఖ, పౌర సరఫరా విభాగాల అధికారులకు అభినందనలు. కలెక్టర్లు ధాన్యం సేకరణను నిరంతరం పర్యవేక్షించాలి. అవసరమైతే స్థానికంగా గోదాములు అద్దెకు తీసుకోవాలి. ఎక్కడైనా మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తీసుకోవాలి"

- వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వానలపై అప్రమత్తంగా ఉండండి

రాష్ట్రవ్యాప్తంగా వానలు పడుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలో జీహెచ్‌ఎంసీ, హైడ్రా, పోలీస్, ట్రాఫిక్, విద్యుత్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్‌ను ఆదేశించారు.

జూన్ 3 నుంచి మూడో దశ రెవెన్యూ సదస్సులు..

పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న భూభారతిని త్వరలోనే రాష్ట్రమంతా అమలు చేస్తామని రేవంత్ తెలిపారు. భూభారతిని ప్రజలకు చేరువ చేయాలని, రైతుల సమస్యలకు పరిష్కారం సూచించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జూన్ 3 నుంచి 20 వరకు రాష్ట్రమంతటా మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక కూపన్లు..

ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తుది జాబితాలు సిద్ధం చేయాలని కలెక్టర్లను సీఎం రేవంత్ ఆదేశించారు. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్, ఎంపీడీవో, కార్మిక అధికారితో పాటు స్వయం సహాయక సంఘం సభ్యులతో ఈ కమిటీలను ఏర్పాటు చేయాలని.. మేస్త్రీల చార్జీలు, కంకర ధరలను కట్టడి చేసే బాధ్యతను ఈ కమిటీలు చేపడతాయని తెలిపారు. లబ్ధిదారులకు ఉచిత ఇసుక కూపన్లను సకాలంలో అందించాలని ఆదేశించారు. ఇటుకల తయారీ, సెంట్రింగ్ యూనిట్ల కోసం ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ యువవికాసం ద్వారా రుణాలు ఇప్పించాలని సూచించారు.

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం..

బుధ, గురువారాల్లో జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు ఆయా జిల్లాల్లో పర్యటించాలని సీఎం సూచించారు. ధాన్యం సేకరణ, రెవెన్యూ సదస్సులు, వానాకాలం పంటల సాగు ప్రణాళికపై కలెక్టర్లతో సమీక్షించాలని చెప్పారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. జూన్ 1 నాటికి ఈ అంశాలన్నింటితో పూర్తి నివేదికలను అందించాలని మంత్రులు, కలెక్టర్లకు సూచించారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయండి

» విద్యాశాఖపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడులను బలోపేతం చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులతో పాటు విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యోగితారాణా, ఇతర అధికారులతో సీఎం మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బడుల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సీఎం రేవంత్‌కు వివరించారు. అదేవిధంగా వచ్చే విద్యా సంవత్సరంలో చేపట్టబోయే చర్యలకు సంబంధించి విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యోగితారాణా వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల బలోపేతం, విద్యార్థులకు అందించే యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, భోజనం మెనూ గురించి ప్రస్తావించినట్టు తెలిసింది. ఈ అంశాలన్నిటికి సంబంధించి పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేసుకుని త్వరలో మరో సమావేశానికి రావాలని సూచించారు.

ఎస్సీ గురుకుల విద్యార్థులకు నేడు సీఎం బహుమతుల ప్రదానం

ఎస్సీ గురుకులాల్లో చదివి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన పలువురు విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదుగా బహుమతులను అందించనున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబరు-10లో ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎస్సీ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు. ఐఐటీ, జేఈఈ, నీట్‌లో ర్యాంకులు సాధించిన, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్టు వెల్లడించారు.

విచారణకు ఓకే

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు కూడా. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ కమిషన్ ఇప్పటికే వందకుపైగా అధికారులు, ఇతర వ్యక్తులను విచారించింది. అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే నడుచుకున్నామని వారిలో అత్యధికులు కమిషన్‌కు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ ఇటీవల నోటీసులు జారీ చేసింది. కమిషన్ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని పేర్కొంది. విచారణకు హాజరవుతామని హరీశ్ రావు, ఈటల స్పష్టం చేసినా.. కేసీఆర్ విషయంలో ఉత్కంఠ రాజ్యమేలింది. తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ విద్యుత్తు అవకతవకలపై నియమించిన కమిషన్ నోటీసులు జారీ చేసినప్పుడు కేసీఆర్ న్యాయస్థానాలను ఆశ్రయించారు. సుప్రీం కోర్టు నుంచి ఊరట పొంది విచారణకు హాజరు కాలేదు. దాంతో, కాళేశ్వరం కమిషన్ ఎదుట ఆయన హాజరుపై సందిగ్ధం నెలకొంది. అయితే, విచారణకు హాజరు కావాలా వద్దా అనే అంశంపై ఇప్పటికే కేసీఆర్ రెండు దఫాలుగా ఎర్రవల్లి ఫాంహౌజ్‌లో మాజీ మంత్రి హరీశ్ రావుతో.. ఒకసారి కేటీఆర్‌తో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. నోటీసులపై ఏవిధంగా స్పందించాలి? విచారణ సమయంలో కమిషన్ అడిగే ప్రశ్నలకు మౌఖికంగా సమాధానం ఇవ్వాలా? లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలా? అన్న దానిపై కూడా వారు సమాలోచన చేసినట్లు తెలిసింది. ఇప్పటికే విచారణకు వెళ్లి వచ్చిన రిటైర్డ్ ఇంజనీర్లతోనూ బీఆర్‌ఎస్ అధినేత సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. వీటికితోడు, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు డ్యామేజీ అయ్యేవరకు జరిగిన పరిణామాలపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. విజిలెన్స్ నివేదికలో ఏం పేర్కొన్నారు? ఎక్కడ లోపాలు జరిగాయి? ఎన్‌డీఎస్‌ఏ ఏం చెప్పింది!? కాళేశ్వరం కమిషన్‌కు నిర్మాణ సంస్థలు ఏం సమాచారం ఇచ్చాయి? సమస్యలు తలెత్తడానికి ప్రధాన కారణాలు ఏమిటన్న దానిపైనా ఆయన ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇక, దేశవ్యాప్తంగా పలుచోట్ల నిర్మించిన ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్న వాటికి సంబంధించిన సమాచారాన్ని కూడా సేకరించినట్లు తెలిసింది.

జూన్ 3 నుంచి 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి జూన్ 13వ తేదీ వరకు నిర్వహించనున్నామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారావు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. మొత్తం 42,832 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 26,286 మంది బాలురు, 16,546 మంది బాలికలు. ఈ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 150 కేంద్రాలు ఏర్పాటు చేశామని కృష్ణారావు తెలిపారు. హాల్ టికెట్లను ఇప్పటికే విడుదల చేశామని, విద్యార్థులు సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి పొందవచ్చన్నారు.

కాంగ్రెస్‌తో రాయబారం!

(మొదటిపేజీ తరువాయి)

మరోసారి ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ విచారణ ముమ్మరమవుతోంది. ఈ కేసు కూడా బీఆర్‌ఎస్ పెద్దల మెడకు చుట్టుకోనుంది. ఎన్నికలు జరిగి ఏడాదిన్నర గడిచినా.. ఆ పార్టీ బలోపేతం కావడానికి బదులుగా నాయకత్వ రగడ నెలకొందని ఎమ్మెల్యేల్లో ఆందోళన నెలకొంది. పార్టీ పరిస్థితిని గమనించే కవిత సొంతంగా అడుగులు వేసేందుకు పావులు కదుపుతున్నారని, అదే బాటలో తాము కూడా ప్రత్యామ్నాయం చూసుకోవాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే, గతంలో అడుగు వెనక్కి వేసిన పలువురు ఎమ్మెల్యేలు ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ తలుపు తడుతున్నారని తెలుస్తోంది. నిజానికి, బీఆర్‌ఎస్‌కు ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేల్లో అత్యధికులు గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతం నుంచే ఉన్నారు. ఈ ఏడాది చివరికే జీహెచ్‌ఎంసీ ఎన్నికలు కూడా జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, కారు దిగి చేయి అందుకోవడానికి కూడా ఇదే సరైన సమయంగా సదరు ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. వాస్తవానికి, గత అసెంబ్లీ ఎన్నికల్లో బొటాబొటీ మెజారిటీతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దాంతో, కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందంటూ కేసీఆర్, హరీశ్ రావు తదితరులు పదే పదే ప్రకటనలు చేశారు. దీంతో, అప్రమత్తమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరతీశారు. పదిమంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పంచన చేరారు. అప్పట్లోనే, గ్రేటర్ సహా రాష్ట్రంలోని మరికొందరు ఎమ్మెల్యేల చేరికకూ రంగం సిద్ధమైంది. కానీ, ఫిరాయిస్తే సభ్యత్వం రద్దంటూ మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్.. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని జాతీయ స్థాయిలో బీఆర్‌ఎస్ ప్రచారం చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోనూ కాంగ్రెస్ అధిష్ఠానం ఆ ప్రక్రియను నిలిపేసింది. అయితే, తాజాగా, కేసీఆర్ కుటుంబంలో రేగిన చిచ్చుతో గందరగోళానికి గురవుతున్న ఎమ్మెల్యేలు ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌కు ఆకర్షితులవుతున్నారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

సొంత అడుగుల దిశగా..

రాయబారాలు విఫలం కావడంతో ఎమ్మెల్సీ కవిత తదుపరి కార్యాచరణపై దృష్టిసారించారు. సొంత బలం పెంచుకునేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగానే తెలంగాణ జాగృతి అనుబంధ సంఘాలను బలోపేతం చేయాలని ఆమె నిర్ణయించారు. తొలుత, గతంలో తనకు బలమైన పట్టున్న సింగరేణి ప్రాంతంపై దృష్టి సారించారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం సింగరేణి ప్రాంత జాగృతి శ్రేణులతో భేటీ అయ్యారు. 'సింగరేణి జాగృతి' పేరిట కొత్త సంఘానికి అంకురార్పణ చేశారు. 11 ఏరియాలకు కో ఆర్డినేటర్లను నియమించారు. ఇప్పటికే సింగరేణి ప్రాంతంలో బీఆర్‌ఎస్‌కు అనుబంధంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీజీబీకేఎస్‌కే) ఉంది. ఆ సంఘానికి కొంతకాలం పాటు కవిత గౌరవాధ్యక్షురాలిగా పని చేశారు. దానికి పోటీగా ఇప్పుడు మరో సంఘాన్ని ఏర్పాటు చేసినా.. టీజీబీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని కొత్త సంఘం నాయకులకు కవిత దిశా నిర్దేశం చేయడం విశేషం. సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా, సంస్థను కాపాడటమే ధ్యేయంగా సింగరేణి జాగృతిని ఏర్పాటు చేస్తున్నానని కవిత ఆ సమావేశంలో తెలిపారు. టీబీజీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ సింగరేణి జాగృతి పని చేస్తుందన్నారు. సింగరేణి కార్మికులు విద్య, వైద్యం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతితో సింగరేణి సంస్థనే అంతం చేయాలని కుట్రలు పన్నుతోందని, వాటిని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సంస్థలో 40 వేల మందికిపైగా కార్మికులు పని చేస్తున్నారని, వారిలో సగానికిపైగా యువకులే ఉన్నారని తెలిపారు. సింగరేణి స్కూళ్లను పునరుద్ధరించి సీబీఎస్‌ఈ సిలబస్‌లో విద్యా బోధన చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందజేయాలన్నారు. ఇక నుంచి కవిత అనుబంధ సంఘాలతో వరుసగా సమావేశమయ్యే అవకాశం ఉందని జాగృతి వర్గాలు వెల్లడించాయి. మేధావులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్‌తో సమావేశమవ్వడం, అనుబంధ సంఘాలను ప్రకటించడం, వాటిని మరింత బలోపేతం చేయడం దిశగా ఆమె అడుగులు ఉంటాయని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. అయితే, కవిత తాను సొంతంగా ఎదగాలనుకుంటోన్న నేపథ్యంలో ఆమె సొంతంగా త్వరలోనే పార్టీ పెడతారన్న ప్రచారం కూడా అప్పుడే మొదలైంది. బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కవిత పెట్టబోయే పార్టీ తేదీని కూడా ప్రకటించేశారు. జూన్ 2న ఆమె పార్టీ పెట్టే అవకాశాలున్నాయని, ఇప్పటికే కవిత నిర్ణయం తీసేసుకుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఆమె సన్నిహితులు, జాగృతి వర్గాలు మాత్రం కవిత పార్టీ పెట్టబోరని వెల్లడించాయి.



సింగరేణి జాగృతి కో ఆర్డినేటర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కవిత

కొత్తగా నియమితులైన జాగృతి కో ఆర్డినేటర్లు వీరే...


బెల్లంపల్లి - కిరణ్ ఓరం, శ్రీరాంపూర్ - కుర్మ వికాస్, మందమర్రి - ఎస్. భువన్, రామగుండం1 - బొగ్గుల సాయికృష్ణ, రామగుండం 2 - కె. రత్నాకర్ రెడ్డి, రామగుండం 3 - దాసరి మల్లేశ్, భూపాలపల్లి - నరేశ్ నేత, మణుగూరు - అజ్మీరా అశోక్ కుమార్, కొత్తగూడెం - వన్నంరెడ్డి వీర నాగేంద్ర సాగర్, కార్పొరేట్ - వసికర్ల కిరణ్ కుమార్, ఎస్‌టీపీపీ పవర్ ప్లాంట్ - కె. రామ్మోహన్ చారి.

మరో 20 గురుకులాల మంజూరు

» నిర్మాణానికి 4 వేల కోట్లు

హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 20 సమీకృత గురుకులాలు రానున్నాయి. ఒక్కో గురుకులానికి రూ.200కోట్ల చొప్పున.. వీటి నిర్మాణానికి రూ.4వేల కోట్లకు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరయ్యాయి. ప్రభుత్వం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు(జీవో 96) జారీ చేసింది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఒకటి చొప్పున.. మొత్తం 119 గురుకులాలను నిర్మించాలని సంకల్పించిన విషయం తెలిసిందే.! అయితే.. హైదరాబాద్‌లోని 14 నియోజకవర్గాల్లో స్థలాభావం కారణంగా.. ఆ సంఖ్యను 105కు కుదించారు. మొదటి రెండు దశల్లో 58 నియోజకవర్గాలకు గురుకులాలు మంజూరవ్వగా.. తాజాగా ఆలేరు, అశ్వారావుపేట, బాన్సువాడ, భద్రాచలం, భువనగిరి, దేవరకొండ, ఇబ్రహీంపట్నం, ఖానాపూర్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, పాలకుర్తి, పరిగి, పటాన్‌చెరు, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లిలో సమీకృత గురుకులాలు మంజూరయ్యాయి. దీంతో ఇప్పటి వరకు మంజూరైన గురుకులాల సంఖ్య 78కి చేరుకుంది. కొడంగల్, మధిర, హుజూర్‌నగర్‌లో సమీకృత గురుకులాల నిర్మాణానికి ఇప్పటికే టెండర్లను ఆహ్వానించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.


మీ పాదం మోపక తెలుగు ధరిత్రి చిన్నబోతోంది
మీ రూపు కానక తెలుగు గుండె తల్లడిల్లిపోతోంది
పెద్దమనసుతో ఈ ధరిత్రిని, ఈ గుండెని మరొక్కసారి తాకిపో తాతా..
సదా మీ ప్రేమకు బానిసను